
epaper.prajakalam.in
www.prajakalam.in
PRGI No.TELTEL/2010/33275
# ప్రజా కలం
PRAJA KALAM Telugu Daily — తెలుగు దినపత్రిక
గురువారం | 26-03- 2026 సంపుటి: 16, సంచిక: 351 పేజీలు: 12, వెల: 3/- ◆ ఎడిటర్: కలకొండ రామకృష్ణ ◆



ప్రజా కలం
Digital Editions
http://prajakalam.com
epaper.prajakalam.com
paperboy.com
www.magzter.com



ప్రజా కలం
PRAJA KALAM Telugu Daily
Classifieds & Public Notice Advertising
5 Lines Rs.250 only
క్లాసిఫైడ్స్ సంప్రదించండి
9010972526

## రేవంత్ రెడ్డికి హరీష్ రావు సవాల్

- సిద్దిపేటలో రేవంత్ రెడ్డి పోటీ చేయాలి
- ఎప్పుడు గోల్ కొట్టాలో మాకు బాగా తెలుసు
- రేవంత్ మళ్లీ సీఎం కాలేరు
- పునర్విభజనతో బీఆర్ఎస్ కు మేలు

### అసెంబ్లీని మరో వారం పొడిగించాలి: హరీష్ రావు


హైదరాబాద్, మార్చి 25 (ప్రజా కలం ప్రతినిధి)

అసెంబ్లీ లాబీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు చిట్‌చాట్‌లో భాగంగా సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. తల్లకిందులుగా తపస్సు చేసినా రేవంత్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కాలేరని, రాష్ట్రంలో తిరిగి బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడి కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయమని వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డి మళ్లీ సీఎం అవుతానని పగటి కలలు కంటున్నారని విమర్శించారు.

రేవంత్ రెడ్డికి సవాల్

దమ్ముంటే సిద్ధిపేటలో తనపై పోటీ చేయాలంటూ రేవంత్ రెడ్డికి సవాల్ విసిరారు.

తరువాయి 2వ పేజీలో...




## కాంగ్రెస్ పార్టీకి మాజీ మంత్రి జీవన్ రెడ్డి


# రాజీనామా

### ఉద్యమాలు కొత్తేమి కాదు- ఎదిరించి పోరాడుతా..

- అవమానాలు మానసిక క్షోభ ఎంతకాలం అనుభవించాలి
- చెప్పు చేతుల్లో ఉండే వారే కాంగ్రెస్ లో ఉండాలా...
- వారు మాత్రమే కాంగ్రెస్లో కొనసాగాలా ..
- స్క్రీన్ తీసుకొని సీఎం కావాలని పార్టీకి వస్తున్నారు...
- మీరు సీఎం అయితే సంతోషమే కానీ మమ్మల్ని కూడా బతకనివ్వాలి
- కాంగ్రెస్ పార్టీ వీడటం బాధాకరం- మాజీ మంత్రి జీవన్ రెడ్డి

2లో





## ఇంధన కొరత లేదు


- తప్పుడు ప్రచారాన్ని నమ్మవద్దు
- పెట్రోల్ కొరత లేదని ప్రకటించిన తెలంగాణ పెట్రోలియం డీలర్ల అసోసియేషన్

హైదరాబాద్, మార్చి 25 (ప్రజా కలం ప్రతినిధి)

తెలంగాణ పెట్రోలియం డీలర్ల అసోసియేషన్ ఇంధన కొరత లేదని ప్రకటించింది. హెచ్ పీసీఎల్, ఐవోసీఎస్, పీబీసీఎల్ వద్ద తగినంత స్టాక్ ఉందని ప్రకటనలో అధికారులు పేర్కొన్నారు. ఇంధన కొరత ఉందన్న తప్పుడు ప్రచారాన్ని నమ్మవద్దని సూచించారు. ఇంధనం దొరకదనే భయంతో బంకులకు క్యూ కడుతున్నారని అసోషియేషన్ సభ్యులు తెలిపారు. ముందస్తు కొనుగోళ్లతో ఇబ్బంది ఏర్పడుతోందని అధికారులు పేర్కొన్నారు. సాధారణ విక్రయాల కంటే దాదాపు మూడు రెట్లు పెరిగాయని అసోసియేషన్ ప్రకటించింది. సోషల్ మీడియాలో వదంతులతో వాహనదారులు ఆందోళన చెంద వద్దని విజ్ఞప్తి చేశారు. పెట్రోల్ , డీజిల్ దొరకదనే ఆందోళనతో అధిక మోతాదులో కొనుగోలు చేయవద్దని కోరారు. క్యాన్లు డ్రమ్ముల్లో పెట్రోల్, డీజిల్ కొని స్టాక్ పెట్టుకోవద్దని తెలిపారు.

## లొంగిపోయిన మావోయిస్టు అగ్రనేత పాపారావు

2లో






## కవిత కొత్త పార్టీ ప్రకటనకు ముహూర్తం ఖరారు

హైదరాబాద్, మార్చి 25 (ప్రజా కలం)

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత కొత్త పార్టీ ఏర్పాటుపై కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈనెల 27న శ్రీరామ నవమి రోజు పార్టీకి సంబంధించిన అధికారిక ప్రకటన చేసే అవకాశముందని సమా చారం. శ్రీరామనవమి రోజు ఉదయం 8 గంటలకు కొత్త పార్టీ ఏర్పాటు తేదీని ప్రకటించే అవకాశం ఉందని తెలంగాణ జాగృతి వర్గాలు చెబుతున్నాయి. ఈ సందర్భంగా పార్టీకి సంబం ధించిన ముఖ్య అంశాలు వెల్లడించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. తన మెట్టినిల్లు నుంచి పార్టీ సింబల్, విధివిధానాలు ప్రకటించే అవకా శం ఉందని జాగృతి వర్గాలు పేర్కొంటున్నాయి. అంతేకా కుండా, కవిత తాను పోటీ చేసే నియోజక వర్గాన్ని కూడా ఇదే సంద ర్భంలో వెల్లడించ వచ్చుని చర్చ జరుగుతోంది.

## కలం కౌంటర్




## 99 రోజల ప్రణాళికలో "2బిహెచ్‌కె"

# కేటాయింపులు పూర్తి చేస్తాం

### త్వరలో 1.12 లక్షల ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలు- జూన్ నాటికి మరో లక్ష పూర్తి

### పట్టణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇండ్లకు కార్యాచరణ

### రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్, మార్చి 25 (ప్రజా కలం ప్రతినిధి)

ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక-99 రోజుల కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో అసంపూర్తిగా ఆగిపోయిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం పూర్తిచేయడమేగాక, ఖాళీగా ఉన్న ఇండ్లను అర్హులైన నిరుపేదలకు కేటాయిస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు.

శాసనసభ సమావేశాల్లో బుధవారం నాడు సుమారు 22 మంది శాసనసభ్యులు ఇందిరమ్మ ఇండ్లు, డబుల్ బెడ్ రూం ఇళ్ల తదితరల అంశాలపై అడిగిన ప్రశ్నలకు మంత్రి పొంగులేటి సుదీర్ఘ వివరణ ఇచ్చారు.

రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో తలెత్తే సమస్యలను పరిష్కరించేందుకు వీలుగా త్వరలో ఉమ్మడి జిల్లాల పరిధిలో ప్రత్యేక సమీక్షా సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. సభ్యులు తమ దృష్టికి తెచ్చిన అంశాలతో పాటు మిగిలిన నియోజకవర్గాల్లోని ఇందిరమ్మ ఇండ్ల సమస్యలను పరిష్కరించేందుకు గాను కొద్ది రోజుల్లో ఒక టోల్ ఫ్రీ నెంబర్‌ను అందుబాటులోకి తెస్తామని వీటి ద్వారా వచ్చే ప్రశ్నలకు 24 గంటల్లోగా సమాధానం చెప్పడమేగాక వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి మూడు విభాగాలుగా సమస్యలను విభజించి పరిష్కరించడానికి చర్యలు చేపట్టినట్లు మంత్రి తెలిపారు. గతంలో నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చొరవతో ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రాంతంలో 21లక్షల ఇండ్లు నిర్మించారని తెలిపారు. మళ్లీ ఈ పేదల ప్రభుత్వంలోనే పెద్ద ఎత్తున ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం సాగుతోందని అన్నారు. గత ప్రభుత్వం రెండు లక్షల పైచిలుకు ఇండ్లను మంజూరు చేసి హైదరాబాద్ ప్రాంతానికి లక్ష ఇండ్లను కేటాయించగా వీటిలో 78,861 ఇండ్లు పూర్తయినా మౌలిక సదుపాయాలకు నోచుకోలేదని, 21, 838 ఇండ్లు కేవలం పునాదులకే పరిమితమయ్యాయని తెలిపారు.

జిహెచ్‌ఎంసీ పరిధిలో 26 కాలనీలు అసంపూర్తిగా ఉండిపోయాయని, తాము కొత్తగా కంటోన్మెంట్ నియోజకవర్గానికి ఇండ్లు మంజూరు చేశామని వివరిస్తూ 738 కోట్ల రూపాయిలతో మౌలిక సదుపాయాలు కల్పించామని తెలిపారు. తాము ఎటువంటి భేషజాలకు పోకుండా గతంలో అసంపూర్తిగా మిగిలిపోయిన 92వేల ఇళ్లలో 62వేల ఇళ్లు పూర్తి చేశామని చెప్పారు.

2023 ఎన్నికలకు ముందు నాటి ప్రభుత్వం 23,500 ఇండ్లను కేటాయించిందని అయితే నగరంలో వృత్తి వ్యాపారాలు చేసుకునే వారు సమారు 20-30 కిలోమీటర్ల దూరంలో కేటాయించిన ఇండ్లలోకి రాలేదని ఫలితంగా 12వేలకు పైగా ఇండ్లు ఖాళీగా ఉండిపోయాయని వివరించారు. దీనిపై ఉన్నతాధికారులు, నాలుగు జిల్లాల కలెక్టర్లు, ఇతర అధికారులతో మూడు సార్లు ప్రత్యేక సమావేశాలు నిర్వహించామన్నారు. లబ్దిదారులకు మరో అవకాశాన్ని కల్పిస్తూ రెండు నెలల్లోగా వీటిలో గృహప్రవేశాలు చేయాలని నోటీసులు ఇచ్చామని తెలిపారు. ఒకవేళ వారు రాలేక పోతే సుమారు 5-10 కిలోమీటర్ల పరిధిలో ఉండే అర్హులైన పేదలకు



కేటాయించేందుకు నిర్ణయించామని మంత్రి పొంగులేటి తెలిపారు. ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక-99 రోజుల కార్యక్రమంలో భాగంగా కొత్త కేటాయింపులు పూర్తి చేస్తామని సభకు తెలిపారు.

2017లో చేపట్టిన కాలనీలకు మౌలిక సదుపాయాలకు సంబంధించి గతంలో రూపొందించిన ఎస్టిమేషన్లు రద్దుచేస్తూ జీవో ఇచ్చామని, అదేవిధంగా జర్నలిస్టుల కాలనీలకు కూడా మౌలిక సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. రాష్ట్రంలో సుమారు 80 కాలనీలకు మౌలిక సదుపాయాల కోసం 784 కోట్లు మంజూరు చేశామని, వీటిలో సుమారు 432 కోట్ల రూపాయిలు ఖర్చు చేశామని ,మిగిలిన మొత్తంతో పాటు మరో 270 కోట్ల రూపాయిల వరకు అవసరం ఉంటుందని భావిస్తున్నామని అన్నారు.

రాష్ట్రంలో తొలివిడత 4.50 లక్షల ఇండ్లు మంజూరు చేస్తూ ప్రత్యేకంగా చెంచులకు, ఐటిడిఎ పరిధిలో గిరిజనులకు 12వేల ఇండ్లను మంజూరు చేశామని తెలిపారు. వివిధ కాలనీల్లో షాపులకు సంబంధించి లీజుకు ఇస్తే వారు సక్రమంగా అద్దెలు చెల్లించడం లేదని, పైగా కోర్టులకు వెళ్తున్నందున అద్దెలు వసూలు కావడం లేదని ఈ పరిస్థితుల్లో సదరు షాపులను బహిరంగ వేలంలో విక్రయించి వచ్చిన డబ్బును ఆయా కాలనీ కమిటీ, ప్రభుత్వం పేరిట జమచేసి వాటిపై వచ్చే వడ్డీతో విద్యుత్, లిఫ్ట్ తదితర అవసరాలుకు ఖర్చు చేసేలా ప్రతిపాదించామని తెలిపారు.

గతంలో అసంపూర్తిగా మిగిలిపోయిన డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణం పూర్తి, ఇంతవరకు కేటాయించని ఇండ్లకు సంబంధించి పాత కాంట్రాక్టర్లు అప్పటి రేటుకు సమ్మతిస్తే వారికి పనులు అప్పగిస్తామని తెలిపారు. ఈ 99 రోజులు ప్రణాళికా కార్యక్రమంలో లబ్దిదారుల ఎంపిక పూర్తిచేస్తామని , గతంలో నిర్మాణాలు చేపట్టి ఆపివేసిన లబ్దిదారులకు మిగిలిన నిర్మాణాలకు గాను నిధులు విడుదల చేస్తామని తెలిపారు.

తరువాయి 2వ పేజీలో...

## సోమశిల ఆలయంలో అపశృతి



### ధ్వజస్తంభం విరిగిపోవడంతో భక్తుల్లో ఆందోళన.

కొల్లాపూర్ మార్చి 25 (ప్రజా కలం ప్రతినిధి)


నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం సోమశిల గ్రామంలో శ్రీ వీర అభయఆంజనేయస్వామి దేవాలయంలో జరుగుతున్న విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో అపశృతి చోటుచేసుకుంది. మూడు రోజులుగా వేదమంత్రాల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించగా భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. బుధవారం ఉదయం ఆలయ ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించే కార్యక్రమం జరుగుతున్న సమయంలో గజస్థంభం మధ్యలో విరిగిపో యింది. దీంతో అక్కడ ఉన్న భక్తులు ఒక్కసారిగా అయోమయంలో పడిపోయారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి మాట్లాడుతూ విరిగిపోయిన ధ్వజస్తంభాన్ని మళ్లీ ప్రతిష్టించ రాదని ఆచార పరంగా భావిస్తారని తెలిపారు. త్వరలోనే కొత్త ధ్వజస్తంభాన్ని ఏర్పాటు చేసి ప్రతిష్ట కార్యక్రమాన్ని మళ్లీ నిర్వహిస్తామని తెలిపారు.

## ఇప్పపువ్వు సారా లాభాలు


- అసెంబ్లీలో వివరించిన జడ్చర్ల ఎమ్మెల్యే
- ఇప్పపువ్వుతో డయాబెటిస్ కంట్రోల్

హైదరాబాద్, మార్చి 25 (ప్రజా కలం ప్రతినిధి)

తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు కొనసాగుతున్నాయి. అసెంబ్లీలో జడ్చర్ల కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఇప్పపువ్వు సారా వల్ల కలిగే లాభాలపై మాట్లాడారు. ఇప్పపువ్వుపై



బ్రిటీష్ వాళ్లు బ్యాన్ విధించారని, ఇప్పపు వ్వు లిక్కర్ తయారీ, ఎగుమతిని నిషేధిం చారని వెల్లడించారు. ఇప్పపువ్వు తో ఇస్ క్రీమ్, లిక్కర్, కేక్, లడ్డూ చేయొచ్చని వివరించారు. ఇప్ప పువ్వును టీలో వేసుకుని తాగితే డయాబెటిస్ కంట్రోల్ అవుతుందన్నా రు. ఇప్పచెట్టుకు ఐదు వేల ఏళ్ల చరిత్ర ఉందని అనిరుధ్ రెడ్డి స్పష్టం చేశారు. ఇప్ప పువ్వుతో తయారయ్యే లిక్కర్ మంచిదని పెద్ద చెప్తున్నారు. ఇప్ప పువ్వుతో లిక్కర్ తయారుచేసి ఎగుమతి చేస్తే ఆదివాసీలకు ఆదాయం వస్తుందని ఆయన తెలిపారు. తెలంగాణలో మళ్లీ సారా దుకాణాలు తెరవాలంటూ జడ్చర్ల కాంగ్రెస్ ఎమ్మెల్యే ఇటీవల సంచలన వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. గతంలో సారా తాగిన వాళ్లు 115 సంవత్సరాలు బతికారని, ఇప్పుడు లిక్కర్ తాగి 80 ఏళ్లకే మరణిస్తున్నారని వెల్లడించారు. ఇంతకు సారా దుకాణాలు ఎందుకు మూసివేశారో అర్థం కావడం లేదన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా ఈ అంశంపై ప్రస్తావించి, సారా దుకాణాలు మళ్లీ తెరవాలని అసెంబ్లీలో అడుగుతానని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన బుధవారం నాడు ఇప్పపువ్వుపై ప్రస్తావించారు.






# కాంగ్రెస్ పార్టీకి మాజీ మంత్రి జీవన్ రెడ్డి రాజీనామా

## ఉద్యమాలు కొత్తేమి కాదు- ఎదిరించి పోరాడుతా..

- అవమానాలు మానసిక క్షోభ ఎంతకాలం అనుభవించాలి
- చెప్పు చేతుల్లో ఉండే వారే కాంగ్రెస్ లో ఉండాలా...
- వారు మాత్రమే కాంగ్రెస్లో కొనసాగాలా ..
- స్క్రీన్ తీసుకొని సీఎం కావాలని పార్టీకి వస్తున్నారు...
- మీరు సీఎం అయితే సంతోషమే కానీ మమ్మల్ని కూడా బతకనివ్వాలి
- కాంగ్రెస్ పార్టీ వీడటం బాధాకరం- మాజీ మంత్రి జీవన్ రెడ్డి



జగిత్యాల ప్రతినిధి మార్చి 25 (ప్రజా కలం ప్రతినిధి)

తనకు ఉద్యమాలు కొత్తేమీ కాదని... ఎదిరించి పోరాడుతానని కాంగ్రెస్ పార్టీలో అవమానాలు మానసిక క్షోభ ఎంత కాలం అనుభవించాలని మాజీ మంత్రి జీవన్ రెడ్డి అన్నారు. మీ చెప్పు చేతుల్లో ఉండే వారే కాంగ్రెస్ లో ఉండాలా... వారు మాత్రమే కాంగ్రెస్ లో కొనసాగాలా ..స్క్రీన్ తీసుకొని సీఎం కావాలని పార్టీకి వస్తున్నారు... మీరు సీఎం అయితే సంతోషమే కానీ మమ్మల్ని కూడా బతకనివ్వాలని మాజీ మంత్రి జీవన్ రెడ్డి అన్నారు. జన నాయకుడు, ప్రజా గొంతుక, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి బుధవారం నాడు జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ గార్డెన్లో తన అభిమానులచే ఏర్పాటుచేసిన సమావేశంలో కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించి సంబంధించిన లేఖను పత్రికలకు విడుదల చేశారు. ఈ సందర్భంగా నాలుగు దశాబ్దాల కాలంగా తనక అండగా ఉన్న అభిమానులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అయితే పదేళ్ల తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ రెండేళ్లు అవుతున్న పార్టీలో తన పట్ల చూపుతున్న వివక్షతపై అసంతృప్తిగా ఉన్నారు

గత కొంతకాలంగా తాను పార్టీకి రాజీనామా చేస్తానని ప్రకటించిన నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ముఖ్య నాయకులతో సంప్రదింపులు జరిపి బుజ్జగించేందుకు యత్నించిన ఆయన రాజీనామాకే సిద్ధమయ్యారు. ఇందుకోసం ఈనెల 25న తన నిర్ణయాన్ని ప్రకటిస్తానని వెల్లడించారు. అయితే బాధాకర విషయం ఏమంటే విధి లేని పరిస్థితిలో వీడుతున్నట్లు వెల్లడించారు. ఉదయం కాంగ్రెస్ కండువా వేసుకొని.. ఇందిరా భవన్ నుండి అభిమానులు, కార్యకర్తలు, నాయకుల నినాదాల మధ్య స్థానిక జంబి హనుమాన్ ఆలయం వరకు కాలినడక వెళ్ళి కొబ్బరికాయ కాయ కొట్టి, పూజలు చేసి, గొల్లపల్లి రోడ్ లోని బండారి గార్డెన్ వరకు వాహనంలో తరలి వెళ్లారు. నాలుగు దశాబ్దాల అనుబంధం వదులుకోవలని ఎవరు కోరుకోరని గత రెండేళ్లుగా పార్టీలో కొనసాగుతున్న పరిణామాలతో విధి లేని పరిస్థితి లో నిర్ణయం తీసుకున్నట్లు జీవన్ రెడ్డి వెల్లడించారు. 1984 లో కాంగ్రెసు పార్టీ చేరిన.. ఎన్నికల్లో గెలవడం ఓడటం సహజమని, ఉమ్మడి రాష్ట్రంలో జగిత్యాల ఐక్యతకు చిహ్నమని,స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఎవరు ముందుకు రాని పరిస్థితిలో సైతం స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం కాంగ్రెస్ పార్టీ ఐక్యత కు నిదర్శనమన్నారు. 1996 శాసన సభ ఉప ఎన్నికల్లో 1 లక్ష ఓట్లు పోలైతే 54 వేల మెజార్టీ తో గెలుపొందినట్లు తెలిపారు. ఉప ఎన్నికల్లో 73 శాతం ఓట్లతో గెలుపొందిన చరిత్ర దేశంలో ఏ రాష్ట్రంలో లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా కెసిఆర్ పై 2006, 2008 పార్లిమెంట్ ఉప ఎన్నికల్లో అధిష్ఠానం ఆదేశాల మేరకు పోటీ చేసినట్లు తెలిపారు. దశాబ్ద కాలం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల పై దౌర్జన్యం చేసిన వారిని మళ్ళీ పార్టీ లో స్థానం కల్పించారరని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల హక్కుల ను దోచుకన్నారని, విధి లేని పరిస్థితిలో బీ ఆర్ ఎస్ పార్టీ ఎమ్మెల్యేలను చేర్చుకున్న పార్టీ లో హక్కుల కు భంగం కలుగనివ్వమని కేసి వేణుగోపాల్, శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హామీ ఇచ్చారన్నారు. జగిత్యాల మార్కెట్ కమిటీ మారు గంగారెడ్డి, రాయికల్ మార్కెట్ కమిటీ చైర్మన్ మహిపాల్ రెడ్డి నియామకంలో అందరూ ఏకాభిప్రాయం తెలిపారని పేర్కొన్నారు. సీఏం రేవంత్ రెడ్డి ను కలసి మార్కెట్ కమిటీ చైర్మన్ ల ప్రతిపాదనలు అందచేయగా,వేం నరేంద్ర రెడ్డికి అప్పగించగా, ఏమైంది అని అడిగితే నాది ఏముందీ నాది పోస్ట్ మాన్ ఉద్యోగం సిఎం ఏది చెప్తే ఆది చేస్తా అన్నారని తెలిపారు. సీఏం అమెరికా పర్యటన నుండి తిరిగి వచ్చిన తర్వాత మార్కెట్ కమిటీ చైర్మన్ పోస్టుల కోసం రెండో ప్రతిపాదన చేశారన్నారు.

దశాబ్దాల తరబడి నాకు అండగా నిల్చిన నాయకుడు అతి కిరాతకంగా హత్యకు గురైతే నేను స్పందించలా వద్దా...ఓ కాంగ్రెస్ కార్యకర్త అతి దారుణంగా నడి బజారులో చంపబడితే కనీసం సి ఎం రేవంత్ రెడ్డి ఏం జరిగింది అని కూడా అడుగలేదన్నారు. 20 నెలలుగా నన్ను కించపరుస్తూ.. అడుక్కునే స్థాయికి తీసుకువస్తే ఏం చేయాలని, మొన్నటి వరకు ప్రభుత్వం మాత్రమే ఎమ్మెల్యేకు అండగా ఉందని అనుకున్న...కానీ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కూడా జతగా మారిందని, ఇక మిగిలింది ఏముంది..


పదవులు ఇచ్చే శక్తి లేకున్న కానీ ఆత్మ గౌరవం కాపాడాల వద్దా అని జీవన్ రెడ్డి ప్రశ్నించారు. మీనాక్షి నటరాజన్ 80 శాతం మీకే ప్రాధాన్యత ఉంటుందని హామీ ఇచ్చారని, శాసన మండలిలో ఒంటరి పోరాటం చేసిన.. నేను మంత్రి పదవికి అర్హుడిని కాదా.. సోనియా గాంధీ నిర్ణయం తీసుకున్నారు.. పిసీసి అధ్యక్షుడిగా తనను సోనియా గాంధీ నిర్ణయించుకున్న తర్వాత మారుతుందా, నాగార్జునసాగర్ ఉప ఎన్నికలు ఉన్నాయని వాయిదా వేశారని, పీ సీ సి అధ్యక్ష స్థాయి వ్యక్తిని నియోజక వర్గంలో నా హక్కుల కోసం పోరాటం చేయాల్సిన పరిస్థితి తీసుకువచ్చారని ఆందోళన వ్యక్తం చేసారు..ఎమ్మెల్సి జీవన్ రెడ్డి ఎదగకుండా అణగదొక్కాలని..రేవంత్ రెడ్డి ఆలోచన, అని, ఎదిరించి పోరాటం చేయం నాకు కొత్త కాదు. చంద్రబాబును, కెసిఆర్ ను ఎదిరించి పోరాటం చేసిన.రేవంత్ రెడ్డిను ఎదిరించి పోరాటం చేస్తా.. ఎదిరిస్తే పోయేది ఏముంది నీ అడుగులకు మడుగులు మడుగులు ఒత్తే వారు..కావాలి..మీకు ఎదిరించే వారు వద్దు.. రాహు లా గాంధీ ఆలోచనకు అనుగుణంగా నడిచేవాడినిపై అణగదొక్కుంటున్నారు. వేం నరేంద్ర రెడ్డి ఎవరు..చిన్న రెడ్డిని తనకు జరిగిన అవమానికి ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచన దిశగా తీసుకువచ్చారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పార్టీ నాది..అడ్డు వేస్తే తొక్కుత అంటున్నారు. ఎంత మంది తొక్కుతారు..అని నిలదీశారు.

మమ్మల్ని ఏ శక్తి కూడా అడ్డుకోలేదు...కార్యకర్తలను గౌరవించడం తెలుసుకో అని అని జీవన్ రెడ్డి సీఎం రేవంత్ రెడ్డికి హితవు పలికారు. నాలుగు దశాబ్దాలుగా అండగా నిల్చిన కార్యక్తలు నాకు తోడుగా నిలవాలని కోరుకున్నట్లు తెలిపారు. దేవుడు అవకాశం ఇస్తే జగిత్యాలను జాతీయ స్థాయిలో గుర్తు వచ్చేలా అభివృద్ధి చేస్తా..రెండేళ్లు అవమానాలతో గడిచిపోయిందని,మిగిలిన రెండేళ్లు పోరాటం చేద్దాం..అని పిలుపునిచ్చారు.మన హక్కుల కోసం.. ధర్మ కోసం పోరాటం చేద్దాం..... నాకు అండగా నిలువండన్నారు.నేను అనుభవించిన మానసిక క్షోభను వ్యక్తం చేసిన..నేను ముఖ్యమంత్రిని కావలనీ కోరుకోలేదన్నారు. మీ అణచివేత తొక్కుడు భరించలేక.. స్వేచ్ఛ కోరుకుంటున్న..మమ్మల్ని బతుకన్నివ్వండన్నారు. ఇకనైనా కాంగ్రెస్ కార్యకర్తల హక్కులను రక్షిస్తారని కోరుకుంటున్నట్లు వెల్లడించారు.

జీవన్ రెడ్డికి మద్దతుగా వందల వందలాది మంది రాజీనామాలు

కాంగ్రెస్ పార్టీకి రాజీనామా సమర్పించిన మాజీ మంత్రి జీవన్ రెడ్డి తోపాటు అతని మద్దతుగా వివిధ హోదాల్లో ఉన్న అనేకమంది నాయకులు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.






# రేవంత్ రెడ్డికి హరీష్ రావు సవాల్

మొదటి పేజీ తరువాయి...

బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు, రైతులు సహా అన్ని వర్గాలను రేవంత్ ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపించారు. డీలిమిటేషన్ వల్ల బీఆర్ఎస్కు మేలు జరుగుతుందని, మహిళా రిజర్వేషన్లను తమ పార్టీ స్వాగతిస్తుందని తెలిపారు. కుటుంబ నియంత్రణను పాటించిన దక్షిణాది రాష్ట్రాలకు ఆర్థిక, రాజకీయ నష్టం జరుగుతుందని కూడా ఆయన పేర్కొన్నారు.

కేవలం 16వేల ఉద్యోగాలే..

ఇక ఉద్యోగాల అంశంపై మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేకపోయిందని వ్యాఖ్యనించారు. రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి కేవలం 16,978 ఉద్యోగాలు మాత్రమే ఇచ్చారని, మొత్తం 16 నోటిఫికేషన్లు మాత్రమే విడుదల చేశారని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో ఇచ్చిన ఉద్యోగాలను కూడా కాంగ్రెస్ తమ ఖాతాలో వేసుకుంటోందని ఆరోపించారు.

17 బోర్డులకు ఆఫీసులు కూడా లేవు

సంక్షేమ బోర్డుల పరిస్థితిపై కూడా హరీష్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 33 సంక్షేమ బోర్డులు ఉన్నప్పటికీ, వాటిలో 16కి మాత్రమే కార్యాలయాలు ఉన్నాయని, మిగిలిన 17 బోర్డులకు కార్యాలయాలు కూడా లేవని తెలిపారు. కార్పోరేషన్లకు కేటాయించిన నిధుల్లో 99 శాతం లాప్స్ అవుతున్నాయని, కేవలం 2 శాతం మాత్రమే ఖర్చు చేస్తున్నారని ఆరోపించారు.

మరో వారం పొడిగించాలి

అసెంబ్లీ నిర్వహణపై కూడా ఆయన విమర్శలు చేశారు. సభను సమయానికి ప్రారంభించడం లేదని, టీ బ్రేక్ పేరుతో గంటల తరబడి వాయిదాలు వేస్తున్నారని అన్నారు. ముఖ్యమంత్రి ఢిల్లీ నుంచి రావడం, మంత్రుల సిద్ధత వంటి కారణాలతో సభను తరచుగా వాయిదా వేస్తున్నారని విమర్శించారు. ప్రతిపక్ష గొంతును నొక్కుతున్నారని ఆరోపించిన హరీష్, అసెంబ్లీని మరో వారం రోజుల పాటు పొడిగించాలని డిమాండ్ చేశారు.

వాళ్లకు 18 వేల వేతనం ఎప్పటి నుంచి ఇస్తారు..

ప్రభుత్వాన్ని నిలదీసిన హరీష్రావు

ఎన్నికల సందర్భంగా ఓట్లు దండుకోవడం కోసం అలవిమాలిన హామీలు ఇచ్చి ఇప్పుడు మాట తప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం పై బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మాజీ మంత్రి హరీష్రావు మండిపడ్డారు. అసెంబ్లీ వేదికగా రేవంత్రెడ్డి సర్కారుపై నిప్పులు చెరిగారు. ఆశావర్కర్లకు రూ.18 వేల వేతనం ఇస్తామని కాంగ్రెస్ పార్టీ నాడు తన ఎన్నికల మానిఫెస్టోలో పేర్కొన్నదని ఆయన గుర్తుచేశారు.

అయితే కాంగ్రెస్ తన మానిఫెస్టోలో పేర్కొన్న మేరకు ఆశా వర్కర్లకు రూ.18 వేల కనీస వేతనం ఎప్పటి నుంచి ఇస్తుందని ప్రశ్నించారు. గత వారం రోజులుగా ఆశా వర్కర్లు ధర్నా చేస్తున్నారని, ఇచ్చిన మాట ప్రకారం వారికి రూ.18 వేల కనీస వేతనం ఎప్పటి నుంచి అమలు చేస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కేసీఆర్ కిట్ను కూడా బంద్ చేశారని విమర్శించారు. దాంతో ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఇన్స్టిట్యూషనల్ డెలివరీలు 20% తగ్గాయని చెప్పారు. దీనిపై ప్రభుత్వ చర్యలు ఏమిటని ప్రశ్నించారు. కేసీఆర్ కిట్ను ఎప్పటి నుంచి తిరిగి ప్రారంభిస్తారో చెప్పాలని నిలదీశారు.

# లొంగిపోయిన మావోయిస్టు అగ్రనేత పాపారావు



రాయ్పూర్ మార్చి 25 (ప్రజా కలం ప్రతినిధి)

ఛత్తీస్గఢ్లో మావోయిస్టు సంస్థకు చెందిన అగ్ర నాయకుడు పాపారావుతో సహా మొత్తం 18 మంది మావోయిస్టులు బుధవారం నాడు ఛత్తీస్గఢ్ ఉప ముఖ్యమంత్రి విజయ శర్మ ఎదుట లొంగిపో యారు. ఆయుధాలు విడిచిపెట్టి లొంగిపోయిన వారిలో ఏడుగురు మహిళలు ఉన్నారు.

పాపారావు మావోయిస్టు సంస్థ రాష్ట్ర జోనల్ కమిటీ సభ్యుడిగా పనిచేశారు. దండకారణ్య ప్రాంతానికి చెందిన మోస్ట్ వాంటెడ్ పాపారావుపై రూ.2 కోట్ల రివార్డు. అనేక హింసాత్మక ఘటనలకు పాపారావు సూత్రధారిగా ఉన్నారు. దండకారణ్యంలో మావోయిస్టు సంస్థ విస్తరణలో పాపారావు కీలక పాత్ర పోషించారు. బస్తర్ ప్రాంతపు డివిజనల్ కేంద్రమైన జగదల్పూర్లో ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో ఈ మావోయిస్టులు లొంగిపోయారు.

లొంగిపోయే సమయంలో వారు ఎనిమిది ఏకే-47 రైఫిల్స్, ఒక సెల్ఫ్-లోడింగ్ రైఫిల్, ఒక బారెల్ గ్రెనేడ్ లాంచర్తో పాటు ఇతర ఆయుధాలను అధికారులకు అప్పగించారు. కాగా ఆపరేషన్ కగార్ క్లైమాక్స్ స్టేజ్ కి చేరింది. దేశవ్యాప్తంగా ఇప్పటి వరకు ఎంత మంది మావోయిస్టులు సరెండర్ అయ్యారు. డెడ్ లైన్ లోపు మిగిలినవాళ్లు దొరక్కపోతే ఏంటీ పరిస్థితి అన్న ప్రశ్న అందరిలో మెదులుతోంది. మరో ఆరో రోజుల్లో మావోయిస్టులకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ ఇచ్చిన డైడ్ లైన్ ముగియనుంది.

# 99 రోజల ప్రణాళికలో “2బిహెచ్కె” కేటాయింపులు పూర్తి చేస్తాం

మొదటి పేజీ తరువాయి...

ఇందిరమ్మ ఇండ్ల కమిటీలకు గ్రామాల్లో సర్పంచ్ అధ్యక్షునిగా ఉంటారని, ఆయన ఆధ్వర్యంలోని కమిటీ నిరుపేదలను ఎంపిక చేస్తే కలెక్టర్ పరిశీలన, అనంతరం జిల్లా ఇన్ఛార్జి మంత్రి ఆమోదంతో కేటాయింపులు జరుగుతాయని, రానున్న కాలంలో ఈ కమిటీల్లో ఎమ్మెల్యేలకు ప్రాతినిధ్యం కల్పించేలా పరిశీలిస్తామని ప్రకటించారు.

రాష్ట్రంలో ఈ మార్చి 31నాటికి సుమారు లక్షా 12వేల ఇందిరమ్మ ఇండ్లు పూర్తయి గృహప్రవేశాలు జరుగనున్నాయని, వచ్చే జూన్ నాటికి మరో లక్ష ఇండ్ల నిర్మాణం పూర్తవుతుందని మంత్రి పొంగులేటి ప్రకటించారు. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నేతృత్వంలో ఈ ఏడాది ఏప్రిల్లో రెండవ విడత ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని తెలిపారు. గతంలో గృహలక్ష్మి పథకం కింద ప్రారంభించి అసంపూర్తిగా ఆగిపోయిన ఇండ్లకు నిధులు ఇస్తామని దీనిపై కేబినెట్లో నిర్ణయం తీసుకోవలసి ఉందని తెలిపారు. జిహచ్ఎంసీ పరిధిలో ఇండ్ల నిర్మాణానికి గాను ఇప్పటికే 14-15 స్థలాలను గుర్తించామని , ఆయా ప్రాంతాలలోని నిరుపేదలకు ఇండ్లు ఇస్తామని , రాష్ట్రంలోని ఇతర ముఖ్యపట్టణాలలో కూడా ఇదే పద్ధతిని అమలు చేస్తామని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు.

## పాఠశాలలో సీసీ కెమెరాల ఏర్పాటు

మల్లాపూర్ మర్చి 25 ( ప్రజా కలం ప్రతి నిధి)

మల్లాపూర్ మండలం వెంకట్రావుపేట గ్రామంలోని ప్రభుత్వ హై స్కూల్‌లో ఎస్సై అనిల్ కుమార్ పిలుపు మేరకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ కనుముల వెంకటేష్



ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై అనిల్ మాట్లాడుతూ, సాంకేతికతను వినియోగిస్తూ సమాజాన్ని మరింత భద్రంగా, అభివృద్ధి దిశగా తీసుకెళ్లాలని సూచించారు. అలాగే "అరైవ్ అలైవ్" కార్యక్రమం నిర్వహించి, విద్యార్థులకు డ్రంక్ అండ్ డ్రైవ్ ప్రమాదాలు మరియు మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వేంపల్లి సర్పంచ్ గుగ్లావత్ రాజేందర్, పాఠశాల చైర్మన్ జారిన, ప్రధాన ఉపాధ్యాయులు దత్తాత్రి, కార్యదర్శి వేల్పుల సురేష్, ఉపసర్పంచ్‌లు తోట గంగారెడ్డి, రొడ్డ హారిక రాజు, మాజీ సర్పంచ్ ఆనంద్ గౌడ్, వార్డ్ సభ్యులు జక్కని మల్లేష్, బాలసాని రాములు, అంకుష్ తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి.

మెట్ పల్లి కోరుట్ల ప్రతినిధి మార్చి 25 (ప్రజాకలం) మండలంలోని జగ్గసాగర్ లో మొక్క జొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని



బుధవారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని మార్క్‌ఫెడ్ కార్యాలయంలోఎక్స్యూటివ్ ఆఫీసర్ చెక్కిళ్ల శ్రీనివాస్ కు పలువురు సర్పంచులు వినతి పత్రం సమర్పించారు. ఈ కేంద్రం ఏర్పాటు వలన సమీప గ్రామాల రైతులకు సౌకర్యం ఉంటుందని, కొనుగోలు ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు ఈ కార్యక్రమం జగ్గాసాగర్ సర్పంచ్ పుల్ల సాయగౌడ్ జగన్, వెల్లుల సర్పంచ్ గూడూరి తిరుపతి, కొండ్రికర్ల సర్పంచ్ గంట రాజేశ్వర్, చిల్వేరి విజయ్, రైతు కమిటీ సభ్యులు డబ్బా రాజారెడ్డి, పిడుగు అంజయ్య, రాజరాపు లింగం, మానల రాజేశ్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడల్లో కాంస్య పతకం సాధించిన ఏఆర్ సబ్ ఇన్స్పెక్టర్

### అభినందించిన జిల్లా ఎస్పీ అశోక్ కుమార్

జగిత్యాల ప్రతినిధి మార్చి 25 (ప్రజాకలం)

జమ్మూ లో నిర్వహించిన ఆల్ ఇండియా పోలీస్ స్పోర్ట్స్ (ఖో ఖో) పోటీల్లో తెలంగాణ పోలీస్ తరఫున పాల్గొని కాంస్య పతకం సాధించిన రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్ రమేష్‌ను బుధవారం జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు. జమ్మూ, కాశ్మీర్ పోలీస్ ఆధ్వర్యంలో




నిర్వహించిన ఆల్ ఇండియా పోలీస్ స్పోర్ట్స్ (ఖో ఖో) పోటీలలో తెలంగాణ రాష్ట్ర పోలీస్ తరఫున జగిత్యాల జిల్లా నుండి పాల్గొన్న రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్ రమేష్ విశేష ప్రతిభ కనబరిచి కాంస్య పతకం సాధించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ రమేష్‌ను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. దేశవ్యాప్తంగా నిర్వహించిన ఈ ప్రతిష్టాత్మక క్రీడా పోటీలలో తెలంగాణ పోలీస్ తరుపున పాల్గొని విజయాన్ని సాధించడం గర్వకారణమని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇంకా జాతీయ స్థాయిలో జరిగే క్రీడా పోటీలలో పాల్గొని మరిన్ని విజయాలు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రిజర్వ్ ఇన్స్పెక్టర్ కిరణ్ కుమార్ పాల్గొన్నారు .

## ఆర్థిక సాయం అందజేసినమెకానిక్ అసోసియేషన్ ...

ఇబ్రహీంపట్నం మార్చి 25( ప్రజా కలం (ప్రతినిధి) ఇబ్రహీంపట్నం మండలంలోనివేములకుర్తి గ్రామానికి చెందిన చిట్యాల సాయన్న అనారోగ్యంతో మృతిచెందడంతో వారి కుటుంబ సభ్యులకు మెట్పల్లి మెకానిక్ అసోసియేషన్ 25000 ఆర్థిక సాయం అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు. బుస రాజేశ్వర్ ఉపాధ్యక్షుడు సమ్మన్న. క్యాషియర్ . హరీష్ మరియు సభ్యులు సురేష్. బాబా. ఎస్.కె. మజార్. ఎం. సాయి తదితరులు పాల్గొన్నారు.



# అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

### జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్

### వివిధ అభివృద్ధి పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్





జగిత్యాల్ ప్రతినిధి మార్చి 25 (ప్రజాకలం)

ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు నాణ్యత పాటించాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ సూచించారు. బుధవారం నాడు జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని, ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికల పనులను ప్రత్యక్షంగా పరిశీలించడానికి జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ బుధవారం ఎండపల్లి, వెల్గటూర్ మండలాల్లో విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి, నిర్మాణ పనులను పరిశీలించారు. ఎండపల్లి మండలం పాత గూడూరు గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలను సందర్శించి, పాఠశాల పరిస్థితులు, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను సమీక్షించారు. అనంతరం నిర్మాణ దశలో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల పనులను పరిశీలించి, పనులను నాణ్యతగా, వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వెల్గటూర్ మండలం సంకెనపల్లి గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. అదేవిధంగా గ్రామ పంచాయతీ భవన నిర్మాణాన్ని కూడా సందర్శించి, పనులు సమయానికి పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం వెల్గటూర్ పట్టణ కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)ను పరిశీలించి, రోగులకు అందుతున్న వైద్య సేవలు, సౌకర్యాలపై ఆరా తీశారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ప్రభుత్వ పథకాల అమలు విషయంలో ఎలాంటి అలసత్వం సహించబోదని, ప్రతి పనిని నాణ్యతతో పూర్తి చేసి ప్రజలకు ఉపయోగపడేలా చూడాలని అధికారులను సూచించారు. ఈ కార్యక్రమాల్లో విద్యాధికారి కె. రాము, వైద్యాధికారి కె. సుజాత, డీపీవో మదన్ మోహన్, పిడి ప్రసాద్, ఈ ఈ పిఆర్ లక్ష్మణ్ రావు, తహసీల్దార్ లు, ఎంపిడివోలు తదితరులు పాల్గొన్నారు. ఓ

## జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ను సందర్శించిన జిల్లా కలెక్టర్

### -పాల్గొన్న జిల్లా విద్యాశాఖ అధికారి కిలావత్ రాము నాయక్



ఎండపల్లి, మార్చి 25 : ( ప్రజా కలం ప్రతినిధి )

జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గం ఎండపల్లి మండలం పాత గూడూర్ గ్రామం లో బుధవారం రోజున జిల్లా కలెక్టర్ ఎం సత్య ప్రసాద్ పాతగూడూరు పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజన పథకం కింద నిర్మాణం లో ఉన్న కిచెన్ షెడ్ పనుల ను పరిశీ లించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల నాణ్యత, పురో గతి, విద్యార్థుల కు పరిశుభ్రమైన ఆహారం తయారీకి అవసరమైన సౌకర్యాలను సమగ్రంగా పరిశీ లించారు. కలెక్టర్ 10వ తరగతి విద్యార్థుల తో పరస్పరం మాట్లాడి వారు వ్రాస్తున్న పరీక్షల గూర్చి, పాఠశాల లో అమలు జరుగు తున్న మధ్యాహ్న భోజనం ఇతర కార్యక్రమాలను సమీక్షించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ అనుభవాలను పంచుకు న్నారు. పాతగూడూర్ గ్రామ పంచాయతీ పరిధిలో ఇందిరమ్మ ఇల్లు, కిచెన్ షెడ్డు, పనులు పంచా యతీరాజ్ పనుల తనిఖీ చేశారు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు వేగంగా జరగాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమం లో జిల్లా కలెక్టర్ ఎం సత్యప్రసాద్, జిల్లా విద్యాశాఖ అధికారి కిలావత్ రాము నాయక్, డిపిఓ మదన్ హౌసింగ్ పిడి ప్రసాద్, పిఆర్ ఈఈ లక్ష్మణ్ రావు, మండల తహసీల్దార్ ఎడ్ల అనిల్ కుమార్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి దొండ కృపాకర్ మండల విద్యాశాఖ అధికారి సముద్రాల హరికృష్ణ, పిఆర్ ఏఈ రాజు, సర్పంచ్ జగదీశ్వర్ రెడ్డి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు కలెక్టర్ పాఠశాల సిబ్బంది కృషిని అభినందించి నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని విద్యార్థులకు పోషకాహారం అందించడం లో మరింత శ్రద్ధ వహించాలని సూచించారు. కిచెన్ షెడ్ పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని ఆదేశించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాధారాణి పాఠశాల సిబ్బంది తమకు సహకారం మార్గదర్శ నాన్ని అందిస్తున్న జిల్లా పరిపాలన యంత్రాంగానికి ప్రత్యేకించి జిల్లా పాలన అధికార యంత్రంగానికి కృతజ్ఞతలు తెలిపారు.

## వెల్గటూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రత్యేక ఉచిత వైద్య శిబిరం ప్రారంభం

### -గైనకాలజీ, పీడియాట్రిక్స్ సహా పలు విభాగాల సేవలు

### -ఉచిత వైద్య పరీక్షలు, మందుల పంపిణీ

### -డాక్టర్ తేజశ్రీ ఆధ్వర్యంలో శిబిరం నిర్వహణ -నిపుణుల ద్వారా రోగులకు పరీక్షలు



ఎండపల్లి, వెల్గటూర్ మార్చి 25 : ( ప్రజా కలం ప్రతినిధి )


జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గం వెల్గటూర్ మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 100 రోజుల ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక లో భాగంగా ప్రత్యేక వైద్య శిబిరం ఘనంగా నిర్వ హించారు. ఈ శిబిరాన్ని జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్, డీఎంహెచ్ఓ సుజాత, డిప్యూటీ డీఎంహెచ్ఓ శ్రీనివాస్ సందర్శించి నిర్వహణ, వైద్య సేవలను పరిశీలించారు. శిబిరం లో గైనకాలజీ విభాగానికి డాక్టర్ భారతి రాణి, పీడియా ట్రిక్స్‌కు, డాక్టర్ పూర్ణచందర్, ఆర్థోపెడిక్స్‌కు డాక్టర్ భారత్, నేత్ర వైద్యానికి డాక్టర్ సుజాత, దంత వైద్యానికి డాక్టర్ లావణ్య సేవలు అందించారు. జనరల్ మెడిసిన్ విభాగంలో డాక్టర్ ఇమ్తియాజ్ అలీ రోగులను పరీక్షించి చికిత్స అందించారు.

డాక్టర్ తేజశ్రీ ఆధ్వర్యం లో ఈ శిబిరం నిర్వ హించగా స్థానిక ప్రజలు భారీగా తరలివచ్చి వైద్య సేవలను వినియోగించుకున్నారు. రోగులకు అవసరమైన మందులు పంపిణీ చేయడంతో పాటు, ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. వైద్య సిబ్బంది సమయ పాలన పాటిస్తూ బాధ్యతతో పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమం లో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తాటిపర్తి శైలేందర్ రెడ్డి, సర్పంచ్ బండమీది కవిత, ఏఎంసీ వైస్ ప్రెసిడెంట్, స్థానిక నాయకులు, వైద్య సిబ్బంది గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## గురుకుల పాఠశాలలో సీట్లు సాధించిన విద్యార్థులకు సన్మానం...

ఇబ్రహీంపట్నం మార్చి 25 (ప్రజా కలం ప్రతినిధి )

ఇబ్రహీంపట్నం మండలం లోని డబ్బా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు గురుకుల మూడు (3)సీట్లు సాధించారు గొర్రె రూపేక్ష, వేముల రిషిత్, మునుగూరి సాకేత్ లు సాధించారు. ఈ సందర్భంగా డబ్బా గ్రామ సర్పంచ్ శ్రీమతి శ్రీ పుప్పాల లక్ష్మి -మహేష్, ఉప సర్పంచ్ రాపెల్లి మహేష్, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు తనుగుల రమేష్, వార్డ్ సభ్యులు ఉపాధ్యాయులు కలిసి తల్లి -తండ్రులకు కలిపి సన్మానం -చేసి డిక్షన రీలు అందజేశారు. ఈ కార్యక్రమం లో డబ్బా గ్రామ సర్పంచ్ ఉప సర్పంచ్ వార్డ్ సభ్యులు బైండ్ల విశాల్, కనుక నాగ రాజు, ముద్దం నరేష్, గ్రామ పెద్దలు మరియుఉపాధ్యాయులు




మండలజుఅశోక్, అల్లకట్టుసత్యనారాయణ, చిలుముల రాజేష్, ఆడెపు నరేష్, అల్లాడి హరి ప్రసాద్, బొల్లు శంకర్, జ్యోతి, తల్లి తండ్రులు సురేష్ -శ్రావ్య, రాజేశ్వర్, వేముల మౌనిక తదితరులు పాల్గొన్నారు

## పలు గ్రామాల లో బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుల ఏకగ్రీవ ఎన్నిక

### -మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆదేశాల మేరకు

ఎండపల్లి, వెల్గటూర్ మార్చి 25 : ( ప్రజా కలం ప్రతినిధి )

జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గం వెల్గటూర్ మండలం లో పలు గ్రామాల బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుల ఏకగ్రీవ ఎన్నికలు



మండల కమిటీ ఆధ్వర్యం లో బుధవారం రోజున ఎన్నికలు నిర్వహించడం జరిగింది మాజీ మంత్రివర్యులు కొప్పుల ఈశ్వర్ ఆదేశాల మేరకు చెగ్యాం, గ్రామ శాఖ అధ్యక్షునిగా దనిశెట్టి శ్రీనివాస్ ను, తాళ్ల కొత్తపేట గ్రామ శాఖ అధ్యక్షునిగా రంగు భూమయ్య గౌడ్ ను పత్తిపాక వెంకటేష్, జూపాక కుమార్ అధ్యక్షతన ఏకగ్రీవంగా బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల ఆధ్వర్యం లో నూతనంగా ఎన్నుకోవడం జరిగింది. ఇట్టి కార్యక్రమం లో రంగు తిరుపతి గౌడ్, రామిల్ల సనిల్, ద్యావన పెల్లి సుధాకర్, ధ్యావన పెల్లి ఎల్లయ్య, చొప్ప దండి సంతోష్, సామల రాజయ్య కోల సతీష్, కొమటిరెడ్డి రాంరెడ్డి, దేవేందర్, కోల బలరాం, లింగ స్వామి, ప్రసాద్, నరేష్, అనిల్, సంతోష్, శ్రీనివాస్, తిరుపతి, మహేష్, బాదం స్వామి రెడ్డి, గుండ లచయ్య, మహేందర్, కొమటిరెడ్డి సింధూజరెడ్డి, బొప్ప కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

## కొత్తపేట గ్రామంలో పశువులకు ఉచితంగా గాలికుంటు నివారణ టీకాలు

ఎండపల్లి, మార్చి 25 : ( ప్రజా కలం ప్రతినిధి )

జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గం ఎండపల్లి మండలం



కొత్తపేట గ్రామం లో పశువులకు ఉచితంగా గాలి కుంటు నివారణ టీకాలు వేయడం జరిగింది. పశువులు 48 ఆవులు, ఎద్దులు, 36 గేదెలకు ఉచితంగా గాలికుంటు నివారణ టీకాలు పశువులకు వేయడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ జీరెడ్డి మహేందర్ రెడ్డి, కిషన్ రావు, రైతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం.లో మండల పశు వైద్యాధికారిని డాక్టర్ పి శ్రీ ప్రియ, సిబ్బంది ఎస్ రాజేందర్, కె సంధ్య, జి నవీన్, పులి లక్ష్మి, కె కుమార్, ఏ రామ్ కుమార్ లు పాల్గొన్నట్లు మండల పశు వైద్యాధికారిని డాక్టర్ పి శ్రీ ప్రియ తెలిపారు.

## ఏఎంసి చైర్మన్ గుండాటి గోపిక-జితేందర్ రెడ్డి చైర్మన్ పదవి, కాంగ్రెస్ పార్టీకి రాజీనామా

### -జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ రాజీనామా ఎఫెక్ట్ తో పలు మండలాల్లో రాజీనామాలకు సిద్ధపడుతున్న సర్పంచులు

ఎండపల్లి, వెల్గటూర్ మార్చి 25 : ( ప్రజా కలం ప్రతినిధి )

జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గం వెల్గటూర్ మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుండాటి గోపిక జితేందర్ రెడ్డి చైర్మన్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు ఇక్కడ తాటిపర్తి జీవన్ రెడ్డి రాజీనామా చేయడంతో ఆయన అడుగు జాడల్లో కాంగ్రెస్ పార్టీకి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవికి గుండాటి గోపిక-జితేందర్ రెడ్డి బుధవారం రోజున రాజీనామా చేయడం జరిగింది. ఇదే బాటలో మరికొంత మంది సర్పంచులు మాజీ సర్పంచు లు పెగడపల్లి మండలానికి చెందిన బతికపల్లి సర్పంచ్ ముంజ మహేశ్వరి- మధుకర్, సహా ఇదే గ్రామానికి చెందిన మాజీ సర్పంచు లు తాటిపర్తి శోభారాణి, తాటిపర్తి ప్రభాకర్ రెడ్డి, నంచర్ల గ్రామ మాజీ సర్పంచ్ గోలి మహేందర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీకి రాజీనామా బాటలో ఉన్నట్లు సమాచారం వెల్గటూర్ మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి తో పాటు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు గుండాటి గోపిక-జితేందర్ రెడ్డి తెలిపారు.



# ఆయిల్ పామ్ పంట విస్తరణకు చర్యలు

**-జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**-ఇందిరమ్మ ఇండ్ల పురోగతి ఆధారంగా బిల్లుల చెల్లింపు**

సుల్తానాబాద్,మార్చి 25:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

జిల్లాలో ఆయిల్ ఫామ్ పంట విస్తరణకు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సుల్తానాబాద్ మండలం బొంత కుంట పల్లి గ్రామంలో పర్యటించారు.బొంత కుంట పల్లి గ్రామంలోని ఆయిల్ ఫామ్ తోటలను, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతిని కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష,బొంతకుంటపల్లి గ్రామంలో 30 ఎకరాలలో సాగు అవుతున్న ఆయిల్ పామ్, 4 ఎకరాలలో కోకో పంటలను పరిశీలించి క్రాప్ ఎప్పటి వరకు వస్తుందో ఆరా తీశారు.ఆయిల్



పామ్ తోటలో కోకో అంతర్ పంట సాగు చేసుకోవచ్చని తెలిపారు.సుల్తానాబాద్ మండలంలో 350 ఎకరాలలో ఆయిల్ పామ్ సాగు జరుగుతోందని కలెక్టర్ తెలిపారు.రాబోయే జూన్ నెల నుంచి కొన్ని చోట్ల ఆయిల్ పామ్ పంట కోతలు ప్రారంభమవుతాయని అన్నారు.మండలంలో ఆయిల్ ఫామ్ సాగు మరింత విస్తరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.ఆయిల్ పామ్ తోటలలో నరేగా క్రింద గడ్డి తొలగింపు చేర్చితే రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని రైతులు కలెక్టర్ ను కోరారు.ఆయిల్ పామ్ పంట సంబంధించి అధికారులు కంపెనీ ప్రతినిధుల నుంచి ఎప్పటికప్పుడు సూచనలు అందుతున్నాయని రైతులు తెలిపారు.పంట పురోగతి పట్ల కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు.

ప్రస్తుతం ఆయిల్ పామ్ పంట ద్వారా రైతులకు వచ్చే ఆదాయం గురించి విస్తృతంగా ప్రచారం చేసి మరింత వేగంగా పంట విస్తరణ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి సంబంధించి నిధులు ప్రభుత్వం రెగ్యులర్ గా విడుదల చేస్తుందని తెలిపారు.బొంతకుంటపల్లి గ్రామంలో ఆసరి రమ్య అనే లబ్ధిదారులు కడుతున్న ఇంటికి ఇప్పటివరకు ప్రభుత్వం 3 లక్షల 40వేలు విడుదల చేసిందని,ఇంటి నిర్మాణం పనులు పూర్తిచేస్తే మిగిలిన డబ్బులు విడుదల అవుతాయని,15 రోజుల వ్యవధిలో పెండింగ్ పనులు పూర్తి చేయాల్సి ఫైనల్ బిల్లు సబ్మిట్ చేయాలని కలెక్టర్ సూచించారు.ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట జిల్లా హార్టికల్చర్ సెరికల్చర్ అధికారి జగన్ మోహన్ రెడ్డి,ఎం.పి.డి.ఓ దివ్య దర్శన్ రావు,సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రైతు శ్రేయస్సే లక్ష్యంగా పని చేయాలి

**-జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**


పెద్దపల్లి,మార్చి25:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

వ్యవసాయ శాఖ అధికారులు రైతు శ్రేయస్సే లక్ష్యంగా పని చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో వ్యవసాయ శాఖ పని తీరు పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ జిల్లాలో 79 శాతం ఫార్మర్ రిజిస్ట్రీ పూర్తి చేశామని, దీనిని 85 శాతం వరకు పూర్తి చేసే విధంగా ఎం.ఏ.ఓ,ఏ.ఈ.ఓ సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ ఆదేశించారు.పీఎం కిసాన్ సమ్మాన్ నిధికి సంబంధించి రైతుల ఈ-కేవైసి పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు.రైతు బీమా పథకం అమలు పై వ్యవసాయ అధికారులు శ్రద్ధ పెట్టి రైతు మరణించిన తర్వాత త్వరగా సంబంధిత దరఖాస్తు ఫార్వార్డ్ చేస్తూ కుటుంబానికి సహాయం అందేలా చూడాలని అన్నారు.రాబోయే వానాకాలం సీజన్ కు అవసరమైన యూరియా పంపిణీ సజావుగా జరిగేందుకు పక్కా ప్రణాళిక సిద్ధం చేయాలని కలెక్టర్ తెలిపారు.వ్యవసాయ శాస్త్రవేత్తలతో కూడిన బృందాలు గ్రామాలలో పర్యటిస్తూ రైతు నేస్తం కార్యక్రమం ద్వారా రైతులకు నూతన సాగు పద్దతులు,భూ సారం పెంపుకు చర్యలు, పంట మార్పిడి విధానం పై అవగాహన కల్పించాలని అన్నారు. గ్రామాలలో పర్యటన సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల వివరాలు తెలియజేయాలని అన్నారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ శాఖ తరపున సంపూర్ణ ఏర్పాట్లు పక్కాగా చేయాలని అన్నారు.రబీ సీజన్ సంబంధించి ధాన్యం కొనుగోలు ప్రణాళిక ప్రకారం జరిగేలా చూడాలని అన్నారు.కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన ధాన్యం తీసుకుని వచ్చేలా రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు.ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్,మండల వ్యవసాయ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# సాంకేతిక సాకుతో ఇందిరమ్మ ఇళ్ల బిల్లులు ఆపొద్దు

**ఎమ్మెల్యే,ప్రభుత్వ విప్ విజయరమణ రావు**



పెద్దపల్లి,మార్చి 25:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

తెలంగాణ అసెంబ్లీ వేదికగా బుధవారం ఇందిరమ్మ ఇళ్ల అంశంపై జరిగిన చర్చలో పెద్దపల్లి ఎమ్మెల్యే,ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణ రావు కీలక ప్రసంగం చేశారు.గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో 2004-2014 పేద,మధ్యతరగతి కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లను అందించి ఆదుకున్న ఘనత తమ పార్టీదేనని ఆయన గుర్తు చేశారు.అదే సమయంలో,గత పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పేరుతో ప్రజలను మభ్యపెట్టి మోసం చేసిందని ఆయన విమర్శించారు.

రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మొదటి విడతగా 5 లక్షల ఇళ్లను మంజూరు చేసిందని,అందులో 4.5 లక్షల ఇళ్ల నిర్మాణాలు ఇప్పటికే వివిధ దశల్లో వేగంగా సాగుతున్నాయని ఆయన వివరించారు.అయితే,క్షేత్రస్థాయిలో లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సాంకేతిక ఇబ్బందులను ఆయన సభ దృష్టికి తీసుకువచ్చారు.ముఖ్యంగా ఉపాధి కోసం ట్రాక్టర్లు వినియోగిస్తున్న పేద కుటుంబాలకు, గతంలో ఉమ్మడి రాష్ట్రంలో కేవలం సిమెంటు డ్రా చేసుకున్న ఎల్3 కేటగిరీ లబ్ధిదారులకు నిబంధనల వల్ల ఇందిరమ్మ ఇళ్ల బిల్లులు రావడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.బేస్మెంట్ పూర్తి చేసుకున్న ఇటువంటి పేదలకు ఆయా నిబంధనలను సవరించి,బిల్లుల చెల్లింపులో తగిన మినహాయింపు ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ మేరకు స్పీకర్ గడ్డం ప్రసాద్ ద్వారా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి మరియు ప్రభుత్వానికి విజయరమణ రావు విన్నవించారు.ఓ

# పెన్షన్ వాలిడేషన్ యాక్ట్ ను తక్షణమే రద్దు చేయాలి

**-పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర సలహాదారులు వీరగోని పెంటయ్య**

పెద్దపల్లి,మార్చి 25:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన పెన్షన్ వాలిడేషన్ యాక్ట్ 2025ను తక్షణమే ఉపసంహరించుకోవాలని తెలంగాణ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర సలహాదారులు,పరిశీలకులు వీరగోని పెంటయ్య డిమాండ్ చేశారు.బుధవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఆవరణలో జిల్లా పెన్షనర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి పెన్షనర్లు భారీ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ సందర్భంగా పరిశీలకులు వీరగోని పెంటయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఏడవ పే కమిషన్ రిపోర్ట్ అమలు చేసే క్రమంలో తీసుకువచ్చిన ఈ కొత్త చట్టం పెన్షనర్ల పట్ల తీవ్ర వివక్షను చూపుతోందని మండిపడ్డారు.ఈ కమిషన్ సిఫార్సులు కేవలం జనవరి 2026 తర్వాత రిటైర్ అయిన వారికి మాత్రమే వర్తిస్తాయని,అంతకుముందు రిటైర్ అయిన వారికి ఈ ప్రయోజనాలు వర్తించవని పార్లమెంటులో చట్టం చేయడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు.గతంలో ఏ పే కమిషన్ సిఫార్సులైనా రిటైర్డ్ ఉద్యోగులందరికీ సమానంగా వర్తించేవని,కానీ ప్రస్తుత చట్టం వల్ల 2026 కంటే ముందు రిటైర్ అయిన పెన్షనర్లకు భవిష్యత్తులో ఎటువంటి ఆర్థిక లాభాలు కలగబోవని ఆవేదన వ్యక్తం చేశారు. సీనియర్ సిటిజన్ల పట్ల కేంద్రం ఇలాంటి వివక్షాపూరిత చర్యలు తీసుకోవడం తగదని,ఈ




చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసనలు తెలుపుతున్నట్లు వివరించారు.అనంతరం జిల్లా కలెక్టర్ ద్వారా దేశ ప్రధాని నరేంద్ర మోడీకి తమ మెమోరాండం చేరేలా కలెక్టరేట్ పరిపాలన అధికారి బండి ప్రకాష్ కు వినతి పత్రాన్ని సమర్పించారు.ఈ కార్యక్రమంలో జిల్లా బాధ్యులు జి.రాజయ్య,జి. రవీందర్రావు,ఎన్.కనకయ్య,రాజం రాజు,మారుతి రావు,జి.శ్రీనివాస్,గణపతి,రాజిరెడ్డి, కుమార్ రెడ్డి,నరసింహారావు,సుందరి అంజయ్య,రత్నయ్య,ప్రకాశం తదితరులు పాల్గొన్నారు.

# నిధులు విడుదలైనా అందని వేతనాలు

**-అధికారుల నిర్లక్ష్యంపై సిఐటియు ధ్వజం**



పెద్దపల్లి,మార్చి25:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

మంథనిలోని ప్రభుత్వ వైద్యశాల మరియు మాతా శిశు సంరక్షణ కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న రోగుల సంరక్షణ,భద్రత మరియు పారిశుధ్య కార్మికులకు రావలసిన రెండు నెలల వేతనాలను తక్షణమే చెల్లించాలని సిఐటియు డిమాండ్ చేసింది.ఈ మేరకు బుధవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ కు వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు బూడిద గణేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల వేతనాల కోసం నిధులు విడుదల చేసినప్పటికీ, మధ్యలో ఉన్న గుత్తేదారు మాత్రం కార్మికులకు డబ్బులు చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు.

తెలుగు వారి ప్రధాన పండుగైన ఉగాది పర్వదినాన వేతనాలు అందక కార్మిక కుటుంబాలు ఉపవాసం ఉండాల్సి రావడం అత్యంత సిగ్గుచేటని ఆవేదన వ్యక్తం చేశారు.నెలంతా కష్టపడి పనిచేస్తే ఇచ్చే ఏడు వేల రూపాయల అల్ప వేతనంతో ప్రస్తుత కాలంలో కుటుంబాలు ఎలా గడుస్తాయని ఆయన ప్రశ్నించారు.ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి,ప్రభుత్వం నుండి వచ్చిన బకాయిలను గుత్తేదారు ద్వారా కార్మికులకు ఇప్పించాలని కోరారు.అలాగే రాబోయే కొత్త ఒప్పందాల్లో కార్మికుల వేతనాలు పెంచాలని,భవిష్య నిధి సక్రమంగా అమలు చేయడంతో పాటు అన్ని రకాల వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు.

సమస్యలు పరిష్కరించని పక్షంలో కార్మికులను కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళనలు,పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఏల్పుల సురేష్తో పాటు కార్మికులు చందు,రమ,స్వరూప,రమ్య తదితరులు పాల్గొన్నారు.

# శాస్త్ర విజ్ఞాన ప్రతిభా పరీక్షల్లో గాయత్రి విద్యార్థుల విజయభేరి




పెద్దపల్లి,మార్చి25:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

యూనిఫైడ్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఈ ఏడాది జనవరి మాసంలో నిర్వహించిన 2025-26 జాతీయ శాస్త్ర విజ్ఞాన ప్రతిభా అన్వేషణ పరీక్షలలో పెద్దపల్లి గాయత్రి విద్యానికేతన్ విద్యార్థులు అద్భుత ప్రతిభను కనబరిచి స్వర్ణ పతకాలను కొల్లగొట్టారు.రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ స్థానాలను కైవసం చేసుకోవడం ద్వారా ఈ విద్యార్థులు పాఠశాల కీర్తిని దశదిశలా చాటారు.ప్రథమ తరగతికి చెందిన టి.అభ్యన్ సాయి రాష్ట్ర స్థాయిలో 27వ స్థానాన్ని సాధించగా, మనిశ్వర్ సాయి 28వ స్థానాన్ని దక్కించుకొని స్వర్ణ పతకాలు,ప్రశంసా పత్రాలను అందుకున్నారు.వీరితో పాటు జి.ఆద్యశ్రీ,ఏ.సాయి నిహాల్,బి.జశ్వంత్ లు కూడా స్వర్ణ పతకాలు సాధించి తమ మేధాశక్తిని నిరూపించుకున్నారు.ఈ సందర్భంగా విద్యార్థి జశ్వంత్ మాట్లాడుతూ ఇటువంటి పరీక్షలు తమలో విజ్ఞాన తృష్ణను పెంచుతాయని,విశ్లేషణాత్మక దృక్పథానికి ఇవి ఎంతో దోహదపడతాయని హర్షం వ్యక్తం చేశారు.విజేతలను అభినందిస్తూ విద్యాసంస్థల చైర్మన్ అల్లంకి శ్రీనివాస్ మాట్లాడుతూ జాతీయ స్థాయి పోటీ పరీక్షలు విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీస్తాయని,వారు ప్రతిభావంతులుగా ఎదిగేందుకు ఇవి ఎంతో తోడ్పడతాయని పేర్కొన్నారు.అనంతరం చైర్మన్,పాఠశాల కరెస్పాండెంట్ రజినీ దేవి,ప్రధానోపాధ్యాయులు విజయ్ విద్యార్థులకు పతకాలు,ధ్రువీకరణ పత్రాలను అందజేశారు.ఈ పరీక్షను సమర్థవంతంగా నిర్వహించిన సమన్వయకర్త,ఉపాధ్యాయురాలు నవ్యని పాఠశాల యాజమాన్యం ప్రత్యేకంగా అభినందించారు.

# జిల్లాలో పెట్రోల్ డీజిల్ కొరత లేదు

**-కలెక్టర్ కోయ శ్రీ హర్ష స్పష్టీకరణ**

**-భయంతో అనవసరపు కొనుగోలు చేయవద్దు**

పెద్దపల్లి,మార్చి 25:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

జిల్లాలో సమృద్ధిగా పెట్రోల్,డిజిల్ స్టాక్ ఉందని,ప్రజలు అనవసర భయాందోళనకు గురి కావద్దని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష బుధవారం ఒక ప్రకటనలో కోరారు.పెట్రోల్,డిజిల్ స్టాక్ పట్ల



కొంతమంది అనవసరపు ప్రచారాలు చేయడం వల్ల ప్రజలలో కొంత భయాందోళన ఉందని,మన జిల్లా పరిధిలో పెట్రోల్ డీజిల్ కు ఎటువంటి కొరత లేదని,ప్రతి పెట్రోల్ బంకు దగ్గర అవసరమైన మేర స్టాక్ అందుబాటులో ఉందని అన్నారు.జిల్లాలో ఉన్న పెట్రోల్ డీజిల్ స్టాక్ పై ఎప్పటికప్పుడు సంబంధిత ఐఓసిఎల్,బిపిసిఎల్,హెచ్ పి సిఎల్ ఏజెన్సీలతో సమీక్ష నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలు భయాందోళనతో అధికంగా పెట్రోల్,డీజిల్ కొనుగోలు చేయడం వల్ల పెట్రోల్ బంకుల వద్ద స్టాకు త్వరగా ముగుస్తుందని కలెక్టర్ తెలిపారు.పెట్రోల్ బంకుల దగ్గర అవసరమైన మేర పెట్రోల్ డీజిల్ ఎప్పటికప్పుడు రీ ఫిల్ చేసేందుకు చర్యలు చేపట్టామని,జిల్లాకు సరఫరా రెగ్యులర్ గా జరుగుతుందని,రామగుండంలో ఉన్న ఐఓసిఎల్, హెచ్.పి.సి.ఎల్ డిపోల నుంచి పెట్రోల్ బంక్ లకు ఎప్పటికప్పుడు రీఫిల్ చేస్తున్నట్లు తెలిపారు.ప్రజలు ఎవరు అనవసరపు భయాందోళనలకు గురికావద్దని,జిల్లాలు సమృద్ధిగా పెట్రోల్ డీజిల్ స్టాక్ ఉందని కలెక్టర్ ఆ ప్రకటనలో స్పష్టం చేశారు.

# జాబ్ మేళాతో ఉజ్వల భవిష్యత్తు

**-జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

పెద్దపల్లి,మార్చి 25:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

నిరుద్యోగ యువత జాబ్ మేళా ద్వారా వచ్చే ఉపాధి అవకాశాలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని టాస్క్ సెంటర్ లో జరుగుతున్న జాబ్ మేళాను




పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జిల్లా యంత్రాంగం అనేక చర్యలు చేపట్టిందని అన్నారు.టాస్క్ సెంటర్ ద్వారా అనేక నైపుణ్యం కోర్సులలో శిక్షణ అందిస్తూ వెంటనే మంచి ఎం.ఎన్.సి కంపెనీలలో ఉపాధి లభించేలా కూడా చర్యలు చేపట్టామని అన్నారు.టాస్క్ సెంటర్లో రిజిస్టర్ అయిన నిరుద్యోగులకు తప్పనిసరిగా ఉపాధి అందే విధంగా అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు.జాబ్ మేళా కార్యక్రమాలను టాస్క్ సెంటర్లో రెగ్యులర్ గా నిర్వహిస్తున్నామని అన్నారు.నేడు వివిధ కంపెనీల ద్వారా జాబ్ మేళా నిర్వహిస్తున్నామని,ఇందులో ఎంపికైన అభ్యర్థులకు శిక్షణతో పాటు ఉపాధి కూడా కల్పించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.జాబ్ మేళా వంటి కార్యక్రమాలను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట టాస్క్ సెంటర్ కౌసల్య,సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# పాము కాటుతో వృద్ధురాలు మృతి

**--కూతురు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఎస్ఐ ఎం ప్రవీణ్ కుమార్**

ఎండపల్లి, ధర్మారం మార్చి 25 : ( ప్రజా కలం ప్రతినిధి )

ధర్మపురి నియోజకవర్గం ధర్మారం మండలం గురుపల్లి



గ్రామానికి చెందిన నాంపెల్లి లక్ష్మమ్మ వయస్సు 78 సంవత్సరాల అను ఆమె తన ఇంటి ముందు చింత పండు ఆరబెట్టి, అరుగు పైన పడుకుని ఉండగా బుధవారం రోజున ఎదో గుర్తుతెలియని పాము తన కుడి చేతి పై కాటు వేసినది. ఆమెను వెంటనే పెద్దపల్లి హాసుపత్రి కి తీసుకు పోయి అక్కడి నుండి మెరుగైన చికిత్స నిమిత్తం కరీంనగర్ తీసుకు వెళ్తుండగా ఆమె మార్గ మధ్య లో పాము కుట్టిన విషం వలన చనిపోయినది అని ఆమె కూతురు అయినా నీరజ యొక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎం ప్రవీణ్ కుమార్తె తెలిపారు.

# ఎడ్ల బండ్ల పోటీలు నిర్వహించిన ఆలయ కమిటీ

గొల్లపల్లి మార్చి 25ప్రజా కలం ప్రతినిధి

గొల్లపల్లి మండలంలోని వెనుగుమట్ల బొంకూర్ ఇరు గ్రామలలోనీ శ్రీ వెంకటేశ్వర స్వామి జాతర ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. జాతర ఉత్సవాలలో భాగంగా మూడవ రోజు బుధవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఎడ్ల బండ్ల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో మొత్తం 15 ఎడ్ల బండ్లు పాల్గొనగా వీరిలో మొదటి బహుమతి షేక్ అయాన్ గెలుపొందగా విరికి దాత



ఆలయ కమిటీ 3 గ్రామాల బంగారం, రెండవ బహుమతి గెలుపొందిన కొక్కెర అంజిత్ రావు వీరికి 2 గ్రాముల బంగారం దాత నాడేం ప్రియాంక, మనోహర్,మూడవ బహుమతి గెలుపొందిన మదాసు శంకరయ్య వీరికి 3 గ్రాముల వెండిని దాత నేరెళ్ళ పద్మ,చంద్రగౌడ్ గెలుపొందిన వారికి అందజేశారు. భక్తులకు ఆలయ కమిటీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం స్వామి వారి శావ,ఆలయం చుట్టూ భక్తులు తమ ఎడ్ల బండ్లను ప్రదక్షిణ గా తిప్పారు. అనంతరం స్వామి వారి ఏకాంత సేవ నిర్వహించారు. గురువారం ఆలయంలో పంచ కుండాత్మక గాయత్రి మహాయజ్ఞం విశ్వ గాయత్రి పరివార్ శాంతి కుంజ్ హరిద్వార్ అనుబంధ ప్రజ్ఞ మండలీ జగిత్యాల వారిచే నిర్వహిస్తున్నట్టు కమిటి తెలిపారు ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రాంగోపాల్ రెడ్డి, ఎల్లాల రాజేశ్వర్ రెడ్డి సర్పంచులు నక్క స్రవంతి జమలాకర్, ముల్కాల శిరీష శ్రీనివాస్, కమలాకర్ రావు, ఉప సర్పంచ్ లు అవునూరి శ్రీధర్ ,గొల్లపెల్లి స్వామి గౌడ్ ,నేరెళ్ళ దేవేందర్ గౌడ్ ,మాదాసు గంగారం, మనోహర్ రావు , శ్రీనివాసరావు,ఎల్లాల లింగారెడ్డి , మధుకర్ రావు, అశోక్, సంతోష్ గౌడ్, వార్డు సభ్యులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

# డీసీ చొరవతో సమస్యల కు పరిస్కారం




కూకట్ పల్లి, మార్చి 25, ప్రజా కలం ప్రతినిధి:


రాజన్న టీమ్ ఫిర్యాదుతో హుటాహుటిన ఎల్లమ్మ బండ సమస్యలకు పరిష్కారం చూపిన ఆల్విన్ కాలనీ సర్కిల్ డీసీ చాముండేశ్వరి. ఎల్లమ్మ బండ భారతి విద్యాలయ స్కూల్ వద్ద ఉన్న కమ్యూనిటీ హాలు కొంతమంది వ్యక్తుల చేతుల్లోకి వెళ్లి వారి సొంత రాజకీయ పార్టీ ఫ్లెక్సీలు వేసుకొని సొంత ప్రయోజనాల కోసం వాడుకుంటున్నారని, మరియు యూపీహెచ్ సి సెంటర్ వద్ద పేరుకుపోయిన మట్టి వల్ల వచ్చే పేషెంట్లు మరియు స్థానిక ప్రజలకు తీవ్ర ఇబ్బంది అవుతుందని రాజన్న టీమ్ సభ్యుడు బుల్లెట్ రవి ఆల్విన్ కాలనీ సర్కిల్ డిసి ఛాముండేశ్వరి కి ఫిర్యాదు చేయగా, స్పందించిన డిసి వెంటనే అధికారులను ఆదేశించి చర్యలు చేపట్టి కమ్యూనిటీ హాల్ వద్ద ఉన్న ఫ్లెక్సీలు తొలగించడం జరిగింది. కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు పూర్తయిన వెంటనే అందరికీ అందుబాటులో ఉండే విధంగా ఏర్పాట్లు చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది. అలాగే యూపీహెచ్ సి వద్ద పేరుకుపోయి ఉన్న మట్టిని తొలగించడం జరిగింది. ప్రజావాణిలో పిర్యాదు ఇచ్చిన వెంటనే స్పందించి త్వరితగతిన కమ్యూనిటీ హాల్ మరియు యూపీహెచ్ సి వద్ద ఉన్న మట్టిని తొలగించినందున స్థానికులు డిసి చాముండేశ్వరి పనితీరుపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. కమ్యూనిటీ హాలు ఎల్లమ్మబండ లో గల అన్ని కాలనీలకు అందుబాటులో ఉండే విధంగా ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడంతో అన్ని కాలనీల సభ్యులు డిసిచాముండేశ్వరి మరియు రాజన్న టీమ్ కు ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు.

# మృతుని కుటుంబానికి పరామర్శ పాడే మోసిన ప్రజా ప్రతినిధులు

మల్హర్, మార్చి 25 ప్రజాకలం ప్రతినిధి...

మండల కేంద్రమైన తాడిచర్ల గ్రామానికి చెందిన ముడితనపెల్లి రామకృష్టయ్య మంగళవారం అనారోగ్యంతో మృతి చెందగ స్థానిక సర్పంచ్ బండి స్వామి, మాజీ సర్పంచ్ మల్క మోహనరావు లు మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. బుధవారం జరిగిన అంత్యక్రియలలో వార్డు సభ్యులు తిర్రి అశోక్ గౌడ్, ఇందారపు సారయ్య పాల్గొని నివాళు లర్పించారు. అనంతరం పాడే మోసి మానవత్వం చాటుకున్నారు.






# రామగిరి కోట అభివృద్ధిపై ఎంపీ వంశీకృష్ణ గళం

## -పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని పార్లమెంట్‌లో విన్నపం

## -ఎంపీ గడ్డం వంశీకృష్ణ చొరవపై సర్వత్రా హర్షం

పెద్దపల్లి,మార్చి 25:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధితో పాటు, చారిత్రక నేపథ్యం కలిగిన రామగిరి ఖిల్లాను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని పార్లమెంట్‌లో గళమెత్తిన ఎంపీ గడ్డం వంశీకృష్ణపై సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. బుధవారం పెద్దపల్లి ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఓదెల మండలం మడక మాజీ ఎంపీటీసీ ఆవుల ముత్తయ్య, కరుణ సేవా సంస్థ వ్యవస్థాపకులు బచ్చల్లి రాజయ్య పాల్గొని ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామగిరి కోట కేవలం ఒక కట్టడం మాత్రమే కాదని,అది మన పూర్వీకుల శౌర్యానికి,శిల్పకళా వైభవానికి నిలువుటద్దమని పేర్కొన్నారు. కోట పరిధిలో ఉన్న చారిత్రక ప్రాముఖ్యత కలిగిన నిర్మాణాలు శిథిలావస్థకు చేరుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తూ,ఇక్కడ లభించే అరుదైన ఔషధ మొక్కలు ఆయుర్వేద రంగానికి ఎంతో కీలకమని వివరించారు. విశాలమైన ప్రాంగణం,ప్రకృతి అందాలతో అలరారే ఈ ప్రాంతాన్ని పర్యాటక హబ్‌గా మార్చాలని, కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మేరా గావ్ -మేరీ ధరోహర్ పథకం కింద రామగిరి కోటను చేర్చి ప్రత్యేక నిధులు కేటాయించాలని వారు విజ్ఞప్తి చేశారు.

గత ఫిబ్రవరి నెలలో కరుణా సేవా సంస్థ ప్రతినిధులు జిల్లా కలెక్టర్‌ను కలిసి కోట అభివృద్ధిపై వినతిపత్రం సమర్పించిన విషయాన్ని వారు గుర్తు చేస్తూ,కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రాజకీయాలకు అతీతంగా సమన్వయంతో పనిచేసి రామగిరి ఖిల్లాను ప్రపంచ పర్యాటక పటంలో నిలపాలని కోరారు. ఎంపీ వంశీకృష్ణ దీనిపై పార్లమెంట్‌లో మాట్లాడటం ఈ ప్రాంత ప్రజలకు ఎంతో ఆశాజనకంగా ఉందని,ఎంపీ చొరవతో రాబోయే రోజుల్లో రామగిరి కోట రూపురేఖలు మారుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బైరెడ్డి వీరరెడ్డి,జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి గోసిక రాజేశం తదితరులు పాల్గొని తమ మద్దతు తెలిపారు. ఎంపీ గడ్డం వంశీకృష్ణ చొరవతో రాబోయే రోజుల్లో రామగిరి కోట రూపురేఖలు మారుతాయని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

# సెయింట్ ఆంథోనీస్ పాఠశాలలో ఘనంగా నిర్వహించిన" యులిప్స్ స్కిల్ దర్బార్" కార్యక్రమం




సంగారెడ్డి ప్రతినిధి మార్చి 25 (ప్రజా కలం ): సంగారెడ్డి పట్టణంలోని స్థానిక శాంతినగర్ లో గల సెయింట్ ఆంథోనీస్ పాఠశాలలో విద్యార్థుల చేత యులిప్స్ స్కిల్దర్బార్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఇట్టి ఈ కార్యక్రమంలో విద్యార్థులు తమ ప్రతిభాపాటవాలను ఉపాధ్యాయుల సహాయ సహకారాలతో బుధవారం నాడు చక్కటి వ్రాతతో,అందమైన డ్రాయింగ్ తో వాళ్ళ మనోభావాలను అందరిముందు ప్రదర్శించి, చూపించారు. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమేమిటంటే విద్యార్థులు ఈ అకాడమిక్ ఇయర్ లో నేర్చుకున్న విషయాన్ని ఇతరులకు తెలియజేయడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం. దీంట్లో భావవ్యక్తీకరణ, మనం జీవితంలో ఎలా ఎదగాలి, ఎలా ముందుకు సాగాలి అనేదే దీనియొక్క సారం. యూలిప్స్ వల్ల మనకు ఉపయోగం ఏమిటి అనే విషయాన్ని విద్యార్థులు తమభావవ్యక్తీకరణ వలన ప్రదర్శించి ఎదుటివారి కళ్ళకు కట్టినట్టుగా ప్రతి విషయాన్ని వాళ్లకు తెలియజేసి, వాళ్ళల్లో నిగూఢంగా దాగి ఉన్నటువంటి భావాలను ఇతరులతో పంచుకున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ఈ స్కిల్ దర్బార్ ద్వారా విద్యార్థుల్లో వచ్చిన మార్పులను గమనించి విద్యార్థి మునుముందు తమ జీవితంలో ఇంకెంతోముందుకు వెళుతున్నాడనే భావాన్ని వాళ్లు వ్యక్తపరిచారు. ఇలా చేయడం వల్ల విద్యార్థుల్లో నిగూఢంగాదాగి ఉన్నటువంటి మేధా సంపత్తి బయటకు వస్తుందని,ఇలా చేయడం వల్ల జీవితంలో ప్రతి విషయాన్ని ఆలోచించి,ముందుకు అడుగు వేస్తారని వారు తమ అంతర్గతభావాన్నీ వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో సెయింట్ ఆంథోనీస్ విద్యాసంస్థల డైరెక్టర్ గౌరవ శ్రీ ఈ.విజయ్ కుమార్ రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ మరియు ప్రిన్సిపాల్ గౌరవ శ్రీమతి ఈ. అరుణా రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ గౌరవ శ్రీ ప్రదీప్ లక్కిశెట్టి మరియు ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఇట్టి ఈ కార్యక్రమం సెయింట్ ఆంథోనీస్ విద్యాసంస్థల అధినేత గౌరవ డా"ఈ. సొలోమోన్ రెడ్డి పర్యవేక్షణలో వారి శుభాశీస్సులతో జరిగింది. ఇందులో ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.


# 12 వ వార్డ్ కౌన్సిలర్ నరసింహారెడ్డికి ఘన సన్మానం

## ప్రజా సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉంది - ఏఎంసీ చైర్మన్ నరేందర్ రెడ్డి

గజ్వేల్ :25 మార్చ్ 2026 ( ప్రజా కలం ప్రతినిధి )

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ 12వ వార్డు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ గా ఇటీవల ఎన్నికైన మార్కెట్ కమిటీ డైరెక్టర్ నరసింహారెడ్డికి మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్ రెడ్డి వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్ పాలకవర్గం ఆధ్వర్యంలో చిరు సన్మానం చేసి అభినందనలు తెలిపారు

ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్ రెడ్డి,వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్ మాట్లాడుతూ,రైతు సంక్షేమం ప్రజా సంక్షేమం కాంగ్రెస్ పార్టీ ధ్యేయమని అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉంటూ ప్రజల మెప్పు పొందుతున్న కాంగ్రెస్ పార్టీ ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులను గెలిపించిన ఓటర్లకు ధన్యవాదాలు తెలుపుతూ మార్కెట్ కమిటీ డైరెక్టర్ నరసింహారెడ్డి కౌన్సిలర్ గా అపూర్వ విజయం సాధించిన సందర్భంగా వారికి చిరు సన్మానం చేసి అభినందనలు తెలియజేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ సెక్రటరీ జాన్ వెస్లీ,మార్కెట్ కమిటి పాలక వర్గం సభ్యులు తదితరులు పాల్గొన్నారు




# కోఆప్షన్ సభ్యులుగా ట్రాన్స్‌జెండర్లకు అవకాశం కల్పించాలి .సిపిఐ పార్టీ నాయకులు డిమాండు

గజ్వేల్ :25 మార్చ్ 2026 ( ప్రజా కలం ప్రతినిధి )

గజ్వేల్ -ప్రజ్ఞాపూరు మున్సిపాలిటీలో కోఆప్షన్ సభ్యుల నియామకంలో ట్రాన్స్‌జెండర్ అవకాశం కల్పించాలని అట్లాగే గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ లో పెండింగ్ లో ఉన్న పనులను పూర్తి చేయాలని మల్లన్న సాగర్ భూనిర్వాసులకు రావాల్సిన నష్టపరిహాయాన్ని త్వరగా వచ్చేలా పాలకవర్గంలోనిర్ణయం తీసుకోవాలని ట్రాన్స్‌జెండర్ వ్యక్తులు కూడా ప్రజా సమస్యలపై అవగాహన కలిగి ఉండి, అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావడానికి కోఆప్షన్ సభ్యులుగా అవకాశం ఇవ్వడం అవసరమని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఈ నిర్ణయం తీసుకుంటే సమానత్వం,సామాజిక న్యాయం బలపడటమే కాకుండా ఇతర మున్సిపాలిటీలకు కూడా ఆదర్శంగా నిలుస్తుందని అభిప్రాయాలు వ్యక్తం చేశారుఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కమిటీ కౌన్సిల్ మాజీ సభ్యులు బట్టు దయానంద రెడ్డి,సిపిఐ పార్టీ గజ్వేల్ నియోజకవర్గ ఇన్చార్జ్ శివలింగ కృష్ణ. సిపిఐ పార్టీ నాయకులు వెంకట చారి తదితరులు పాల్గొన్నారు




# టీజీ సెట్ ఫలితాలు విడుదల

## -జిల్లా బీసి గురుకులాల కోఆర్డినేటర్ మణిదీప్తి

పెద్దపల్లి,మార్చి 25:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

తెలంగాణ రాష్ట్రంలోని బీసి,ఎస్సి,ఎస్టి, జనరల్ గురుకులాలలో 5వ తరగతి ప్రవేశాల కొరకు నిర్వహించిన టీజి సెట్ -2026 ఫలితాలను మంగళవారం అధికారులు విడుదల చేశారని జిల్లా బీసీ గురుకులాల కోఆర్డినేటర్ మణిదీప్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2026-




27 విద్యా సంవత్సరానికి గాను అడ్మిషన్లు కల్పించేందుకు ఈ పరీక్షను ఫిబ్రవరి 22న నిర్వహించారని,అభర్థులు తమ ఫలితాలను అధికారిక వెబ్సైట్ https://tgcet.cgg.gov.in లో చూసుకోవచ్చు అని,పరీక్షకు హాజరైన విద్యార్థులు హాల్ టికెట్ నెంబర్, రిజిస్టర్డ్ మొబైల్ నెంబర్,పుట్టిన తేది వివరాలను వెబ్సైట్ లో నమోదు చేయడం ద్వారా తమ ఫలితాలను పొందవచ్చు అన్నారు. విద్యార్థులకు తమకు కేటాయించిన పాఠశాల వివరాలు,ప్రధానోపాధ్యాయుల నెంబర్,అవసరా అయిన సర్టిఫికెట్స్,వంటి వివరాలు కూడా వారి ఫలితాల కాఫీ లో ఉంటుందని నిర్ణీత గడువు లోగా విద్యార్థులు సంబంధించిన పత్రాలను పాఠశాలల్లో అందించాలని,పెద్దపల్లి జిల్లా పరిధిలో 6 బీసి గురుకులాలు,అందులో 4 బాలికలు పెద్దపల్లిలోని రంగంపల్లిలో ఒకటి,గోదావరిఖని సప్తగిరి కాలని లో ఒకటి,మార్కండేయ కాలనీలో ఒకటి,సుల్తానాబాద్ లో ఒకటి,2 బాలురకు సప్తగిరి కాలనీలో ఒకటి,భూపతిపూర్ ఒకటి అందుబాటులో ఉన్నాయని,తల్లిదండ్రులు ఫలితాలు చూసుకొని,నిర్ణీత గడువులోపు వచ్చి,అడ్మిషన్ తీసుకోగలరని పెద్దపల్లి బీసి గురుకులాల కోఆర్డినేటర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న కటారి చంద్రశేఖర్ రావు

గొల్లపల్లి మార్చి 25 ప్రజా కలం ప్రతినిధి గొల్లపల్లి మండలం వెనుగుమాట్ల - బొంకూర్ గ్రామాల శ్రీ వేంకటేశ్వర స్వామినీ జగిత్యాల జిల్లా మాజీ గ్రంథాలయ చైర్మన్, సీనియర్



నాయకులు కటారి చంద్రశేఖర్ రావు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయగా ఆలయ అర్చకులు వారికి స్వామి వారి తీర్థ ప్రసాదాలు చిత్ర పటం అందజేసి ఆశీర్వదించారు ఈ కార్యక్రమంలో వెనుగుమట్ల, బొంకూర్ గ్రామ సర్పంచ్ లు నక్క స్రవంతి జమలకర్ ,

ముల్కల శ్రీనివాస్, ఛందోలి సర్పంచ్ జక్కుల పావని దస్తగిరి ఉప సర్పంచ్ దొనకొండ గంగాధర్, వెనుగుమాట్ల ఉప సర్పంచ్ స్వామి గౌడ్, ఆలయ కమిటీ చైర్మన్ ఎల్లాల గోపాలరెడ్డి,గ్రామ పెద్దలు ప్రభాకర్ రెడ్డి, కనపర్తి శ్రీనివాస్ రావు,మాదాసు గంగారాం, మనోహర్ రావు, మండల కాంగ్రెస్ నాయకులు కిష్టంపేట రమేష్ రెడ్డి, రఘుపతి గౌడ్, తిరుపతి, నవీన్ తదితరులు పాల్గొన్నారు...

# ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో అవార్డు గ్రహీతకు శాలువా తో ఘన సన్మానం

ఎండపల్లి, ధర్మారం మార్చి 25 : ( ప్రజా కలం ప్రతినిధి )

ధర్మపురి నియోజకవర్గం ధర్మారం మండలం మల్లాపూర్ బాలికల గురుకుల పాఠశాల కళాశాల మాజీ పేరెంట్స్ కమిటీ చేర్మెన్ సుంచు మల్లేశం కు ఇటీవల ఆంధ్రప్రదేశ్ రాష్టం లోని తిరుపతి లో బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షులు నల్లా రాధ కృష్ణ చేతుల మీదుగా డాక్టర్ బీ ఆర్ అంబెద్కర్ జాతీయ అవార్డు అందుకున్న సందర్బంగా బుధవారం రోజున పాఠశాల ప్రిన్సిపాల్ అరుణ ఆధ్వర్యం లో అవార్డు గ్రహీత సుంచు మల్లేశం ను శాలువా తో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మల్లేశం చైర్మన్ గా ఉన్న కాలం లో పాఠశాల లో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయడం తో పాటు విద్యార్థుల సౌకర్యార్థం అనేక మౌలిక వసతులు కల్పించెందుకు ఎంతగానో కృషి చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమం లో సూపరింటెండెండ్ మోషన్ అలీ, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ వెంకటలక్ష్మి, ఉపాధ్యాయులు శ్రీలత, రుసేంద్రమని, మమత,శోభ, ఎలక్ట్రీషియన్ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



## బస్తీ దావఖాన స్థలాన్ని పరిశీలించిన బిఆర్ఎస్ నాయకులు

మల్కాజిగిరి,మార్చి 25 ఇప్పుడు(ప్రజా కలం ప్రతినిధి)

పేదల ఆరోగ్యం మెరుగుపరచడానికి బస్తీ దవాఖానాను అందుబాటులోకి తేవాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను



చౌదరికి ఎమ్మెల్యే వినతిపత్రం అందించడంతో డిప్యూటీ డిఎంహెచ్ ఓ లావణ్య కు స్థానిక కలెక్టర్ ఆదేశాలు ఇవ్వడంతో సంబంధిత పనులను బుధవారం స్థానిక టిఆర్ఎస్ పార్టీ నాయకులు మేకల రామ్ యాదవ్ బీఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి బుధవారం పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్వరలో బస్తీ దావఖానను అందుబాటులోకి తీసుకువచ్చి పేదలకు వైద్య సేవలు అందించడానికి చర్యలు చేపడతామని హెల్త్ ఆఫీసర్ లావణ్య తెలిపారని బస్తీ దావఖాన స్థలాన్ని పరిశీలించిన నాయకులు చెప్పారు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ పార్టీ నాయకులు బైరు అనిల్,మద్రి శ్రీనివాస్, వెంకటేష్,అశోక్,కాలనీ బస్తివాసులు తదితరులు పాల్గొన్నారు.

## హెల్త్ క్యాంపులో 214 మంది రోగులకు ఉచిత పరీక్షలు...

ఎల్లారెడ్డి మార్చ్ 25 ప్రజా కలం ప్రతినిధి : "ప్రజా పాలన – ప్రగతి



ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా బుధవారం ఎల్లారెడ్డి మండలంలోని మత్త మాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి రవీందర్ గౌడ్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరంలో 214 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన మందు గోలీలు పంపిణీ చేసినట్లు వైద్యులు శరత్ కుమార్ తెలిపారు. ఈ క్యాంపులో వివిధ విభాగాల లో సేవలు పొందిన వారి వివరాలు ఇలా ఉన్నాయి. గైనకాలజీ -- 77 మంది, జనరల్ మెడిసిన్ -- 33, ఆర్థో -- 23, డెంటల్ -- 18, ఒప్తమాలజీ -- 56, పెడియాట్రిషన్ -- 7 గురు మొత్తం 214 మంది రోగులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించామన్నారు. వీరిలో 28 మంది రోగులను మెరుగైన వైద్యం కోసం కామారెడ్డ...

## 11వ వార్డు ఎస్సీ కాలనీలో - నూతన వీధిలైట్లు ఏర్పాటు పట్ల స్థానికుల హర్షం

ఎల్లారెడ్డి మార్చ్ 25 ప్రజా కలం ప్రతినిధి : ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలోని 11వ వార్డు లింగారెడ్డిపేట్ ఎస్సీ కాలనీ వరకు నూతన విద్యుత్ లైన్ వేసి వీధి దీపాలు ఏర్పాటు చేయించినట్లు బుధవారం మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... లింగారెడ్డి పేట గ్రామం మున్సిపల్ లో విలీనం అయినప్పటి నుండి ఎటువంటి అభివృద్ధికి నోచుకోవడం లేదని, నిత్యం కాలనీ ప్రజలు ఎల్లారెడ్డి పట్టణంలోని వివిధ దుకాణాలు, హోటల్లు, వ్యాపార సముదాయాలలో కూలీలుగా పనులు చేసుకుంటూ రాత్రివేళ రాకపోకలు సాగిస్తూ తిరిగి వెళ్లే క్రమంలో వీధిలైట్లు లేక చీకట్లో ఇబ్బందులు ఎదుర్కొనేవారన్నారు. ఇటీవల చీకట్లో కాలినడకన వెళున్న ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందారని, అలాగే చీకట్లో పాములు సంచరిస్తూ ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయని ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు దృష్టికి తీసుకు వెళ్లడం జరిగిందన్నారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే వీధి దీపాలు ఏర్పాటు చేయాలని ఆదేశించడంతో నూతన విద్యుత్తులైన వేసి వీధి దీపాలు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్ లకు కృతజ్ఞతలు తెలిపారు.



### సిబ్బందిపై పనిభారం తగ్గించకపోతే

# ఏప్రిల్ లో ధర్నా, ఆపై సమ్మె తప్పదు

### -జిల్లా అధ్యక్షులు కాల్వ చక్రధర్ హెచ్చరిక



గజ్వేల్, 25 మార్చి 2026 (ప్రజా కలం ప్రతినిధి )

సిద్దిపేట జిల్లా గజ్వేల్ ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్ ఆవరణలో "పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్" (3194) (ఐ.ఎన్.టి.యు.సి.) సిద్దిపేట జిల్లా 2వ కార్యవర్గ సమావేశం బుధవారం ఘనంగా నిర్వహించబడింది. జిల్లా అధ్యక్షులు కాల్వ చక్రధర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు.

అధికారుల ఒత్తిడి – సిబ్బంది మనోవేదన

ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు కాల్వ చక్రధర్ మాట్లాడుతూ,ప్రజలకు నిరంతరం సేవలు అందిస్తున్న వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది రాత్రింబవలు విధుల్లో నిమగ్నమై ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు.రోజువారీ విధుల్లో 60 శాతం సమయం ఆన్లైన్,ఆఫ్ లైన్ పనులకే సరిపోతోందని, జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బంది కొరత వల్ల పనిభారం పెరిగి సిబ్బంది శారీరకంగా,మానసికంగా కృంగిపోతున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా ఆశా కార్యకర్తలు సమ్మెలో ఉన్న సమయంలో,కుష్టు వ్యాధి గుర్తింపు సర్వే కోసం క్షేత్రస్థాయి సిబ్బందిని ఇంటింటికి వెళ్ళమనడం అసమంజసమని ఆయన మండిపడ్డారు. కుకునూరు పల్లి, దౌల్తాబాద్,అక్కన్నపేట, కొండపాక పీహెచ్సీల్లోని సమస్యలను త్వరలోనే జిల్లా కలెక్టర్ మరియు డీఎంహెచ్ఓ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

ప్రధాన డిమాండ్లు:

వెంటనే ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలి మరియు సిబ్బంది రేషనలైజేషన్ చేపట్టాలి. నాడు ప్రకటించిన పీఆర్సీ ( పిఆర్సి) ని అమలు చేయాలి మరియు డీఏ (డిఏ) బకాయిలను విడుదల చేయాలి. కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ సిబ్బందిని క్రమబద్ధీకరించి, వారికి రావాల్సిన 10 నెలల వేతన బకాయిలను వెంటనే చెల్లించాలి. మెడికల్ బిల్లులు, రిటైర్డ్ ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాలను తక్షణమే విడుదల చేయాలి. 36 రకాల ఆన్లైన్ యాప్స్, 36 రకాల రిజిస్టర్ల పేరుతో సిబ్బందిని వేధిస్తున్న అధికారుల తీరు మారాలి.

ఆందోళన బాటలో యూనియన్

న్యాయమైన కోర్కెలు తీర్చని పక్షంలో ఏప్రిల్ నెలలో జిల్లా వ్యాప్త ధర్నాలు నిర్వహిస్తామని,అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే సమ్మె నోటీసు ఇచ్చి వైద్య సేవలను నిలిపివేస్తామని చక్రధర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు పొండవుల కుమారస్వామి, కాసుల రవీందర్ రెడ్డి, బి. శ్రీనివాస్,రాష్ట్ర అసోసియేట్ కార్యదర్శి భూంపల్లి రాజు, గౌరవాధ్యక్షులు చెరుకు భాస్కర్, ప్రధాన కార్యదర్శి పి. శ్రీనివాస్ రెడ్డి, జిల్లా మహిళా అధ్యక్షురాలు కాల్వ శోభ, గజ్వేల్ డివిజన్ నాయకులు ఆదిమూలం నారాయణ,దేవసాని వాసుదేవ్, జి. మంగ,మరియు పెద్ద సంఖ్యలో పారామెడికల్ సిబ్బంది, ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొన్నారు.

# మహేశ్వరంలో అంబేద్కర్, జగ్జీవన్‌రాం విగ్రహాలకు రక్షణ కల్పించాలి

### సిఐ రాఘవేందర్ రెడ్డి కి వినతి పత్రం అందించిన దళిత నాయకులు



మహేశ్వరం, మార్చ్ 25,(ప్రజా కలం)

మహేశ్వరం నియోజకవర్గ కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఉన్న డా. బీఆర్ అంబేద్కర్, డా. జగ్జీవన్‌రాం విగ్రహాలకు తక్షణమే రక్షణ కల్పించాలని స్థానిక నాయకులు పోలీసులను కోరారు. ఈ మేరకు మహేశ్వరం పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. నాయకులు తెలిపిన వివరాల ప్రకారం, 1991 సంవత్సరంలో శంకుస్థాపన చేసి డా. బీఆర్ అంబేద్కర్, డా. జగ్జీవన్‌రాం విగ్రహాలను ఏర్పాటు చేయడం జరిగిందని అప్పటి నుంచి ఆ ప్రాంతం "అంబేద్కర్ చౌరస్తా"గా ప్రసిద్ధి చెందిందని పేర్కొన్నారు. అయితే ఇటీవల కొంతమంది రాజకీయ దురుద్దేశ్యాలతో మహనీయుల విగ్రహాలను అవమానించేలా ప్రవర్తిస్తూ, కుల, మత ఘర్షణలకు దారితీసే పరిస్థితులు సృష్టిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. శివాజీ విగ్రహాల ఏర్పాటుకు ఇతర ప్రాంతాల్లో సరైన స్థలాలు ఉన్నప్పటికీ, ఉద్దేశపూర్వకంగా అంబేద్కర్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేయాలని ప్రయత్నించడం వల్ల దళితులను రెచ్చగొట్టే పరిస్థితులు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొనే ప్రమాదం ఉందని తెలిపారు. కాబట్టి డా. బీఆర్ అంబేద్కర్, డా. జగ్జీవన్‌రాం విగ్రహాలకు పోలీస్ రక్షణ కల్పించి, శాంతి భద్రతలు కాపాడాలని, అదే విధంగా ఆ ప్రదేశంలో ఇతర విగ్రహాల ఏర్పాటు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

ఈ కార్యక్రమంలో వత్తుల రఘుపతి, చిలకమర్రి నర్సింహా, హన్మగళ్ల చెంద్రయ్య, ఎంఆర్పీఎస్ మండల అధ్యక్షుడు ఎర్ర గణేష్, ఎంఎస్పీ మండల అధ్యక్షుడు ఎర్ర కృష్ణ, ఎంఆర్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి గట్టగల్లా ప్రశాంత్, బక్కని రవి మాదిగ (సీనియర్ నాయకులు), పేయ్యల భూషణ్, స్వర్ణ గంటి . సంజీవ్, స్వర్ణ గంటి ఆనంతయ్య, డాక్టర్ జంగన్న, బి. అగమయ్య, డి. నర్సింహా, ఏలే చెన్నయ్య, పుట్లగారి చెందు, పెయ్యాల దేవేందర్, బహదూర్ గూడెం మహేందర్, డి. కిరణ్, స్వర్ణగంటి ఆకాష్, గణేష్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రఖ్యాత నుక్కడ్ సీరియల్ నటుడితో తెలుగు ప్రముఖులు



నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) మార్చ్ 25:

1985వ ఏటా భారత దేశంలో టీవీ సీరియల్స్ ప్రారంభమైన సందర్భంగా తొలి సామాజిక అంశంపై బొంబెలెత్తించిన హిందీ సీరియల్ "నుక్కడ్" విధి మూల, కూడలి అని తెలుగులో దాని అర్థం. ఈ సీరియల్ వారానికోసారి ప్రదర్శన ఏకైక దూరదర్శన్ చానెల్ లో ప్రసారమయ్యేది. అనాడు ఈ సీరియల్ దేశ పార్లమెంటునే కుదిపేసింది. అప్పటి కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం బెదిరిపోయింది. బుధవారం తూర్పు దాదర్లోని ఆంధ్ర మహాసభ జింఖానా ప్రాంగణంలో ఆ సీరియల్ లోని ఓ ప్రముఖ పాత్ర వహించిన నటుడు మాక్సూద్ అక్తర్ తో ముంబై ప్రముఖులు ఆత్మీయంగా కలిశారు.

ఒకరినొకరు ఆలింగనం కరచాలనం చేసుకున్నారు. అట్టి సీరియల్ లో దేశం మరియు ముంబైలోని సామాన్య ప్రజల మరి ముఖ్యంగా బస్తీ (గుడిసే) వాసుల సమస్యల్ని కండ్లకు అద్దినట్లు, జన ఇబ్బందులన్ని రాజకీయంతో ముడిపడి ఉన్నాయని మేలుకొల్పింది. పైగా అందులోని కళాకారులు చాలా అద్భుతంగా నటించారు. మాక్సూద్ గారు ఆ బస్తీలో ఓ మున్సిపాలిటీ స్వీపర్ గా "దగుడు" పేరున అద్భుతంగా నటించారు. అది తొమ్మిది నెలల పాటు సాగింది.

చివరికి అప్పటి ప్రభుత్వం దానిని పరోక్షంగా నిషేధించింది. ప్రజల ప్రోద్బలంతో మళ్ళీ 1993లో కొత్త తరహాలో "నయా నుక్కడ్" టైటిల్ తో ప్రసారమైంది. కానీ అది జనాల్లో అంతగా ప్రాచుర్యం పొందలేక పోయింది. ఐతే ఈ భేటీలో "మహాసభ" ప్రధాని కార్యదర్శి యాపురపు వెంకటేష్, కవిరచయిత గాలి మురళీధర్, ఆంధ్ర ఎడ్యుకేషన్ సొసైటీ ప్రధాన కార్యదర్శి కృష్ణ ప్రసాద్, సిపిఐ ముంబై సెక్రటేరియట్ చారుల్ జోషి, గోవిందరాజు రజక, శ్రీలత పద్మశాలి, గుండు అశోక్ పద్మశాలి, సి.సత్తయ్య బెస్త, మూలనివాసి మాలజీ ఉన్నారు.



## ఇందిరమ్మ ఇల్లు గృహ ప్రవేశంలో పాల్గొన్న ఎంపీడీవో

ఎల్లారెడ్డి మార్చ్ 25 ప్రజా కలం ప్రతినిధి : ఎల్లారెడ్డి మండలంలోని లక్ష్మాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో జాన్కంపల్లి గ్రామంలో బుధవారం ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశంలో స్థానిక ఎంపీడీవో ప్రకాష్ పాల్గొన్నారు. గ్రామానికి చెందిన ముప్పిడి రోజా సాయిబాబు దంపతుల ఇందిరమ్మ నూతన గృహ ప్రవేశాన్ని ఎంపీడీవో ప్రకాష్ రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నాయక మంజుల సాయిలు, ఉప సర్పంచ్, గ్రామ పంచాయతీ కార్యదర్శి, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మాజీ ఎమ్మెల్యే జాజాల జన్మదిన వేడుకలు.

ఎల్లారెడ్డి మార్చ్ 25 ప్రజా కలం ప్రతినిధి : ఎల్లారెడ్డి పట్టణంలో బుధవారం మాజీ శాసన సభ్యులు జాజాల సురేందర్ జన్మదిన వేడుకలు బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆదిమూలం సతీష్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని గాంధీ చౌక్ వద్ద



బిఆర్ఎస్ నాయకులు కేక్ కట్ చేసి టపాసులు కాల్చారు. అనంతరం ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బారాస పట్టణ అధ్యక్షుడు సతీష్ కుమార్ మాట్లాడుతూ... మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ జన్మదినాన్ని పార్టీ నేతలు, కార్యకర్తల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగిందన్నారు. అలాగే ఆయన రానున్న రోజుల్లో మరిన్ని పుట్టినరోజు వేడుకలు జరుపుకోవాలని, రాజకీయ పరంగా ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు జలంధర్ రెడ్డి, పాక్స్ మాజీ అధ్యక్షుడు నర్సింలు, మాజీ కౌన్సిలర్ సాయిలు, ఇమ్రాన్, వెంకటాపూర్ సర్పంచ్ అయ్యల సాయిలు, నాయకులు శ్రవణ్ కుమార్, గంగారెడ్డి, రవి ,పృథ్వీరాజ్ , నాగం రాజయ్య , అంజా గౌడ్, శివానంద్, అరవింద్ గౌడ్ , బర్కత్, అలిపాష, గోపాల్, యువనాయకులు బబ్లూ , పడమటి దయాకర్ , భరత్, సాయి, అనిల్ , నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

## భిక్కనూర్ లో ఘనంగా మాజీ ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు...

ఎల్లారెడ్డి మార్చ్ 25 ప్రజా కలం ప్రతినిధి : ఎల్లారెడ్డి మండలంలోని భిక్కనూరు గ్రామంలో బుధవారం రాత్రి మాజీ శాసన సభ్యులు జాజాల సురేందర్ జన్మదిన వేడుకలు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు



ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రధాన చౌరస్తా లో వారు మాజీ ఎమ్మెల్యే సురేందర్ పేరుతో చేయించిన కేక్ కట్ చేసి సంబరాలు జరుపు కున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ... మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ భవిష్యత్తులో మరిన్ని పుట్టినరోజు వేడుకలు జరుపుకోవాలని, రాజకీయ పరంగా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు నెల్లి గోపాల్, గోనె కిష్టయ్య, పిరంగళ్ల లక్ష్మయ్య, అక్బర్ పాషా, కృష్ణారెడ్డి, గోనె గంగారాం, శేర్పల్లి మహేందర్, ఆంధ్రయ్య, చాకలి అనిల్, మ్యాతరి ఎప్రా, ముల్కి అనిల్, మంగలి లక్ష్మయ్య, బేగరీ మైసయ్య, బోయిని లింగయ్య, నెల్లి సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

## పెట్రోల్ బంకుల వద్ద భారీ రద్దీ

హైదరాబాద్, మార్చి 25 (ప్రజా కలం ప్రతినిధి)

జంట నగరాల్లోని పలు పెట్రోల్ బంకుల వద్ద బుధవారం ఉదయం నుంచి భారీ రద్దీ నెలకొంది. వాహనదారులు తమ వాహనాల్లో పెట్రోల్ నింపుకునేందుకు పెద్ద సంఖ్యలో అక్కడికి పోటెత్తారు. తమ భవిష్యత్తు అవసరాల కోసం పెట్రోల్ నింపుకునేందుకు, కొందరు ప్లాస్టిక్ డ్రమ్ములు, భారీ ఉక్కు పాత్రలతో వచ్చారు. రద్దీగా ఉండే బేగంపేట రోడ్డు, బంజారా హిల్స్, ఫలక్‌నుమా సమీపంలోని కాళీ మందిర్ ఇతర ప్రాంతాల్లోని ఇంధన కేంద్రాల వద్ద భారీ రద్దీ కనిపించింది. బంజారా హిల్స్‌లోని పెట్రోల్ బంక్ దగ్గర రెండు కిలోమీటర్ల మేర వాహనాల క్యూ కనిపించడంతో భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. కొన్ని పెట్రోల్ బంకుల వద్ద బారికేడ్లను ఏర్పాటు చేసి, వాహనదారులు లోపలికి ప్రవేశించకుండా నిరోధించాయి. పెట్రోల్, డీజిల్ కొరత ఏమీ లేదని తెలియజేసినప్పటికీ, వాహనదారులు మాత్రం భారీ పరిమాణంలో ఇంధనాన్ని నింపుకోవడం కొనసాగించారు.

# బడుగు బలహీనుల పక్షాన కాంగ్రెస్

**- సొంతింటి కల సాకారం వైపు అడుగులు**

**-ఇందిరమ్మ ఇళ్లతో పేదల జీవితాల్లో వెలుగు.**

**-వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు**



( వరంగల్ /వర్ధన్నపేట) మార్చి 25 ప్రజాకలం ప్రతినిధి:

బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికే కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు స్పష్టం చేశారు. అసెంబ్లీలో మాట్లాడిన ఆయన, కాంగ్రెస్ అంటేనే పేదల పార్టీ అని పేర్కొంటూ, ఇందిరమ్మ రాజ్యంలోనే పేదల సొంతింటి కల నిజమవుతుందని తెలిపారు.

ప్రతి ఒక్కరూ ఆత్మగౌరవంతో జీవించాలంటే సొంత ఇల్లు అవసరమని పేర్కొన్న ఎమ్మెల్యే, ప్రజా ప్రభుత్వంలో పేదలకు ఇండ్లు కల్పించేందుకు పెద్దపీట వేస్తున్నామని వెల్లడించారు. ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాల్లో లబ్ధిదారుల కళ్లల్లో కనిపించే ఆనందం తనకు అపారమైన సంతృప్తిని ఇస్తోందని అన్నారు.గృహప్రవేశాల సందర్భంగా డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రంతో ఇళ్లలోకి ప్రవేశించడం గర్వకారణమని పేర్కొన్న ఆయన, ప్రతి పౌరుడికి కూడు, గూడు, నీడ కల్పించడం ప్రభుత్వాల బాధ్యత అని స్పష్టం చేశారు.వర్ధన్నపేట నియోజకవర్గంలో దళితుల సంఖ్య అధికంగా ఉందని గుర్తుచేసిన ఎమ్మెల్యే, ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకునే స్థోమత లేని వారికి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రైవేట్ సంస్థ సహకారంతో 25 ఇళ్లు నిర్మిస్తున్నామని తెలిపారు.

మేడారం సమ్మక్క–సారలమ్మ జాతర సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లినట్లు వెల్లడించారు. ఎస్సీ, ఎస్టీ జనాభా అధికంగా ఉన్న ప్రాంతాలకు ఎక్కువ ఇళ్లు కేటాయిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని చెప్పారు.ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి వర్ధన్నపేట ప్రజల తరపున ఎమ్మెల్యే నాగరాజు కృతజ్ఞతలు తెలిపారు.





## తాడిచెర్ల శాత్రాజ్ పల్లి లో క్లీన్ అండ్ గ్రీన్

మల్హర్, మార్చి 25 ప్రజాకలం ప్రతినిధి...

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రణాళికలో బాగంగా బుధవారం మండల కేంద్రమైన తాడిచెర్ల పంచాయతీ పరిధిలోని శాత్రాజ్ పల్లి గ్రామంలో రోడ్డు కు ఇరువైపుల క్లిన్ అండ్ గ్రీన్ గా పారిశుద్ధ్య పనులను నిర్వహించారు. అలాగే తాగునీటి సమస్య పరిష్కారం కోసం త్రాగు నీటి బోర్ మరమ్మతు పనులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బండి స్వామి, వార్డు సభ్యులు నారమల్ల రాజేశ్వరి, పంచాయతీ కార్యదర్శి మల్లికార్జున్ రెడ్డి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# కన్వేయర్ బెల్ట్ భూ సేకరణ పారదర్శకంగా చేపట్టాలి

**భూములు కోల్పోతున్న రైతులతో సమావేశం ఏర్పాటు చేయాలి**

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**



భూపాలపల్లి ప్రజాకలం ప్రతినిధి మార్చి 25

తాడిచర్ల,కెటిపిపి కన్వేయర్ బెల్ట్ ప్రాజెక్ట్‌కు భూ సేకరణ పారదర్శకంగా చట్టబద్ధంగా చేపట్టాలని కన్వేయర్ బెల్టు భూ సేకరణ విషయంలో భూములు కోల్పోతున్న రైతులతో నెగోషియేషన్ కమిటీ సమావేశం ఏర్పాటు చేయాలని భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు.బుధవారం ఐడిఓసి కార్యాలయంలో రెవెన్యూ, అటవీ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, కెటిపిపి ఇంజినీరింగ్ అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు పురోగతి, భూ సేకరణ వివరాలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ప్రాజెక్టు అమలులో భాగంగా ప్రభావితమవుతున్న రైతుల సమస్యలను పరిగణలోకి తీసుకుని వారికి న్యాయమైన పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. భూ సేకరణ ప్రక్రియ పారదర్శకంగా, చట్టబద్ధంగా కొనసాగాలని, రైతులకు ఎటువంటి అన్యాయం జరగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.రైతులతో నేరుగా మాట్లాడి వారి అభిప్రాయాలు తెలుసుకుని పరిష్కార మార్గాలు కనుగొనేందుకు నెగోషియేషన్ కమిటీ కీలక పాత్ర పోషించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఇందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి సమావేశాన్ని త్వరితగతిన ఏర్పాటు చేయాలని సూచించారు.అదేవిధంగా, భూ సేకరణకు సంబంధించిన రికార్డులు, సర్వే వివరాలు పూర్తిగా సిద్ధం చేసుకుని ఎలాంటి లోపాలు లేకుండా ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు. ప్రాజెక్టు పూర్తి కావడానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా అటవీశాఖ అధికారి నవీన్ రెడ్డి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ కుసుమ కుమారి, ఆర్డిఓ హరికృష్ణ, కెటిపిపి సీఈ శ్రీ ప్రకాష్, ఎస్ఈ ముత్యాల రావు, సంబంధిత మండలాల తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

## మండల సర్పంచుల ఫోరం అధ్యక్షునిగా బండి స్వామి

**మంత్రి శ్రీధర్ బాబు కు కృతజ్ఞతలు తెలిపిన బండి స్వామి**

మల్హర్, మార్చి 25 ప్రజాకలం ప్రతినిధి...

మండల సర్పంచుల ఫోరం అధ్యక్షునిగా మండల కేంద్రమైన తాడిచెర్ల మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ బండి స్వామి ఏకగ్రీవంగా



ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా బండి స్వామి మాట్లాడుతూ నా ఎన్నికకు కృషి చేసిన ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ ఐత ప్రకాష్ రెడ్డి కీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు బండారి నర్సింగం, మేకల రాజయ్య యాదవ్, మంజూల జగన్ నాయక్, గడ్డం క్రాంతి రణదేవ్, లింగస్వామి,ఒర్రె వనమ్మ రాజైలు, జాడి రాములు తదితరులు పాల్గొన్నారు.

## పెన్షన్ వాలిడేషన్ యాక్ట్ రద్దు చేయాలి: పెన్షనర్ల ఆందోళన

**-పెన్షన్ హక్కులపై కోతలు వద్దు**

**-వాలిడేషన్ రద్దు మా డిమాండ్.**

**-జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా**

**వినతి పత్రం సమర్పణ.**

(వరంగల్ /వర్ధన్నపేట) మార్చి 25 ప్రజాకలం ప్రతినిధి:

పెన్షన్ వాలిడేషన్ యాక్ట్ 2025ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ వరంగల్ జిల్లా కేంద్రంలో పెన్షనర్లు భారీ నిరసన చేపట్టారు. ఎస్‌జిపిఏటి జిల్లా ఆధ్వర్యంలో వందలాది మంది పెన్షనర్లు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఉపాధ్యక్షులు కర్రు సుధీర్ బాబు (జిల్లా ఇంచార్జి),



జిల్లా ప్రధాన కార్యదర్శి గునిగంటి సాంబయ్య, మార్కెట్ కమిటీ అధ్యక్షులు నాగపురి సారయ్య నేతృత్వం వహించారు. ఈ సందర్భంగా సుధీర్ బాబు మాట్లాడుతూ, పెన్షనర్లను రెండు వర్గాలుగా విభజించి వారి హక్కులను హరించడం అన్యాయమని ఆగ్రహం వ్యక్తం చేశారు. గునిగంటి సాంబయ్య మాట్లాడుతూ, రాజ్యాంగం కల్పించిన హక్కులకు విరుద్ధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. నాగపురి సారయ్య మాట్లాడుతూ, ఈ చట్టం వల్ల పెన్షనర్లకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

నిరసనలో పాల్గొన్న నాయకులు, పెన్షనర్లు వాలిడేషన్ చట్ట ప్రతులను చింపివేసి తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. సుమారు 200 మంది సభ్యులు పాల్గొన్న ఈ ఆందోళనలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు మార్మోగాయి.అనంతరం జిల్లా కలెక్టర్ సత్యశారదకు మెమోరాండం అందజేసి, తమ డిమాండ్లను ప్రధానమంత్రికి పంపించాలని కోరారు. "పెన్షన్ హక్కులపై కోతలు వద్దు -- వాలిడేషన్ యాక్ట్ రద్దే మా డిమాండ్"


## సౌన లో ఇండ్ల స్థలాల భూమిని సర్వే చేయాలి.

నిర్మల్ మార్చి 25 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

సౌన గ్రామస్తులకు ఇచ్చిన ఇడ్ల పట్టాల భూమిలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని అఖిల భారత రైతు కూలీ




సంఘం నిర్మల్ జిల్లా ప్రధాన కార్యదర్శి జే రాజు డిమాండ్ చేసారు. బుధవారం కుబీర్ తహశీల్దార్ కి వినతిపత్రం ఇచ్చారు. 1983 లో వరదతో మునిగిన సౌన గ్రామ ప్రజలకు సర్వే నెంబర్ 10 లో భూమిని కేటాయించి పట్టాలు ఇవ్వడం జరిగిందని తెలియజేసారు. ఈ భూమిని కొలిచి ప్లాట్ల కేటాయింపు జరగలేదు.గత సంవత్సరం వరదలతో మళ్ళీ ఊర్లో కి నీళ్లు వచ్చి, ఇండ్లలోని సామానులు మునిగినయి. వాగు ఒడ్డున ఉండడంతో పాములు, తేల్లు ఇతర జంతువులు ఇండ్లలోకి వస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం అలోచించి భూమిని సర్వే చేసి, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలనీ డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ గణపతి,భీమ్, మాధవరావు, తదితరులు పాల్గొన్నారు.



**గ్రామ ప్రథమ పౌరుడి అత్యుత్సాహం ...**

# యువత భవిష్యత్తుతో చెలగాటం!

**-మార్గం చూపాల్సిన సర్పంచే మద్యం దందాకు అడ్డాగా మారాడా?**

**-గ్రామ ప్రజల్లో కట్టలు తెచ్చుకుంటున్న ఆగ్రహం.**



(వరంగల్ /వర్ధన్నపేట) మార్చి 25 ప్రజాకలం ప్రతినిధి:

గ్రామ అభివృద్ధికి మార్గదర్శకుడిగా ఉండాల్సిన ప్రథమ పౌరుడే యువత భవిష్యత్తుతో ఆటలాడుతున్నాడనే ఆరోపణలు వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలో కలకలం రేపుతున్నాయి. గ్రామ ప్రజల నమ్మకాన్ని అందిపుచ్చుకుని సర్పంచ్‌గా గెలిచిన వ్యక్తి, ఇప్పుడు అదే ప్రజల విశ్వాసాన్ని వమ్ము చేస్తున్నాడనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామంలో అక్రమంగా సాగుతున్న బెల్ట్ మద్యం వ్యాపారాన్ని అరికట్టాల్సిన బాధ్యత అతనిదే కాగా, అదే వ్యాపారానికి అతడే ప్రోత్సాహకుడిగా మారాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. యువతను మంచి మార్గంలో నడిపించాల్సిన నాయకుడే, మద్యం అలవాట్లకు బానిసలుగా మార్చుతున్నాడని గ్రామ పెద్దలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గతంలో మద్యం విక్రయాలతో సంబంధం ఉన్న వ్యక్తినే, మార్పు వస్తుందనే నమ్మకంతో సర్పంచ్‌గా ఎన్నుకున్నామని గ్రామస్తులు చెబుతున్నారు. అయితే ఇప్పుడు అదే వ్యక్తి మళ్లీ పాత దారిలో నడుస్తూ గ్రామంలో బెల్ట్ షాపుల నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తున్నాడనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఇటీవల గ్రామంలో మద్యం దందా పెరగడంతో యువతపై ప్రతికూల ప్రభావం పడుతోందని, కుటుంబాల్లో కలహాలు పెరుగుతున్నాయని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ అభివృద్ధి పక్కనపెట్టి అక్రమాలకు పాల్పడటం తీవ్రంగా ఖండిస్తున్నామని ప్రజలు చెబుతున్నారు. "ఇప్పటికైనా మారాలి... యువత భవిష్యత్తుకి బాటలు వేయాలి"అని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే విచారణ చేపట్టి, అక్రమ మద్యం దందాపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## ఐనవోలు మండల కేంద్రంలో జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్

**-ప్రియదర్శిని యూత్**

**ఆధ్వర్యంలో యువతకు క్రీడా వేదిక.**

వరంగల్ / ఐనవోలు, మార్చి 25 ( ప్రజాకలం ప్రతినిధి)

యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు ప్రియదర్శిని యూత్ ఆధ్వర్యంలో ఐనవోలు మండల కేంద్రంలో ఈ నెల 28న శనివారం జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు కార్యదర్శి సాంబారి శివకుమార్ వెల్లడించారు. ఈ టోర్నమెంట్‌కు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి జట్లు పెద్ద ఎత్తున పాల్గొననున్నాయి.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యతో పాటు క్రీడల్లోనూ యువత రాణించాలని, క్రీడల ద్వారా శారీరక దారుఢ్యం పెంపొందడమే కాకుండా భవిష్యత్తులో అవకాశాలకు దారి తీసే సర్టిఫికెట్లు కూడా లభిస్తాయని పేర్కొన్నారు. యువత తమ ప్రతిభను చాటుకునేందుకు ఇలాంటి వేదికలు ఎంతో అవసరమని అన్నారు.

నమోదు వివరాలు:

పోటీల్లో పాల్గొనదలచిన జట్లు 9989415238 నంబర్‌ను సంప్రదించి తమ జట్టు పేరు, సభ్యుల వివరాలను నమోదు చేసుకోవాలని నిర్వాహకులు సూచించారు.

బహుమతులు

మొదటి బహుమతి: ?25,016/-

ద్వితీయ బహుమతి: ?15,015/-

తృతీయ బహుమతి: ?7,016/-

మ్యాన్ ఆఫ్ ది సిరీస్: ?2,016/-

ప్రముఖుల చేతుల మీదుగా విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

టోర్నమెంట్ నిబంధనలు

ప్రతి మ్యాచ్ 10 ఓవర్లుగా నిర్వహణ

రెడ్ టెన్నిస్ బాల్‌తో పోటీలు

ఒక ఆటగాడు ఒకే జట్టుకు పరిమితం

మ్యాచ్‌కు 15 నిమిషాల ముందు హాజరు తప్పనిసరి

ఎంపైర్ నిర్ణయం తుది

గ్రౌండ్ సదుపాయాన్ని జంపాల సాయిలు, జంపాల రఘు అందిస్తుండగా, టోర్నమెంట్ మొత్తం నిర్వహణ బాధ్యతలను ప్రియదర్శిని యూత్ సభ్యులు చేపట్టనున్నారు.యువతలో క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించే ఈ టోర్నమెంట్ విజయవంతం కావాలని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# పల్సి పాఠశాలలో ఘనంగా 50 వసంతాల స్వర్ణోత్సవ వేడుకలు

నిర్మల్ మార్చి25 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

కుబీర్ మండల పరిధిలోని పల్సి ప్రభుత్వ పాఠశాల స్థాపించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహించిన స్వర్ణోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. అర్ధ శతాబ్ద కాలంగా విద్యా గంధాన్ని వెదజల్లుతూ, వేలాది మంది విద్యార్థులను తీర్చిదిద్దిన ఈ విద్యాసంస్థ ప్రస్థానాన్ని స్మరించుకుంటూ ఈ ఉత్సవాలను నిర్వహించారు.డీఈవో దర్శనం భోజన్న గ్రామ సర్పంచ్ సమక్షంలో జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాధికారి మాట్లాడుతూ పల్సి పాఠశాల ఈ ప్రాంతపు విద్యాభివృద్ధిలో కీలక పాత్ర పోషించిందని మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో ఉన్నందున ఇక్కడి ప్రజలు అధ్యాత్మిక విలువలు కలిగిన వారు కాబట్టి అట్టి విలువలు విద్యార్థి దశనుండి మీ పిల్లల్లో చైతన్య పరుస్తూ వారి అభ్యున్నతికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఇంతటి వైభోవేతంగ ఇట్టి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నందునా ఉపాధ్యాయులకు కార్యక్రమనికి సహకరిస్తున్న గ్రామ విద్యాకమితికి ప్రశంసించారు. ఈ వేడుకల్లో భాగంగా పాఠశాలలో చదువుకుని నేడు ఉన్నత స్థానాల్లో ఉన్న పూర్వ విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. తమ పాత జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ, పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని ప్రకటించారు. పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, నాటికలు మరియు ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. పాఠశాల అభివృద్ధికి కృషి చేసిన విశ్రాంత ఉపాధ్యాయులను, పూర్వ విద్యార్థులకు ప్రస్తుత సిబ్బందిని పాఠశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు దొంతుల సురేష్ మాట్లాడుతూ, గత 50 ఏళ్ల ప్రస్థానంలో



సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఆధునిక విద్యా ప్రమాణాలతో విద్యార్థులను తీర్చిదిద్దుతామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పి ఆర్ టి యు జిల్లా కార్యదర్శి బీవీ రమణారావు టి పి యు ఎస్ జీలకరీ రాజేశ్వర్ నవీపేట్ ఎం ఆర్ ఓ వెంకట రమణ జిల్లా విద్యాశాఖ అధికారి తో పాటు సెక్టోరియల్ అధికారులు సామా రాజేశ్వర్, నుగురి ప్రవీణ్ కుమార్, లింబాద్రి, డి. ఎస్.ఓ. కే వినోద్ కుమార్ మరియు మండల విద్యాధికారి అర్ విజయ్ కుమార్, కుబీర్ మండల పి ఆర్ టి యు కార్యదర్శి దత్తురం గ్రామ పెద్దలు, సర్పంచ్ ద్యావరి సత్తేవ్వ రాములు మార్కెట్ కమిటీ చైర్మన్ జి కల్యాణ్ , ఉపసర్పంచ్ గజ్జరం, మాజీ సర్పంచ్ శ్రీరాముల రాజేష్ , కొట్టే హన్మండ్లు, ఎంపీటీసీ రాములు , దత్తురం పటేల్, ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయులు విద్యార్థులు తల్లిదండ్రులు భారీగా పాల్గొన్నారు.

## డిసిసి ప్రధాన కార్యదర్శి పత్తే హమాద్ కు శుభాకాంక్షలు తెలియజేసిన టిఎం హెచ్ డి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కొరిపల్లి శ్రీనివాస్.

ఖమ్మం మార్చి 25( ప్రజా కలం న్యూస్ )

ఖమ్మం, ఇల్లందు నియోజకవర్గ కామేపల్లి మండలం పాత లింగాల గ్రామానికి చెందిన నూతనంగా జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పత్తే హమాద్ ను బుధవారం తెలంగాణ మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షులు దళితరత్న డాక్టర్ కొరిపల్లి శ్రీనివాస్ వారి నివాసం లో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కొరిపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ఇల్లందు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకుడుగా ప్రజా సమస్యలపై నిరంతరం పరిష్కార దిశగా కృషి చేస్తున్నారని తెలిపారు పత్తె హమాద్ పార్టీ గుర్తించి కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కి మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు కు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ కి ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్యకి కృతజ్ఞతలు తెలియజేశారు.



## రైతుల ఆదాయం పెంచడం లక్ష్యంగా చర్యలు.జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**సాగు లాభసాటి చేసేందుకు సహకార సంఘాలు కృషి**
**పాల ఉత్పత్తి, చేపల పెంపకం వంటి వ్యవసాయ అనుబంధ రంగాలు ప్రోత్సహించాలి**
**జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ 128వ మహాజన సభ సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్.**

ఖమ్మం, మార్చి 25( ప్రజా కలం న్యూస్ )

రైతుల ఆదాయం పెంచడం లక్ష్యంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు.బుధవారం నిర్వహించిన జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ 128వ మహాజన సభ సమావేశంలో పిఐసి అధ్యక్షులు, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పాల్గొన్నారు. పిఐసి అధ్యక్షులు, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ సహకార సంఘం ద్వారా అందించే వివిధ రకాల రుణాలను వినియోగిస్తూ రైతులు ఎలా ఆర్థికంగా మంచి స్థితికి చేరుకోవచ్చు అనే అంశంపై అవగాహన కల్పించడం కీలకమని తెలిపారు. సాగు యాంత్రీకరణకు రుణాల పంపిణీ పెంచాలని, దీనివల్ల అధిక సంఖ్యలో పంట పండి రైతులకు లాభం చేకూరుతుందని కలెక్టర్ అన్నారు. రైతులకు వ్యవసాయంతో పాటు పాడి పశువుల పెంపకం, చేపల పెంపకం వంటి వివిధ వ్యవసాయ అనుబంధ రంగాల ద్వారా ఆదాయం సంపాదించుకోవడంపై సహకార సంఘాలు ప్రోత్సహించాలని అన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలలో రైతులకు సంబంధించి వివరాల నమోదులో పొరపాట్లు జరగడం వల్ల రైతులకు నష్టం జరుగుతున్నదని జిల్లా కలెక్టర్ తెలిపారు. సహకార సంఘాలలో రైతుల వివరాలు నమోదు చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. రైతుల వివరాల నమోదులో జరిగిన పొరపాట్లను 15 రోజులలో సవరించాలని లేని పక్షంలో చర్యలు ఉంటాయని కలెక్టర్ స్పష్టం చేశారు. రైతులకు మంజూరు చేసిన రుణాల రికవరీ పై వ్యవసాయ సహకార సంఘాలు దృష్టి సారించాలని, రైతులు స్వచ్ఛందంగా రుణాల చెల్లింపులు చేసేలా అవగాహన కల్పించాలని అన్నారు. రైతులు ఉత్పత్తులు తయారు చేసే స్థాయికి చేరుకునేలా ప్రోత్సహించాలని కలెక్టర్ అన్నారు. రైతులు బలోపేతం కావడం వల్ల మన సహకార సంఘాలు బలోపేతం అవుతాయని, లాభసాటిగా వ్యవసాయం మారుతుందని అన్నారు. అంతకుముందు కలెక్టర్, జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ డిసెంబర్, 2025క్వార్టర్ అంతానికి సాధించిన ప్రగతి, వివిధ అంశాలలో బ్యాంక్ పురోగతి పై అధికారులతో సమీక్షించారు. పిఏసిఎస్ ల బలోపేతం, రైతుల సంక్షేమం దిశగా చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో నాబార్డ్ డిడిఎం ఎల్. సుజిత్ కుమార్, టీఎస్ సిఏబి డిజిఎం కె. రవికాంత్ రెడ్డి, జిల్లా సహకార అధికారి జి. గంగాధర్, ఖమ్మం డిసిసిబి సిఇఓ వెంకట ఆదిత్య, భద్రాద్రి కొత్తగూడెం డిసిసిబి సిఇఓ శ్రీనివాస్, పిఏసీఎస్ అధ్యక్షులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు




# దళిత క్రైస్తవులపై సుప్రీంకోర్టు తీర్పును పునఃసమీక్షించాలి

## కేవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నందిపాటి మనోహర్.



పాలేరు మర్చి 25( ప్రజా కలం న్యూస్ )

దళిత క్రైస్తవుల ఎస్సి హోదా ఉండదు అంటూ తాజాగా వెలువడించిన సుప్రీంకోర్టు తీర్పును పున:సమీక్షించాలని కేవిపిఎస్ జిల్లా కమిటీ పేర్కొన్నది ఈ మేరకు మంగళవారం కేవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నందిపాటి మనోహర్ మీడియాతో మాట్లాడారు. ఈ తీర్పు పూర్తిగా రాజ్యాంగస్ఫూర్తికి అనుకూలంగా లేదన్నారు ముఖ్యంగా భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 15 ఆర్టికల్ 25లను నేరుగా ఉల్లంఘిస్తున్నదని ఆయన పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వంపై కూడా న్యాయ స్థానాల ద్వారా మైనార్టీల పై కక్ష తీర్చుకుంటుందని చెప్పారు ఆర్టికల్ 15 ప్రకారం మతం, కులం ఆధారంగా వివక్ష చూపరాదని రాజ్యాంగం స్పష్టంగా చెబుతోంది. అలాగే ఆర్టికల్ 25 ప్రతి పౌరుడికి తనకు నచ్చిన మతాన్ని అనుసరించే స్వేచ్ఛను హామీ ఇస్తుందన్నారు ఈ నేపథ్యంలో, ఒక వ్యక్తి మత మార్పిడి చేసుకున్న కారణంగా అతనికి లభించే సామాజిక రక్షణలను తొలగించడం రాజ్యాంగ స్ఫూర్తిని విస్మరిస్తుందన్నారు మత స్వేచ్ఛను ఆధ్యాత్మికం అయితే కులం సామాజిక సమస్య అన్నారు కుల హక్కులతో అనుసంధానం చేయడం సరైన పద్ధతి కాదని ఆయన స్పష్టం చేశారు.

అదేవిధంగా, కేంద్ర ప్రభుత్వం తప్పనిసరిగా ఈ తీర్పుపై పునర్విచారణ కోరుతూ సుప్రీంకోర్టులో అప్పీల్ దాఖలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అణగారిన వర్గాల హక్కులను కాపాడటం కేంద్ర ప్రభుత్వ బాధ్యతఅన్నారు . కేంద్రం మౌనం వహించకూడదని క్రైస్తవం, ఇస్లాం లేదా బౌద్ధం వంటి మతాలకు మారినప్పటికీ, షెడ్యూల్డ్ కులాలకు చెందిన వ్యక్తులు సామాజికంగా ఎదుర్కొనే కుల వివక్ష పూర్తిగా తగ్గిపోలేదని ఆయన గుర్తుచేశారు. ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన కారంచేడు, చుండూరు ఘటనలను ఉదాహరణగా ప్రస్తావిస్తూ, మత మార్పిడి జరిగినా కుల ఆధారిత హింస ఇంకా కొనసాగుతూనే ఉందని తెలిపారు. సుప్రీంకోర్టు ఈ తీర్పు ను పున:సమీ క్షించాలని కేంద్రం రివ్యూ పిటీషన్ వేయాలని కేవిపి ఎస్ కోరింది ఇది దేశంలో ఉన్న కఠిన సామాజిక వాస్తవాన్ని ప్రతిబింబిస్తోందని అన్నారు. ఈ తీర్పు వల్ల క్రైస్తవం లేదా ఇస్లాం మతాలను అనుసరించే లక్షలాది అణగారిన పౌరులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా ఎస్సి/ ఎస్టి అట్రాసిటీస్ చట్టం కింద లభించే రక్షణలు వారికి అందకపోవడం, వారి భద్రతపై ప్రతికూల ప్రభావం చూపే ప్రమాదం ఉందని చెప్పారు ఇక ఈ సమస్యపై సమగ్ర అధ్యయనం చేయడానికి ఏర్పాటు చేసిన జస్టిస్ కె.జి. బాలకృష్ణన్ కమిటీ నివేదిక ఇంకా వెలువడకపోవడం సరికాదన్నారు . ఈ నివేదికను కేంద్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేస్తోందని, ఇది ఒక పెద్ద స్థాయి కుట్రగా చేస్తుందన్నారు ఈ తీర్పు మత స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక న్యాయం వంటి రాజ్యాంగ విలువలపై ప్రభావం చూపే అంశంగా మారిందన్నారు

అణగారిన వర్గాల హక్కులను పరిరక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని, అవసరమైతే న్యాయపరమైన మార్గాల్లో ఈ తీర్పును సవాలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.




# బచ్చోడులో ఆధ్యాత్మిక వైభవం.. శాస్త్రోక్తంగా విగ్రహ ప్రతిష్ఠాపన

**-కన్నులపండువగా శివ-కేశవుల ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవం**
**- వేద మంత్రోచ్ఛారణల మధ్య శిఖర కలశ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ**
**- ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్-చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి.**

పాలేరు మార్చి 25( ప్రజా కలం న్యూస్)

తిరుమలాయపాలెం మండల పరిధిలోని బచ్చోడు గ్రామం బుధవారం ఆధ్యాత్మిక చైతన్యంతో పులకించిపోయింది. గత మూడు రోజులుగా అత్యంత నిష్ఠతో నిర్వహిస్తున్న శ్రీ సీతాసమేత శ్రీరామచంద్రమూర్తి, లక్ష్మణ, ఆంజనేయ స్వామివార్ల సహిత శ్రీరామ లింగేశ్వర, కనకదుర్గమ్మ ఆలయ శిఖర కలశ ప్రతిష్ఠాపన మహోత్సవాలు బుధవారం నాటి ప్రధాన ఘట్టంతో వైభవంగా ముగిశాయి. గ్రామంలో నూతనంగా నిర్మించిన ఈ ఆలయ సముదాయంలో విగ్రహాల ప్రాణ ప్రతిష్ఠ కోసం సోమవారం నుంచే వేద పండితులు శాస్త్రోక్తంగా జలధివాసం, ధాన్యధివాసం వంటి క్రతువులను నిర్వహించారు.

సుముహూర్తాన ప్రాణ ప్రతిష్ఠ

ఉత్సవాల్లో అత్యంత కీలకమైన చివరి రోజైన బుధవారం తెల్లవారుజాము నుంచే ఆలయ ప్రాంగణంలో హోమగుండాల నుంచి వెలువడిన వేద మంత్రోచ్ఛారణలు మారుమోగాయి. ఉదయం 6:30 గంటలకు వాస్తు పూజ, పంచలోహ నవరత్న స్థాపన, జీవం పోయుట వంటి కార్యక్రమాలను శాస్త్రోక్తంగా పూర్తి చేశారు. అనంతరం ఉదయం 9:50 గంటల సుముహూర్తాన విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన ఘట్టాలను కన్నులపండువగా నిర్వహించారు. మంగళవాయిద్యాల మధ్య స్వామివార్ల విగ్రహాలకు ప్రాణ ప్రతిష్ఠ కావించడంతో భక్తుల జయజయధ్వానాలతో బచ్చోడు పులకించింది. ?ఈ కార్యక్రమంలో రామసహాయం నరేష్ రెడ్డి, రామసహాయం అరవింద్ రెడ్డి, హరిత రెడ్డి, బెల్లం శ్రీను, గంద్ర గోపాలరావు, కొప్పుల అశోక్, మంగీలాల్, ఉన్నం రాజశేఖర్, ఎన్.లింగయ్య, బి.సుదర్శన్, కరీం, వనవాసం నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ చైతన్యోత్సవ్--2026

**పొన్నేకల్ శ్రీ చైతన్య కళాశాలలో ఇన్నోవేషన్, సామాజిక సేవలు రంగులు మెరిసినాయి.**

పాలేరు మార్చి 25( ప్రజా కలం న్యూస్ )

ఖమ్మం రూరల్ మండల పరిధిలోని బుధవారం శ్రీ చైతన్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ రీసెర్చ్‌లో "శ్రీ చైతన్యోత్సవ్--2026" "కలర్స్ ఆఫ్ ఇన్నోవేషన్ -- కలర్స్ ఆఫ్ సెలబ్రేషన్" థీమ్‌తో ఘనంగా జరిగింది. జేఎన్‌టీయూ డైరెక్టర్ వెంకటేశ్వర రెడ్డి ముఖ్య అతిథిగా విద్యార్థుల ప్రాజెక్టులను ప్రశంసించారు. విద్యార్థులు రూపొందించిన ఎలక్ట్రిక్ కార్, రాడార్ ప్రాజెక్ట్, సోలార్ ప్రాజెక్టులు, ఏఐ, సైబర్ సెక్యూరిటీ ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి. బ్లడ్ డొనేషన్, అనాధాశ్రమాల సందర్శనలు సామాజిక బాధ్యత పెంపొందించాయి. కళాశాల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్ "విద్యతో సమాజ బాధ్యతలు కలిపి ఆవిష్కరణలు చేయాలి" అన్నారు. బీటెక్, ఎంబీఏ, డిప్లొమా విద్యార్థులు ప్రాజెక్ట్ ఎక్స్‌పో, పోస్టర్ ప్రెజెంటేషన్‌లు, క్విజ్‌లు, సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ చూపారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డా. సాయి గీతిక సాంకేతిక నైపుణ్యాలు, డైరెక్టర్ శ్రీమతి విద్య రేపు హేమచందర్ లైవ్ మ్యూజిక్‌ను ప్రకటించారు. డా. రావు తేజ్ సోషల్ మీడియా దూరం, పుస్తకాలు, యోగ సూచించారు. ప్రిన్సిపల్ డా. లక్ష్మీనారాయణ సామాజిక బాధ్యతలు గుర్తించాలన్నారు. అకాడమిక్ డీన్ డా. సుదర్శన్, ఏఓ వైశాలి, ట్రైనింగ్ ఆఫీసర్ రాజేష్, డిప్లొమా ఇంచార్జ్ కృష్ణప్రసాద్, విభాగాధిపతులు డా. జ్యోతి, డా. ప్రణతి తదితరులు పాల్గొన్నారు.

## వీరవెల్లి నాగేశ్వరరావు పార్థివదేహానికి పాలేరు మాజీ ఎమ్మెల్యేలు కందాళ్ల , సండ్రల నివాళులు.

పాలేరు మార్చి 25 (ప్రజా కలం న్యూస్)

కూసుమంచి మండల కేంద్రంలోని నివాసంలో జిల్లా నాయకులు, కీర్తిశేషులైన వీరవెల్లి నాగేశ్వరరావు పార్థివదేహాన్ని పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి, సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే,




సందర్శించి గౌరవంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యేలు నాగేశ్వరరావుతో తమకు ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ భావోద్వేగాలతో కూడిన మాటలు పలికారు. జిల్లా రాజకీయ, సామాజిక కార్యక్రమాల్లో కీలక పాత్ర పోషించిన నాగేశ్వరరావు కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ, అతని సేవలు, నాయకత్వ గుణాలను ప్రశంసించారు. కందాళ ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ, "నాగేశ్వరరావు, ఎల్లప్పుడూ ప్రజల సంక్షేమానికి మొదటుగా నిలబడి పోరాడారు. వారి క్షతి అసాధారణం" అని తెలిపారు. మాజీ ఎమ్మెల్యేలు, కూడా ఇదే అంశాన్ని పునరుచ్చరించి, జిల్లా అభివృద్ధికి చేసిన కృషిని గుర్తు చేశారు. కుటుంబ సభ్యులు, స్థానిక నాయకులు, ప్రజలు అందరూ ఈ సందర్భంగా సమ్మిళితంగా నివాళు లర్పించారు.

## టెలికాం మౌలిక సదుపాయాల నిధి లేదన్న కేంద్రం

**-దూరప్రాంతాల అభివృద్ధిపై లోక్ సభలో ప్రశ్నించిన ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి**
**- డిజిటల్ భారత్ నిధితోనే సేవల విస్తరణకు ప్రాధాన్యమని వివరించిన కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని.**

ఖమ్మం మార్చి 25 ( ప్రజా కలం న్యూస్ )



దేశంలో టెలికాం మౌలిక సదుపాయాల అభివృద్ధికి సంబంధించి టెలికాం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఫండ్ ( ఐ టి డి ఎఫ్ ) అమలులో ఉ ందన్న అంశంపై కేంద్ర ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. అలాంటి ప్రత్యేక నిధి ప్రస్తుతం లేదని వెల్లడించింది. లోక్‌సభలో ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి బుధవారం అడిగిన ప్రశ్నలకు కేంద్ర కమ్యూనికేషన్లు, గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ సమాధానం ఇచ్చారు. TIDF లేదు... ఐదీచీ ద్వారానే సేవలు : టెలికాం మౌలిక సదుపాయాల అభివృద్ధికి TIDF అనే ప్రత్యేక నిధి లేదని మంత్రి స్పష్టం చేశారు. అయితే, టెలికమ్యూనికేషన్ చట్టం–2023 ప్రకారం ఏర్పాటు చేసిన డిజిటల్ భారత్ నిధి (ఐఅస్త్రఘ్శ్రీ దీష్ఘుతీఫ్ చీఱఅస్త్రఱ – ఐదీచీ) ద్వారా దేశవ్యాప్తంగా టెలికాం సేవలను అందించేందుకు చర్యలు కొనసాగుతున్నట్లు తెలిపారు.దూరప్రాంతాలపై దృష్టి : గ్రామీణ, దూరప్రాంతాలు, కొండ ప్రాంతాల్లో టెలికాం సేవలను విస్తరించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని మంత్రి వివరించారు. సేవలు అందని ప్రాంతాల్లో కనెక్టివిటీ పెంపు దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని వివరించారు.

# ఎస్సీ యాక్షన్ ప్లాన్ పథకాలను అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలి . జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

## ఏప్రిల్ 2 వరకు ఆన్‌లైన్ నమోదు గడువు.

ఖమ్మం, మార్చి 25( ప్రజా కలం న్యూస్)

షెడ్యూల్డ్ కులాల అభ్యర్థుల కోసం ఎస్సీ యాక్షన్ ప్లాన్ 2025-26 క్రింద బ్యాంకు లింకేజీతో ఆర్థిక మద్దతు, బ్యాంకు లింకేజీ లేని పథకాలను కల్పించేందుకు ఫేజ్-1, ఫేజ్-2లకు సంబంధించిన ఆన్‌లైన్ నమోదు గడువును ఏప్రిల్ 2 వరకు పొడిగించినట్లు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.



ఈ పథకాల క్రింద ద్విచక్ర వాహనాలు/ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలు, ఎలక్ట్రిక్ మూడు చక్రాల వాహనాలు (సరుకు/ప్రయాణికులు), వ్యవసాయ డ్రోన్ సేవలు, వ్యవసాయ యంత్రాల కామన్ హైరింగ్ సెంటర్, సోలార్ యూనివర్సల్ పంపు కంట్రోల్, 2 పాడి పశువులు, సెరికల్చర్, ఉద్యానవనం, తదితర వాటికి బ్యాంక్ లింకేజీ ద్వారా ఆర్థిక మద్దతు అందించ నున్నట్లు, బ్యాంక్ లింకేజీ లేని పథకాలు క్రింద చిన్నపాటి సాగునీరు, విద్యుదీకరణ, బోర్వెల్, సబ్మెర్సిబుల్ పంపుసెట్టు పైప్లైన్ తో అందించబడుతుందని తెలిపారు.

ఈ పథకాల కొరకు సంవత్సర ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో లక్షా యాభై వేలు, పట్టణ ప్రాంతాల్లో 2 లక్షలు మించకుండా ఉండాలని, వ్యవసాయేతర పథకాలకు 21 నుండి 50 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన అభ్యర్థులు అర్హులు కాగా, వ్యవసాయ ఆధారిత పథకాలలో 60 సంవత్సరాల వరకు అనుమతి ఉ ంటుందని తెలిపారు. అభ్యర్థులు ఆధార్ కార్డు, రేషన్ కార్డు/ ఫుడ్ సెక్యూరిటీ కార్డు, కుల,ఆదాయ ధృవీకరణ పత్రం, డ్రైవింగ్ లైసెన్స్ (రవాణ రంగ పథకాలకు), ఎలక్ట్రిక్ వాహనాలకు సంబంధించి జొమాటో , స్విగ్గ , రాపిడో , ఖఎవతీ వంటి సంస్థలతో అనుబంధం ఉంటే ప్రాధాన్యత ఇస్తారని అన్నారు.

అభ్యర్థులు¯(ంశీఎఎం.ఎస్త్రస్త్ర.స్త్రశీఇ.ఱఅ) వెబ్ సైట్ ద్వారా ఏప్రిల్ 2 లోపు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకొని, నమోదు చేసుకున్న దరఖాస్తుకు సంబంధిత పత్రాలను జతచేసి ఎంపీడీఓ/ మునిసిపల్ కార్యాలయంలో సమర్పించాలని, ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని జిల్లాలోని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# కాసులు కురిపిస్తున్న ఎర్ర బంగారం



గుంటూరు : తెలుగు రాష్ట్రాల్లో పండించే మిరప పంటకు ప్రపంచ స్థాయిలో గిరాకీ ఎక్కువే. నాణ్యతతోపాటు మంచి రంగు, రుచి, ఘాటు వీటికి ఉంటుంది. అయితే మిరప రైతులకు గిట్టుబాటు ధర దొరక్క యేటా అప్పుల ఊబిలో కూరుకుపోయి నష్టాలు చూసేవారు. దీంతో నష్టాల బాధలు భరించలేక చాలా మంది రైతులు మిరపను సాగుచేయలేమంటూ చేతులెత్తేశారు. ఇక మరికొంతమంది రైతులు చేస్తున్న సాగు విస్తీర్ణంను తగ్గించుని కొద్ది మొత్తంలో మాత్రమే మిరప పంటను పండిస్తున్నారు. అయితే ఈ ఏడాది మాత్రం మిరప పంట రైతులకు కనీవినని రీతిలో కాసులు కురిపించనున్నాయి. అందుకు కారణం మార్కెట్లో మన ఎర్రబంగారానికి ధరలు ఆశాజనకంగా ఉండటమే.ముఖ్యంగా ఏపీలో జనవరి నుంచి మిర్చి ధరల్లో క్రమ క్రమంగా పెరుగుదల కనిపించింది. క్వింటాలుకు సగటున రూ.20 వేల వరకు ధర లభిస్తోంది. జనవరి నుంచి ఇప్పటి వరకు సగటున క్వింటాలుకు రూ.5 వేలకు పైగానే ధర పెరిగింది. మిర్చికి డిమాండ్ పెరగడంతో వ్యాపారులు నేరుగా గ్రామాలకు చేరుకుని మధ్యవర్తుల జోక్యం లేకుండానే రైతుల వద్ద నుంచి పంట కొనుగోలు చేస్తున్నారు. దీంతో గత నాలుగైదేళ్లుగా నష్టాలను చూసిన మిర్చి రైతులకు తాజా ధరలు ఉపశమనం అందించాయి. మార్కెట్లో మంచి ధర పలకడంతో ప్రస్తుతం శీతల గోదాముల్లో నిల్వ చేసిన సరకు కొద్ది కొద్దిగా తగ్గడం మొదలైంది. ఇక గుంటూరు మార్కెట్ యార్డుకు గత వారంలో 1.29 లక్షల బస్తాల మిరప రాగా.. ఇందులో ఏకంగా 1.26 లక్షల బస్తాల వరకు అమ్ముడయ్యాయి. అయితే మిర్చి సాగు ఈసారి ఒక్క ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే కాదు.. కర్ణాటక, తెలంగాణ, గుజరాత్, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో సైతం తగ్గింది.ఉత్పత్తి తగ్గడంతో డిమాండ్ పెరిగినట్లైంది. మరోవైపు అంతర్జాతీయ మార్కెట్?లో డిమాండ్ అధికంగా ఉండటంతో జనవరి నెల నుంచే ధరల్లో మార్పులు చోటు చేసుకున్నాయి. గతేడాది క్వింటాల్ మిర్చీ కేవలం రూ. 10 వేలలోపు మాత్రమే పలికింది. ఈ సారి రూ.20 వేలకు పైగానే ధర పలుకుతోంది. తేజ మిర్చి ధర జనవరి, ఫిబ్రవరిలో రూ.15 వేలు ఉంటే ప్రస్తుతం ఏకంగా రూ.19,500కు చేరుకుంది.తాలు రకం కూడా క్వింటాలు ధర రూ.10 వేలకు పైగానే పలుకుతుంది.ఇలా జనవరి నెల నుంచే అన్ని రకాల మిర్చీకి ధరల్లో ఘననీయమైన పెరుగుదల కనిపించింది. పంటలు 50 శాతం తగ్గడం, గోదాముల్లో మిర్చీ నిల్వలు తక్కువగాఉండటంతో వ్యాపారులు పోటీపడి మరీ పంటను కొనుగోలు చేస్తున్నారు.మార్కెట్‌లో ధరలుఊపందుకోవడంతో రైతులు మిర్చి పంట కోతలు కోసిన వెంటనే త్వరితగతినఆరబెట్టి మార్కెట్‌కు తరలిస్తున్నారు.అన్ని ఖర్చులూ కలుపుకుని ఎకరాకు రూ.4 లక్షల వరకు పంట ఉత్పత్తి వ్యయం అవుతోంది. ఎకరానికి 25 క్వింటాళ్ల దిగుబడి వస్తే సగటున క్వింటాలుకు రూ.18 వేలు వేసిన పాతిక క్వింటాళ్లకు రూ. 4.50 లక్షల వరకు చేతికొచ్చే అవకాశం ఉంది. రైతులకు ఆనందం... వరుసగా నష్టాలు రావడంతో ఇక సాగు చేయడం తమ వల్ల కాదంటూ కొందరు మిరప సాగు చేయలేదు. ఇది కాస్త కలిసి వచ్చింది. జనవరి ప్రారంభం వరకు నామమాత్రం ధరలు ఉన్నా.. కొత్త సంవత్సరం నుంచి మిరప ధరలు పైపైకి చేరాయి. ప్రస్తుతం క్వింటాల్ మిరపకు సగటున రూ.20 వేల ధర పలుకుతోంది. జనవరికి నేటికి ధరను పోలిస్తే.. సుమారు 5 వేల రూపాయల వరకు పెరిగింది. ప్రస్తుతం మిరపకు డిమాండ్ బాగా ఉండటంతో.. వ్యాపారులు గ్రామాలకు వెళ్లి నేరుగా రైతుల వద్ద నుంచి మిరప కొనుగోలు చేస్తున్నారు. తాజా పరిణామంతో గత ఐదేళ్లుగా మిరప సాగుతో నష్టాలు చవి చూసిన రైతులు ఈసారి లాభాలను కళ్ల చూస్తున్నారు.మిర్చికి ప్రస్తుతం ఎంత డిమాండ్ ఉందంటే.. గత మంగళవారం గుంటూరు మార్కెట్ యార్డుకు 1.29 లక్షల బస్తాల మిర్చి రాగా, 1.26 లక్షల బస్తాలు అమ్ముడుపోయాయి. దీన్ని బట్టి మిర్చికి డిమాండ్ ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ సంవత్సరం రెండు తెలుగు రాష్ట్రాల్లోనే కాక గుజరాత్, మధ్యప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో కూడా మిరప సాగు తగ్గిపోయింది. అటు అంతర్జాతీయ మార్కెట్ లో మిర్చికి మంచి డిమాండ్ ఉండటంతో.. ఈ సంవత్సరం జనవరి నుంచి మిర్చి ధర క్రమంగా పెరుగుతూ వస్తోంది. గతేడాది ఇదే సమయానికి రూ.10 వేలకు అమ్ముడుపోయిన మిర్చికి ఇప్పుడు రూ.20 వేల ధర పలుకుతోంది.సన్న రకాలకు డిమాండ్ బాగా పెరిగింది. దీంతో ఈ సంవత్సరం జనవరి, ఫిబ్రవరిలో రూ.15 వేలు ఉన్న తేజ మిర్చి క్వింటాల్ ధర ప్రస్తుతం రూ.19,500కు చేరింది. తాలు ధరలు క్వింటాలుకు రూ.10 వేలకు పైనే ఉన్నాయి. ధరలు ఆశాజనకంగా ఉండటంతో రైతులు మిరప కోసిన వెంటనే ఆరబెట్టి అమ్మేస్తున్నారు.ఇదిలా ఉంటే ఈ సంవత్సరం మిరప సాగుకు పెట్టుబడులు భారీగా పెరిగాయి. అన్ని ఖర్చులూ కలిపి ఎకరాకు రూ.4 లక్షల వరకు ఖర్చు అవుతుందంటున్నారు అన్నదాతలు. ఎకరాకు 25 క్వింటాళ్ల దిగుబడి వస్తే.. సగటున క్వింటాలుకు రూ.18 వేల ధర లభిస్తే.. అప్పుడు రూ.4.50 లక్షల వరకు చేతికొస్తోందని తెలిపారు.

# కొండెక్కిన కోడి

నెల్లూరు : మాంసం ప్రియులకు షాకింగ్ న్యూస్. ఎందుకంటే చికెన్ ధరలు భారీగా పెరిగాయి. గత కొన్ని రోజులుగా పెరుగుతూ వస్తున్న చికెన్ ధరలు.. తాజాగా భారీ స్థాయిలో ఎగబాకుతోంది. ధరలు కొండెక్కుతున్నాయి. ఆదివారం బహిరంగ మార్కెట్‌లో కిలో చికెన్ (స్కిన్‌లెస్) ధర రూ.340 వరకు ఉండగా, అదే వారం రోజుల కిందట కిలో చికెన్ ధర రూ.260 వరకు ఉంది. చికెన్ ధరలు ఒక్కసారి పెరగడంతో సామాన్యులు కష్టంగా మారిపోయింది. ముందే యుద్ధం కారణంగా ఒక్కొక్కటిగా ధరలు పెరిగిపోతుండటంతో సామాన్య ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పుడు చికెన్ ధరలు పెరగడం మరింత ఆందోళన కలిగిస్తోంది.ఇదిలా ఉంటే మరోవైపు కోడి గుడ్డు ధర మాత్రం పడిపోతున్నాయి. గతంలో ఒక గుడ్డు ధర రూ.8 వరకు ఉండగా.. ఇప్పుడు రూ.4..20 పైసల వద్ద కొనసగుతోంది. కోడిగుడ్లు ఎగుమతి ఆగిపోవడంతో ధరలు పడిపోయాయని పౌల్ట్రీ యజమానులు చెబుతున్నారు. అయితే వాస్తవానికి కోడిగుడ్లు తమిళనాడుకు తీసుకెళ్లి అక్కడి నుంచి గల్ఫ్ దేశాలకు ఎగుమతి అవుతాయి. కానీ ప్రస్తుతం యుద్ధం కారణంగా గల్ఫ్‌కు ఎగుమతులు నిలిచిపోయాయి. దీంతో గుడ్డు ధర అమాంతంగా పడిపోయింది.చికెన్ ధర పెరగడానికి బ్రాయిలర్ కోళ్ల ఉత్పాదకత తగ్గడం, రంజాన్, ఇతర ఫంక్షన్ల కారణంగా చికెన్ ధరలు పెరగడానికి కారణమని చెబుతున్నారు చికెన్ దుకాణ వ్యాపారులు. డిమాండ్‌కు సరిపడా చిన్న బ్రాయిలర్ కోళ్లు కూడా దొరకడం లేదట. అలాగే పౌల్ట్రీ నిర్వాహకులు పిల్లల పెంపకం ఆపేదయం కూడా మరో కారణం అంటున్నారు. కోళ్లు డిమాండ్‌కు తగిన విధంగా సరఫరా లేని కారణంగా చికెన్ ధరలు భారీగా పెరుగుతున్నాయని చెబుతున్నారు.

# మళ్లీ రంగంలోకి ప్రశాంత్ కిషోర్

గుంటూరు : 2019 ఎన్నికల్లో వైసీపీ సాధించిన ప్రభంజన విజయంలో ప్రశాంత్ కిశోర్ వ్యూహాలు ఎలా సక్సెస్ అయ్యాయో రాష్ట్రంలో అందరికీ తెలిసిందే. అయితే 'రావాలి జగన్ – కావాలి జగన్' నినాదం అప్పట్లో ఏపీని ఊపేసింది. ఊరూరా వైసీపీ జెండా రెపరెపలాడింది. అయితే 2024 ఎన్నికల సమయంలో మాత్రం వైసీపీ చతికిలపడింది. ఇందుకు పీకే దూరమవ్వడమే కారణం. కేవలం ఐప్యాక్ (ఎ–ఖంఅ) టీమ్‌తోనే జగన్ ఎన్నికలకు వెళ్లడంతో అత్యంత దారుణమైన పరాభవాన్ని మూటగట్టుకున్నారు. జగన్ 175 అంచనాలన్నీ తలకిందులయ్యాయి. ఘోర పరాజయాన్ని చవిచూశారు. అయితే ఇప్పుడు పార్టీని మళ్ళీ గాడిలో పెట్టేందుకు జగన్ ప్రయత్నం చేస్తున్నారు. తన పాత మిత్రుడు పీకే వైపు చూస్తున్నట్లు పొలిటికల్స్ సర్కిల్స్‌లో టాక్ వినిపిస్తోంది.కాగా 2024 ఎన్నికల ఫలితాలకు ముందు ప్రశాంత్ కిశోర్ చేసిన కొన్ని వ్యాఖ్యలు అప్పట్లో ఏపీ రాజకీయాల్లో తీవ్ర దుమారాన్ని రేపాయి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓటమి తప్పదని కుండబద్దలు కొట్టారు. అంతేకాదు ఆ అంచనాలే నిజం అయ్యాయి. దీంతో వైసీపీ శ్రేణుల్లో నైరాశ్యం నెలకొంది. ప్రస్తుతం పార్టీ కార్యక్రమాలతో జగన్ ప్రజల్లోకి వెళ్తున్నా ఆశించిన స్థాయిలో ఫలితం కనిపించడంలేదని ఆయన భావిస్తున్నారని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో పీకే వంటి బలమైన వ్యూహకర్త మళ్లీ అవసరమని జగన్ భావిస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు 2029 లక్ష్యాన్ని ఛేదించేందుకు మూడేళ్ల ముందే నుంచి వ్యూహాలు సిద్ధం చేస్తున్నారని, ఇందులో భాగంగానే పీకేతో జగన్ సంప్రదింపులు చేస్తున్నారనే ప్రచారం రాష్ట్రంలో జోరుగా జరుగుతోంది.ప్రస్తుతం ప్రశాంత్ కిశోర్ బీహార్‌లో జన్ సూరాజ్ పార్టీ పెట్టి ఆ ప్రయాణంలో బిజీగా ఉన్నారు. గతంలో ఆయన 'నేను వ్యూహకర్త బాధ్యతల నుంచి తప్పుకున్నాను' అని ప్రకటించారు. కానీ జగన్‌తో ఉన్న పాత పరిచయం కారణంగా వీరి కలయిక మళ్లీ సాధ్యమేననే విశ్లేషణలు జరుగుతున్నాయి. ఐప్యాక్ టీమ్ క్షేత్రస్థాయిలో పార్టీ కోసం పని చేస్తే మళ్లీ విజయవంతమైన ఫలితాలు ఉంటాయని, అటు క్యాడర్‌లోనూ కొత్త ఉత్సాహం వస్తుందని వైసీపీ అగ్రనేతలు భావిస్తున్నారని తెలుస్తోంది.రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, మిత్రులు ఉండరనే సామెత ఉండనే ఉంది. ఈ ప్రకారం జగన్, పీకే మళ్ళీ చేతులు కలిపితే రాష్ట్ర రాజకీయాల్లో పెను మార్పులు జరుగుతాయి. 2024 ఓటమి నుంచి పాఠాలు నేర్చుకున్న జగన్.. మళ్లీ పీకే సలహాలు తీసుకుని సరికొత్త 'జగన్ 2.0' వ్యూహాన్ని ఎలా అమలు చేస్తారో చూడాలి.

# రాజ్యసభకు యనమల, సానా

కాకినాడ : కూటమిలో రాజ్యసభ రేసు ఆసక్తికరంగా మారింది. త్వరలో ఏపీలో నాలుగు రాజ్యసభ సీట్లు ఖాళీ కాబోతున్నాయి. దీంతో పెద్దల సభ రేసులో..తెలుగు తమ్ముళ్లు పెద్ద క్యూ కట్టారు. పైరవీల పర్వం నెక్స్ట్ లెవల్‌కు చేరుకుంది. నాలుగు స్థానాల సీట్లలో టీడీపీకి రెండు, జనసేన, బీజేపీకి చెరో సీటు దక్కే అవకాశం ఉంది. టీడీపీకి దక్కే రెండింటిలో గతేడాది ఎన్నికైన సానా సతీష్ ఏడాదిన్నరలోనే పదవీ విరమణ చేస్తుండటంతో ఆయనకు మళ్లీ రెన్యూవల్ చేస్తారని పార్టీలో జోరుగా ప్రచారం జరుగుతోంది. దీంతో టీడీపీకి కొత్తగా దక్కేది ఒక్క సీటేనన్న అంచనాలు ఉన్నాయి.ఆ ఒక్క సీటు కోసం టీడీ జనార్ధన్ పేరు ప్రధానంగా వినిపిస్తోంది. ఆయన సీఎం చంద్రబాబు రాజకీయ కార్యదర్శిగా ఉన్నారు. టీడీపీ మాజీ పొలిట్ బ్యూరో మెంబర్, గతంలో ఎమ్మెల్సీ. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో టీడీ జనార్ధన్‌ను రాజ్యసభకు పంపితే..ఢిల్లీ పనులన్నీ చక్కబెడతారని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇదే టైమ్‌లో మరో సీనియర్ లీడర్ యనమల రామకృష్ణుడు రాజ్యసభ బెర్త్ కోసం ఎన్నో ఆశలు పెట్టుకున్నారు.తెలుగుదేశం పార్టీ పుట్టిన దగ్గర నుంచి యనమల రామక్రిష్ణుడు పార్టీలో ఉన్నారు. 1983లోనే ఆయన ఎమ్మెల్యేగా గెలిచి..ఎన్టీఆర్ మంత్రి వర్గంలోనే కీలక మంత్రి పదవులు నిర్వహించారు. ఇక చంద్రబాబు హయాంలో స్పీకర్‌గానే కాకుండా ఆర్థిక మంత్రిగా సుదీర్ఘ కాలం పనిచేస్తూ ఎన్నో బడ్జెట్లను ప్రవేశపెట్టారు. పన్నెండేళ్ల పాటు ఎమ్మెల్సీగా ఉన్నారు. అయితే యనమల చిరకాల కోరిక రాజ్యసభకు వెళ్లాలని. దశాబ్ద కాలంగా ఆయన పెద్దల సభకు వెళ్లాలని ఆశపడుతున్నారు. కానీ ఇప్పటివరకు అవకాశం లేదు.ఇప్పుడా ఆ ముహూర్తం దగ్గర పడిందా అంటే అవుననే ప్రచారం జరుగుతోంది. అయితే సానా సతీష్‌కు రెన్యూవల్ చేయగా..మిగిలిన సీటును సీనియర్లలో ఎవరికో ఒకరికి ఇవ్వాలని చంద్రబాబు ఫిక్స్ అయినట్లు టాక్. పైగా ఆ సీటు బీసీలకు ఇస్తారని అంటున్నారు. ఈ రెండు ఈక్వేషన్స్ బట్టి చూస్తే యనమల స్వీట్ న్యూస్ పక్కా అన్న మాట బలంగా వినిపిస్తోంది. గతేడాది మార్చిలోనే ఆయన ఎమ్మెల్సీ పదవి గడువు ముగిసింది. దీంతో పెద్దాయనకు సముచితమైన గౌరవం దక్కాలంటే కచ్చితంగా రాజ్యసభకు పంపడమే బెటర్ అని పార్టీ పెద్దలు భావిస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.యనమల చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడు. ఆంతరంగికుడిగా మెలుగుతారు కూడా. ఇద్దరూ సమ వయస్కులు. ఇద్దరూ రాజకీయంగా కలసి మెలసి ఉంటూ టీడీపీలో కీలక దశకు చేరుకున్న వారు. దాంతో చంద్రబాబు తన మిత్రులకు..పైగా సీనియర్లకు గౌరవనీయమైన స్థానం కల్పించే యోచనలో ఉన్నట్లు చెబుతున్నారు. గతేడాది సీనియర్ లీడర్ అశోక్ గజపతి రాజుకు గోవా గవర్నర్‌గా అవకాశం దక్కింది. ఇప్పుడు మరో సీనియర్ నేత యనమల వంతు వచ్చిందని..ఆయనకు రాజ్యసభ సీటు రిజర్వ్ అయిందని చెబుతున్నారు. త్వరలోనే చంద్రబాబు నోట యనమలకు గుడ్ న్యూస్‌ను వినిపించబోతున్నారని పెద్ద ఎత్తున ప్రచారం సాగుతోంది.అయితే ఈ మధ్యే యనమల అల్లుడు, ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ డ్రగ్స్ కేసులో ఇరుక్కోవడం పెద్ద రచ్చగా మారింది. ఆ ఎఫెక్ట్‌తో యనమల అవకాశాలు ఏమైనా పోతాయా అనే ప్రచారం నడుస్తుండగా..అలాంటిదేమీ లేదని అంటున్నారు. యనమల టీడీపీ పుట్టినప్పటి నుంచి నిబద్ధతతో పార్టీకి సేవ చేస్తున్న లీడర్. ఆయన అనుభవం, పార్టీకి చేసిన సేవ లెక్కలోకి వస్తాయని చెబుతున్నారు. మొత్తానికి యనమల పెద్దల సభలోకి అడుగు పెట్టాలన్న కోరిక మరో రెండు నెలలలో తీరిపోతుందని అంటున్నారు. లాస్ట్ మినిట్ ఏమైనా మార్పులు చేర్పులు జరుగుతాయా? లేక యనమలకు బెర్త్ పక్కానా అనేవి చూడాలి.


# జ్ఞాపకంగా కృష్ణా ప్యాలెస్

విజయవాడ : కృష్ణా నదిపై బ్రిటిషర్ల హయాంలో నిర్మించిన బ్రిడ్జి చరిత్రలో జ్ఞాపకంగా మిగలబోతోంది. 130 ఏళ్లకుపైగా చరిత్ర ఉన్న కృష్ణా ప్యాలెస్ బ్రిడ్జి పిల్లర్ల కూల్చివేతలు మొదలు పెట్టారు. కొత్త డబుల్ లైన్ రైల్వే బ్రిడ్జి నిర్మాణం చేసేందుకు ఈ పాత బ్రిడ్జి పిల్లర్లను కూల్చివేయబోతున్నారు.హైడ్రాలిక్ క్రేన్ల సాయంతో కూల్చివేతలు సాధ్యం కాకపోవడంతో.. అధికారులు లిమిటెడ్ బ్లాస్టింగ్ విధానంలో కూల్చేందుకు సిద్ధమవుతున్నారు.130 ఏళ్లకుపైగా చరిత్ర కలిగిన బ్రిటీష్ కాలం నాటి రైల్వే బ్రిడ్జి కనమరుగు కాబోతోంది. 1893లో ప్రారంభించిన ఈ బ్రిడ్జి స్థానంలో కొత్తగా డబుల్ లైన్ బ్రిడ్జిని నిర్మించడం కోసం రైల్వేశాఖ కసరత్తు చేస్తోంది. గతంలోనే ఈ బ్రిడ్జిపై ఉన్న నిర్మాణాన్ని కూల్చివేయగా.. ప్రస్తుతం ఈ బ్రిడ్జికి సంబంధించి మిగిలిన పిల్లర్లను తొలగించే పనులు చేపట్టారు. రెండు వారాలకు పైగా హైడ్రాలిక్ క్రేన్ల సహాయంతో పిల్లర్లను పగలగొట్టాలని ప్రయత్నించారు.. కానీ వీలు పడలేదు. అందుకే ఈ పిల్లర్లను కూల్చివేసేందుకు లిమిటెడ్ బ్లాస్టింగ్ పద్ధతిలో కూల్చివేతలు ప్రారంభించనున్నారు. ఈ విధానంలో ఒక్కో పిల్లర్‌ను తొలగించకుంటూ పోతారు. దీనికి చాలా సమయం పడుతుందని చెబుతున్నారు. 1856 ప్రాంతంలో అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఎంఎస్ఎం (మద్రాస్ టు సదరన్ మరాఠా) రైల్వేలో విజయవాడ ఓ భాగంగా ఉండేది. 1893లో కృష్ణానదిపై మూడు కిలోమీటర్ల పొడవున మీటర్ గేజ్ విధానంలో ఈ రైల్వే బ్రిడ్జిని ప్రారంభించారు. వంతెన ప్రవేశ మార్గంలో కోట బురుజులను తలపించే రెండు నిర్మాణాలు ఉండటం, అవి చూసేందుకు ప్యాలెస్‌ను తలపించడంతో.. ఈ బ్రిడ్జికి కృష్ణా ప్యాలెస్‌గా పేరు పెట్టారు. ఈ బ్రిడ్జి నిర్మాణానికి స్టీల్ వాడకుండా రాతి బండలు, గానుగ సున్నం సాయంతోనే అత్యంత పటిష్టంగా నిర్మించారు. అందుకే ఇన్నేళ్లు గడిచినా పిల్లర్లను కూల్చడానికి శ్రమించాల్సి వస్తోంది.1897లో ఈ రైల్వే బ్రిడ్జిని బ్రాడ్ గేజ్‌గా అప్‌గ్రేడ్ చేశారు. అనంతరం రైల్వేశాఖ ఈ బ్రిడ్జికి తూర్పు, పశ్చిమ వైపున రైల్వే బ్రిడ్జిలు నిర్మాణం చేసింది. 1985 వరకు ఈ వంతెన సేవలు అందించింది. 1993లో అధికారికంగా ఈ వంతెనపై రాకపోకలు నిలిపేశారు. ఆ తర్వాత కృష్ణా ప్యాలెస్ బ్రిడ్జి వయాడక్ట్‌ను తొలగించగా.. అప్పటి నుంచి ఈ పిల్లర్లు మాత్రమే ఉండిపోయాయి. అయితే ప్రస్తుతం విజయవాడ, గూడూరు మధ్య మూడో రైల్వే లైన్ నిర్మాణం చేపట్టడంతో.. డబుల్ లైన్ రైల్వే బ్రిడ్జి నిర్మించాలని ప్లాన్ చేశారు. అందుకే ప్రస్తుతం చారిత్రక కృష్ణా ప్యాలెస్ బ్రిడ్జికి సంబంధించి మిగిలిన పిల్లర్లను కూడా తొలగించాలని నిర్ణయించారు.130 ఏళ్లకుపైగా చరిత్ర ఉన్న బ్రిడ్జికి సంబంధించిన పిల్లర్లను తొలగించొద్దని కోరుతూ గతంలో కొందరు రైల్వే అధికారులకు లేఖలు రాశారు. దీంతో ఈ బ్రిడ్జి జోలికి వెళ్లలేదు.. కానీ ఇప్పుడు డబుల్ లైన్ రైల్వే బ్రిడ్జి కోసం కృష్ణా ప్యాలెస్ వంతెన పిల్లర్లను తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒకవేళ ఈ వంతెన పిల్లర్లను అలాగే వదిలేసి కొంత దూరంలో కొత్త బ్రిడ్జి నిర్మించాలన్నా అనుమతుల విషయంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది.

అందుకే ఈ పాత బ్రిడ్జిని తొలగించి.. కొత్త బ్రిడ్జిని నిర్మించాలని ప్లాన్ చేశారు. ముందుగా పిల్లర్లను తొలగించే ప్రక్రియను మొదలు పెట్టారు.

కానీ వంతెన పిల్లర్లు ఇప్పటికీ పటిష్టంగా ఉండటంతో.. హైడ్రాలిక్ క్రేన్ల సాయంతో వాటిని తొలగించడం సాధ్యం కాలేదు. అందుకే లిమిటెడ్ బ్లాస్టింగ్ విధానంలో ఈ పిల్లర్లను కూల్చే పనులు ప్రారంభించనున్నారు. ఈ విధానంలో తక్కువ మోతాదులో పేలుడు పదార్థాలను ఉపయోగించి, పిల్లర్లకు పగుళ్లు వచ్చేలా చేస్తారు. ఆ తర్వాత హైడ్రాలిక్ క్రేన్ల సాయంతో తొలగిస్తారు. దీంతో విజయవాడ చరిత్రలో 'కృష్ణా ప్యాలెస్' వంతెన జ్ఞాపకంగా మిగలబోతోంది

# డ్యామేజ్ కంట్రోల్ కోసం వైసీపీ రూట్ మార్చిందా?



విశాఖపట్టణం : ఏపీ పాలిటిక్స్‌లో గాజువాకకు స్పెషల్ పొలిటికల్ బ్యాగ్రౌండ్ ఉంది. మిగిలిన నియోజకవర్గాల్లాగా..ఇక్కడ క్యాస్ట్ పాలిటిక్స్ చేయడం అంత ఈజీ కాదన్న అభిప్రాయం ఉంది. అయితే గత ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగానే కాదు..గాజువాకలోనూ వైసీపీ వేసిన వ్యూహాలు ఏ మాత్రం వర్కౌట్ కాలేదు. ఘోర పరాజయం తప్పలేదు. దీంతో ఇప్పుడు లోకల్ బాడీ ఎన్నికలకు ముందు వైసీపీ పెద్దలు కాస్త అలర్ట్ అయినట్లు కనిపిస్తోంది. గాజువాక మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డిని వైసీపీ స్టేట్ పొలిటికల్ అఫైర్స్ కమిటీలో సభ్యుడిగా నియమించింది. వైసీపీకి పీఏసీ అనేది చాలా ప్రెస్టీజియస్. సీనియర్ లీడర్లు, మాజీ మంత్రులు, కీలక నేతలకు మాత్రమే చోటు దక్కుతుంది.కానీ గాజువాకలో కేవలం ఒకే ఒక్కసారి ఎమ్మెల్యేగా గెలిచిన తిప్పల నాగిరెడ్డిని పీఏసీలోకి తీసుకోవడం వెనుక వైసీపీ స్ట్రాటజీ ఏంటన్నది విశాఖ రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారింది. నాగిరెడ్డి కేవలం ఒకే ఒక్కసారి గెలిచినా సరే సంచలన విజయాన్ని రికార్డు క్రియేట్ చేశారు. 2019లో జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను 16వేల ఓట్లతో ఓడించి తన పేరు రీసౌండ్ చేసేలా గుర్తింపు పొందారు. అయితే మాత్రం ఏం లాభం..గత ఎన్నికల్లో వైసీపీ అనూహ్యంగా ఆయన్ను పక్కన పెట్టింది. వృద్ధాప్యం..అనారోగ్యం..కారణంగా తన కుమారుల్లో ఎవరో ఒకరికి ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలంటూ నాగిరెడ్డి హైకమాండ్‌కు ఛాయిస్ ఇచ్చి సైలెంట్ అయిపోయారు.పవన్‌ను ఓడించిన నేతగా నాగిరెడ్డికి క్రెడిట్ ఉన్నా తన కుమారులకు టికెట్ ఇవ్వాలంటూ ఆయన చేసిన రిక్వెస్ట్‌ను వైసీపీ అధిష్టానం లైట్ తీసుకుంది. క్యాస్ట్ ఈక్వేషన్స్‌తో యాదవ సామాజికవర్గానికి చెందిన నేతను బరిలో నిలిపితే విజయం వరిస్తుందని అంచనా వేసి ఉరుకూటి చందు అనే నేతకు నియోజకవర్గ బాధ్యతలు కూడా అప్పగించారు. వైసీపీ తీసుకున్న ఈ నిర్ణయం గాజువాకలో గందరగోళం సృష్టించినా సరే పార్టీ పెద్దలు వెనక్కి తగ్గలేదు. యాదవ సామాజికవర్గానికి చెందిన ఉరుకూటి చందుకే టికెట్ అనే సంకేతాలను బలంగా పంపారు. అంతా బాగానే ఉందనుకున్న సమయంలో..కాపు సామాజికవర్గానికి చెందిన గుడివాడ అమర్‌నాథ్‌ను లాస్ట్ మినిట్‌లో గాజువాక బరిలోకి దించారు. కూటమి తరుఫున యాదవ సామాజికవర్గ నేత పల్లా శ్రీనివాసరావు బరిలోకి దిగడంతో..కాపు ఈక్వేషన్స్..స్టీల్ ప్లాంట్ పరిరక్షణ అంటూ వైసీపీ వేసిన స్కెచ్‌లన్నీ గాల్లో కొట్టుకుపోయాయి. రాష్ట్రంలోని 175 ఎమ్మెల్యేల్లో..గాజువాకలోనే టీడీపీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్‌కు అత్యధిక మెజార్టీ వచ్చింది.ఘోర ఓటమి తర్వాత ఇప్పుడు వైసీపీ పెద్దలకు అసలు సీన్ అర్థమైందన్న టాక్ వినిపిస్తోంది.

త్వరలో స్థానిక, విశాఖ కార్పొరేషన్ ఎన్నికలు రానుండటంతో పట్టు నిలుపుకోవాలన్న ఉద్దేశంతో కీలక నిర్ణయాలు తీసుకుంటుందట. ఇందులో భాగంగా తిప్పల నాగిరెడ్డిని మళ్లీ తెరపైకి తెచ్చారని అంటున్నారు. అప్పటికే అనారోగ్యంతో ఉన్నానని, వయోభారంతో రాజకీయాల్లో కొనసాగలేనని రెండేళ్ల క్రితమే చేతులెత్తేసిన తిప్పల నాగిరెడ్డిని మళ్లీ పొలిటికల్ స్క్రీన్ తెస్తూ..పార్టీ పొలిటికల్ ఎఫైర్స్ కమిటీ మెంబర్‌గా నియమించింది. ఈ నిర్ణయం వెనుక వైసీపీ పెద్ద కసరత్తే చేసిందన్న టాక్ వినిపిస్తోంది.ప్రస్తుతం వైసీపీకి గాజువాకలో దిక్కూమొక్కూ లేదు. గత ఎన్నికల్లో పోటీ చేసి ఓడిన గుడివాడ అమర్‌నాథ్ చోడవరం నియోజకవర్గానికి వెళ్లిపోయారు. దీంతో వైసీపీకి నియోజకవర్గాన్ని నడిపే నాయకుడు కరువయ్యాడు. గ్రేటర్ విశాఖ సిటీలోనే ఇలాంటి దుస్థితి ఉంటే కష్టమని భావించి నాగిరెడ్డికి హితబోధ చేసి మరీ ఈ బాధ్యతలు అప్పగించారని గుసగుసలు వినిపిస్తున్నాయి. తర్వాత ముందు నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేయాలని నాగిరెడ్డికి టాస్క్ ఇచ్చారట.

# అందుబాటులోకి రానున్న నేషనల్ హైవే 565

ఒంగోలు : తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మధ్య కీలకమైన నేషనల్ హైవే 565 పనులు పూర్తి చేశారు. ఈ హైవేపై వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. అయితే ఈ హైవే పనుల్లో భాగంగా.. యర్రగొండపాలెం దగ్గర 20 కిలో మీటర్ల రోడ్డును విస్తరించారు. దీంతో హైదరాబాద్ వెళ్లే ప్రయాణికులకు ఊరట దక్కింది. ఈ 20 కిలో మీటర్లు అటవీ ప్రాంతం మీదుగా వెళుతోంది.. బ్రిడ్జిలు, అండర్‌పాస్‌లతో ప్రయాణం సాఫీగా సాగుతోంది.తెలుగు రాష్ట్రాల మధ్య నేషనల్ హైవే 565 అందుబాటులోకి వచ్చింది. తెలంగాణలోని నకిరేకల్ వద్ద మొదలయ్యే ఈ హైవే.. ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి సమీపంలో ఉన్న ఏర్పేడు దగ్గర ముగుస్తుంది. ఈ కొత్త హైవే హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారి 65ని.. మదనపల్లె నుంచి నాయుడుపేట వెళ్లే నేషనల్ హైవే 71తో కలుపుతుంది. తెలంగాణలోని నల్గొండ, ఖమ్మం, వరంగల్ తదితర ప్రాంతాల నుంచి తిరుపతి వెళ్లడానికి ఈ కొత్త హైవే ప్రత్యామ్నాయ మార్గంగా ఉపయోగపడనుంది.ఈ హైవే నల్గొండ, మాచర్ల, యర్రగొండపాలెం, మార్కాపురం, పొదిలి, కనిగిరి, పామూరు, దుత్తలూరు, రాపూరు, వెంకటగిరి, ఏర్పేడు మీదుగా వెళుతోంది. కొత్తగా ఏర్పడిన మార్కాపురం జిల్లా యర్రగొండపాలెం నుంచి హైదరాబాద్ రాత్రిళ్లు అటవీ ప్రాంతం మీదుగా వెళ్లడం గతంలో చాలా ఇబ్బందిగా ఉండేది. ముఖ్యంగా పుల్లల చెరువు దగ్గర నుంచి వెల్దుర్తి మండలం వరకు రోడ్డు పరిస్థితి దారుణంగా ఉండేది. ట్రాఫిక్ సమస్యలు ఎదురయ్యేవి. అయితే జాతీయ రహదారి 565 నిర్మాణంతో ఆ కష్టాలు తొలగిపోయాయి. ఈ రోడ్డు అభివృద్ధి చేయడంతో యర్రగొండపాలెం నుంచి హైదరాబాద్‌కు ప్రయాణం సులభతరమైంది.ఈ రూట్‌లో.. ఎన్‌హెచ్–565లో భాగంగా ఉన్న ఈ 20 కిలోమీటర్ల రోడ్డు విస్తరణకు గతంలో ఇబ్బందులు ఎదురయ్యాయి. ముఖ్యంగా అటవీ అనుమతులు ఆలస్యం కావడంతోపాటు మరికొన్ని అడ్డంకులు వచ్చాయి. అయితే 2024లో ఈ పనులకు లైన్ క్లియర్ కావడంతో.. గతేడాది పనులు ప్రారంభించి వేగవంతం చేశారు. ఈ రోడ్డును నిర్దేశిత సమయం కంటే ముందే పూర్తిచేసి అందుబాటులోకి తీసుకొచ్చారు. అటవీ ప్రాంతం మీదుగా కొండలు, లోయల మధ్య వెళ్లే ప్రయాణికులకు ఈ మార్గం సరికొత్త అనుభూతిని పంచుతోంది. రోడ్డు బాగోలేకపోవడంతో పుల్లలచెరువు నుంచి వెల్దుర్తి మండలం వరకు ప్రయాణానికి 50 నిమిషాలు పట్టేది. కానీ ఇప్పుడు 20 నిమిషాల్లోనే వెళ్లొచ్చు. 20 కిలోమీటర్ల పొడవైన ఈ రోడ్డు నిర్మాణానికి రూ.393 కోట్లు ఖర్చు చేశారు. అటవీ ప్రాంతం, ఘాట్ రోడ్డు కావంతో చిన్న, పెద్దవి కలిపి మొత్తం 16 వంతెనలు, 8 అండర్‌పాస్‌లను ఏర్పాటు చేశారు. పొడవు దాదాపు 420 కిలోమీటర్లు కాగా.. మెజార్టీ భాగం ఆంధ్రప్రదేశ్‌లోనే ఉంది.

## యాదాద్రి లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకున్న ఇనకొండ చంద్రారెడ్డి

### నిత్య అన్నదాన కార్యక్రమానికి లక్ష రూపాయల విరాళం అందజేత

గజ్వేల్ నియోజకవర్గం:25 మార్చ్ 2026 ( ప్రజా కలం ప్రతినిధి )

ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో సేవా కార్యక్రమాల్లో ముందు వరుసలో ఉంటూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు ప్రముఖ వ్యాపారవేత్త ఇనకొండ చంద్రారెడ్డి హైదరాబాద్ కు చెందిన ప్రముఖ



వ్యాపారవేత్త ఇనకొండ చంద్రారెడ్డి ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుని అక్కడ నిర్వహిస్తున్న నిత్యాన్నదాన కార్యక్రమంలో తమవంతుగా ఒక లక్ష రూపాయలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ పురోహితులు మాట్లాడుతూ చంద్రారెడ్డి నిత్యాన్నదాన కార్యక్రమానికి విరాళం అందజేయడం అభినందనీయమని వారికి వారి కుటుంబానికి శ్రీ లక్ష్మీనరసింహస్వామి కరుణా కటాక్షాలు ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రణతి రెడ్డి,భవిక్ రెడ్డి,అక్షిత్ రెడ్డి,హర్షవర్ధన్ రావు దంపతులు, కొండ నవీన్ దంపతులు,బిఆర్ఎస్ పార్టీ మర్కుక్ మండల బీసీ సెల్ అధ్యక్షుడు మ్యాకల కనకయ్య ముదిరాజ్,తదితరులు పాల్గొన్నారు

## అంగన్వాడి స్కూల్ సందర్శించిన కౌన్సిలర్ గోలి మమత సంతోష్

గజ్వేల్ :25 మార్చ్ 2026 ( ప్రజా కలం ప్రతినిధి )

సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ 2 వ వార్డ్ లో




కౌన్సిలర్ గోలి మమత సంతోష్ అంగన్వాడి స్కూల్ సందర్శించారు విద్యార్థులకు మరియు గర్భిణీ స్త్రీలకు అందిస్తున్న పౌష్టికాహారం నాణ్యతను వారు స్వయంగా పరిశీలించారు, చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని సూచించారు, పిల్లల హాజరు శాతం, వారికి నేర్పిస్తున్న ప్రాథమిక విద్యా బోధనను పర్యవేక్షించారు, అంగన్వాడికీ తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు

## వడ్డేపల్లిలో శ్రీ సీతారామచంద్ర స్వామి కల్యాణోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి.

సిద్దిపేట జిల్లా మార్చి 25. ప్రజాకలం ప్రతినిధి

రాయపోల్ మండలం వడ్డేపల్లి గ్రామంలో శ్రీ సీతారామచంద్ర స్వామి కల్యాణోత్సవ కార్యక్రమాలు భక్తిశ్రద్ధల మధ్య నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని వడ్డేపల్లి సర్పంచ్ రాజాగారి రేణుక రాజా



గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూడు రోజుల పాటు ఈ మహోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. నేడు ఉదయం 8:30 గంటలకు స్వామివారి అభిషేకం, ఉదయం 10:30 గంటలకు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మార్చి 27వ తేదీ శుక్రవారం సాయంత్రం 6:00 గంటలకు స్వామివారి కల్యాణం వైభవంగా జరగనుంది. మార్చి 28వ తేదీ శనివారం ఉదయం 5:30 గంటలకు రథోత్సవం నిర్వహించనున్నారు. అదే రోజు సాయంత్రం 4:00 గంటలకు శ్రీ పోచమ్మ దేవత బోనాల నృత్య కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ వేడుకలకు చుట్టుపక్కల గ్రామాల భక్తులు పెద్ద ఎత్తున హాజరై స్వామివారి ఆశీర్వాదాలు పొందాలని సర్పంచ్ కోరారు.



# ‘ఉపాధి’లో ఫోటో క్యాప్చర్ విధానం రద్దు చేయాలి

### - పాత పద్దతిలోనే ఉపాధి హామి పథకం కొనసాగించాలి.
### -ఉపాధి హామీ పై బీజేపీ దాడి..కేంద్ర ప్రభుత్వ చర్యలను ప్రతిఘటిద్దాం
### -సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్కరాములు
### -సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట సిపిఎం ధర్నా..

సంగారెడ్డి ప్రతినిధి మార్చి 25( ప్రజా కలం):

ఉపాధి కూలీలకు పనులు ప్రారంభించే సమయంలో, పనులు ముగిసిన వెంటనే ఫోటో క్యాప్చర్ విధానం తప్పనిసరి చేయడం వల్ల కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని దానిని వెంటనే రద్దు చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చుక్క రాములు డిమాండ్ చేశారు. బుధవారం సీపీఐ(ఎం) జిల్లా కమిటీ ఆద్వర్యంలో ఉపాధి కూలీలకు పాత పద్ధతిలోనే పనులు కొనసాగించాలని, ఫోటో క్యాప్చర్ విధానం రద్దు చేయాలని, పెండింగ్ వేతనాలు ఇవ్వాలని, నిరుపేదలకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ ధర్నాకు ముఖ్యఅతిథిగా హాజరైన చుక్క రాములు మాట్లాడుతూ సీపీఐ(ఎం) కార్యకర్తలు గ్రామాలు పర్యటించారన్నారు. ఈ పర్యటనలో అనేక సమస్యలు వెలుగులోకి వచ్చాయన్నారు. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామి పథకాన్ని పేరు మార్చి వీబీజీ రాంజీ అనే పథకాన్ని తీసుకువచ్చిందని, ఈ పథకం అమలు తీరు పాత పద్ధతిలో కొనసాగించకుండా బలహీనం చేయడం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్నట్టుగా అర్థం అవుతుందన్నారు. పనులు చేసిన వారికి ఎనిమిది వారాలు అయ్యింది వారికి ఇప్పటి వరకు వేతనాలు ఇవ్వడం లేదని, వేతనాలు రాకుంటే ప్రజలు ఎలా బతుకుతారో ప్రభుత్వం ఆలోచించాలన్నారు. రెండో విషయం ఈవాళ ఫోటో క్యాప్చరింగ్ పద్ధతి పెట్టారని, కూలీల పోటోలు తీసి దానిని వారి వెబ్ సైట్ లో పెట్టుకోవడానికి చేస్తున్న ప్రయత్నమన్నారు. పోటోల వల్ల కూలీలకు చాలా ఇబ్బంది అవుతుందని, ఆ కెమెరాలో ఫోటోలు సరిగా రాక చాలా లేటవుతున్న పరిస్థితి ఉందన్నారు. రెండు, మూడు గంటలు పని చేస్తే ఈ అటెండెన్స్ కోసం ఇంకో మూడు నాలుగు గంటలు ఉండాల్సి వస్తుందన్నారు. గతంలో ఉన్న సౌకర్యాలను తొలగి రాష్ట్ర ప్రభుత్వం మా దగ్గర డబ్బులు లేవని చెప్పే పరిస్థితి ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే దీనిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ఇండ్లు, ఇండ్ల జాగలు అర్హులకు ఇవ్వాలి..


అతి ముఖ్యమైన సమస్య అర్హులైన వారందరికి ఇండ్లు, ఇండ్ల జాగలు ఇవ్వాలని చుక్క రాములు డిమాండ్ చేశారు. అనేక పట్టణాల్లో, గ్రామాల్లో ఇండ్లు లేక ఇబ్బంది పడుతున్న పరిస్థితి ఉందన్నారు. గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూం అని చెప్పింది..ఈ ప్రభుత్వం వచ్చి ఇందిరమ్మ ఇండ్లు అంటుంది..కానీ వాస్తవంగా అర్హులైన వారికి మాత్రం జాగలేదు..అందుకని ఇండ్లు, ఇండ్ల స్థలాల సమస్యను తక్షణమే పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా నక్కవాగు కాలుష్యం వల్ల అనేక గ్రామాలు ఇబ్బంది పడుతాఉన్నాయి..ముఖ్యంగా లింగంపల్లి, పరిసర ప్రాంతాలు పెద్ద ఎత్తున దోమలు, వాసన తో ప్రజలు బాదపడుతున్నారన్నారు. ప్రభుత్వం తక్షణమే ఈ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా యుద్ధం మూలకంగా ఇరాన్ మీద అమెరికా చేస్తున్న దుర్మార్గమైన యుద్ధం మూలకంగా గ్యాస్ సమస్య ఏర్పడ్డదని, చాలా చోట్ల వాణిజ్య సిలిండర్లు లేక చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునేవారు, హోటల్స్ నడిపేవారు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటి అవసరాలకు గ్యాస్ లేకుండా ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. పెట్రోల్, డీజిల్ కోసం వాహనాలు క్యూలో నిలబడుతున్న పరిస్థితి ఉందన్నారు. అందుకని ఈ సమస్యలన్నింటిని ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ధర్నా ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.

వెంటనే అర్హులైన పేదలందరికి ఇండ్ల స్థలాలు ఇవ్వాలి..

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి జి.జయరాజు మాట్లాడుతూ జిల్లాలో అర్హులైన పేదలందరికి ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి జి.జయరాజ్ డిమాండ్ చేశారు. పేదలకు ఇండ్ల స్థలాలు ఇవ్వకుంటే ప్రభుత్వ భూములను గుర్తించి అందులో గుడిసెలు వేసి ఆక్రమిస్తామని హెచ్చరించారు. జిల్లాలో ఇండ్లు, ఇండ్ల స్థలాలు లేని పేదలు చాలా మంది ఉన్నారని వారందరికి వెంటనే ఇండ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇండ్ల స్థలాలు ఇవ్వకుంటే సీపీఐ(ఎం) ఆద్వర్యంలో ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి గుడిసెలు వేసేందుకు ప్రజలు సిద్దంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ ధర్నాలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బీరం మల్లేశం, కె.రాజయ్య, అతిమేల మానిక్, జి.సాయిలు, ఎం.నర్సింలు, జిల్లా కమిటీ సభ్యులు వి.ప్రవీన్ కుమార్, ఎం.యాదగిరి, నాగేశ్వర్ రావు, కృష్ణ, నాయకులు రాజయ్య, రమేష్ గౌడ్, మహేష్, ఖయ్యూం, వివిధ గ్రామాల నుండి కూలీలు తదితరులు పాల్గొన్నారు.

## కిమ్స్ సన్ షైన్ హాస్పిటల్ లో పానో స్కోపీ టెక్నాలజీ

### భారత దేశంలోనే తొలిసారిగా వైద్యం





కంటోన్మెంట్: మార్చ్ 25:ప్రజా కలం ప్రతినిధి

ప్రపంచ వ్యాప్తంగా వైద్య రంగంలో అదుబాటులోకి వచ్చిన సాంకేతిక వైద్య సేవలను కిమ్స్ సన్ షైన్ హాస్పిటల్ లో అందిస్తామని ఆసుపత్రి ఎండీ డాక్టర్ గురువారెడ్డి రెడ్డి స్పష్టం చేశారు. ఆర్థోపెడిక్ వైద్యరంగంలో పానో స్కోపి టెక్నాలజీ విప్లవాత్మక మార్పుకు శ్రీకారం చుట్టానుందన్నారు. దేశంలోనే తొలిసారిగా ఈ వైద్య సేవలను ప్రారంభించడం సంతోషం గా ఉందన్నారు. ఈ సాంకేతిక తో 60 ఏళ్ళ వారికి వైద్యం అందించినట్లు వివరించారు. ఈ సాంకేతిక పరిజ్ఞానం తోఎముక ప్రమాద ప్రాంతాన్ని 360 డిగ్రీలో గుర్తించి వైద్యం అందించడం చాలా తేలికన్నారు. ముఖ్యంగా క్రీడాకారులు ప్రమాదాని గురై కీళ్ళ సమస్యను సులువుగా త్వరగా వైద్యం చేయవచన్నారు. కిమ్స్ సన్ షైన్ హాస్పిటల్ లో డాక్టర్ చంద్ర శేఖర్ ఆధ్వర్యంలో 10 మంది వైద్యులు ఈ సేవలను అందిటున్నట్లు స్పష్టం చేశరు. ఫ్రాన్స్ లో శిక్షణ తీసుకున్నారని వివరించారు. హైదరాబాద్ లో తొలిసారిగా ఈ వైద్య సేవలు అందుబాటులో కి రావడం సంతోషంగా ఉండన్నారు. కిమ్స్ సన్ షైన్ హాస్పిటల్ లో నడుస్తున్న 26 బ్రాంచ్ ల్లో ఈ వైద్యం అందిస్తామన్నారు.

భవిష్యత్తులో లాప్రోస్కోపీ త్రీడి వంటి సాంకేతిక పరిజ్ఞానం వైద్య రంగంలో కీలకంగా మారణం అన్నారు. పానో స్కోపి టెక్నాలజీ సాయంతో రోగికి నొప్పి తక్కువ ఉంటుందని,కీళ్ల వద్ద కేవలం చిన్నహోల్ మాత్రమే చేసి వైద్యం అందిస్తామన్నారు. వైద్యం పూర్తి చేసిన కొన్ని గంటల్లోనే ఇంటికి వెళ్ళ వచ్చాన్నారు. ఈ సాంకేతిక పరిజ్ఞానంకు సాధారణ ఖర్చుల కంటే పది శాతం ఖర్చు పెరుగుతున్నారు. సన్ షైన్ ఆర్థోపెడిక్ వైద్య బృందం పాల్గొన్నారు.

## నాలాగాటి రాధమ్మ కుటుంబాన్ని పరామర్శించిన పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ.

పాలేరు మార్చి 25 ప్రజా కలం న్యూస్ )

కూసుమంచి మండలం కేంద్రంలోని బుధవారం నాలాగాటి రాధమ్మ, కాలు ఇరగడంతో వారి స్వగ్రాహం నందు వారి ఆరోగ్య విషయాలు తెలుసుకున్న పాలేరు మాజీ శాసనసభ్యులు కందాళ ఉపేందర్ రెడ్డి, ప్రమర్శించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కూసుమంచి మండలం నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, సర్పంచులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు గ్రామస్తులు ,తదితరులు పాల్గొన్నారు.



## మహేశ్వరం శివ గంగ కోనేటి లో గుర్తుతెలియని మహిళా మృతదేహం

### పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలింపు
### మహిళను గుర్తిస్తే మహేశ్వరం పీఎస్ కు సమాచారం తెలియజేయాలి- మహేశ్వరం సి ఐ రాఘవేందర్ రెడ్డి

మహేశ్వరం, మార్చ్ 25,(ప్రజా కలం)

రంగారెడ్డి జిల్లా, మహేశ్వరం మండల కేంద్రంలోని శివ గంగ ఆలయ కోనేటి లో ఒక వృద్ధ మహిళ నీటిలో పడి మృతి



చెందినట్లు మహేశ్వరం పోలీసులు నిర్ధారించారు. ఈ విషయం తెలిసిన వెంటనే మహేశ్వరం పోలీస్ స్టేషన్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికి తీశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. మహిళ ఆనవాలు ఎరుపు రంగు చీర ధరించి ఉండగా, రెండు చేతులకు పచ్చ బొట్లు, బంగారు రంగు గాజులు ఉన్నాయి. మెడలో ఎరుపు రంగు పూసల గొలుసు ధరించి ఉంది. మృతురాలి వయసు సుమారు 55 నుండి 65 సంవత్సరాల మధ్యగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఈ ఫోటోలో కనిపిస్తున్న మృతురాలి గురించి ఎవరైనా సమాచారం తెలిసిన వారు దయచేసి మహేశ్వరం పోలీస్ స్టేషన్‌కు సంప్రదించి మహేశ్వరం ఎస్ హెచ్ ఓ ఫోన్ నంబర్లు 8712662368, ఎస్ ఐ 8712662404 నెంబర్లకు సంప్రదించాలని పోలీసులు కోరారు.

## దత్తత ప్రక్రియలో సిద్దిపేట బాలల సంక్షేమ సమితికి అరుదైన గౌరవం.

సిద్దిపేట జిల్లా మార్చి 25. ప్రజాకలం ప్రతినిధి

దత్తత ప్రక్రియలో విశేష ప్రతిభ కనబరిచిన సిద్దిపేట బాలల సంక్షేమ సమితికి అరుదైన గౌరవం లభించింది. అర్హులైన బాలల కేసులను సకాలంలో పరిశీలిస్తూ, చట్టబద్ధంగా దత్తతకు అర్హులుగా




ప్రకటించడంలో రాష్ట్రంలో ముందంజలో నిలవడం ద్వారా ఈ గుర్తింపు దక్కింది. బాలల సంక్షేమ సమితి ఇన్‌చార్జ్ చైర్మన్ దేశబోయిన నర్సింలు, సభ్యులు బాలచంద్రం, అంజమ్మ, మంజుల ఆధ్వర్యంలో సమితి సమర్థవంతంగా పనిచేస్తోంది. దత్తత ప్రక్రియను వేగవంతం చేయడంలో ఈ సమితి కీలక పాత్ర పోషిస్తున్నదని అధికారులు తెలిపారు. వారి కృషి ఫలితంగా అనేక మంది బాలలు సురక్షితమైన, ప్రేమగల శాశ్వత కుటుంబాలను పొందగలిగారు. ఈ సందర్భంగా “వేర్ ఆర్ ఇండియన్ చిల్డ్రన్స్” సంస్థ సీఈఓ మీరా మార్తి, సమితి సభ్యులకు ప్రశంసాపత్రాన్ని అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో డీసీపీవో రాము, బాలసదనం సూపరింటెండెంట్ వసంత, శిశుగృహ మేనేజర్ రాజు, సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పదవి ఉన్నా లేకున్నా ప్రజలకు అండగా ఉంటా...

### మాజీ షారుఖ్ హుస్సేన్.

సిద్దిపేట జిల్లా మార్చి 25 ప్రజాకలం ప్రతినిధి

తనకు పదవి ఉన్నా లేకున్నా ప్రజలతో అనుబంధం ఎప్పటికీ కొనసాగుతుందని, జీవితాంతం ప్రజాసేవకే అంకితం అవుతానని మాజీ ఎమ్మెల్సీ షారుఖ్ హుస్సేన్ అన్నారు. బుధవారం రాయపోల్ మండల కేంద్రంలో నూతనంగా గెలుపొందిన సర్పంచ్ మాసంపల్లి రాజును శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ తాను రాజకీయ ప్రవేశం చేసినప్పటి నుంచి నేటి వరకు ఎప్పుడూ ప్రజల మధ్యనే ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానన్నారు. పేదలకు ఎలాంటి ఆపద వచ్చినా అండగా నిలవడం తన బాధ్యతగా భావిస్తున్నానని చెప్పారు. గతంలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల ద్వారా అనేకమంది లబ్ధి పొందిన విషయాన్ని గుర్తు చేశారు. కుల, మత, పార్టీ భేదాలు లేకుండా అందరికీ సేవలందించడమే తన లక్ష్యమని, నియోజకవర్గ ప్రజల అభ్యున్నతి కోసం దాతల సహకారంతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. భవిష్యత్తులో కూడా మరిన్ని సేవా కార్యక్రమాలు కొనసాగిస్తూ ప్రజల మధ్యనే ఉంటానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు మంజూర్, లక్ష్మా రెడ్డి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.






## పేద కుటుంబానికి ఏజేఆర్ ఫౌండేషన్ చేయుత

వలిగొండ మార్చి 25 ప్రజాకలం:వలిగొండ పట్టణానికి చెందిన తోట లక్ష్మమ్మ దురదృష్టవశాత్తు అనారోగ్య రూపంలో తన రెండు కిడ్నీలు పనిచేయక తీవ్ర ఇబ్బందులు పడుతూ కాలం వెళ్ళదిస్తుంది.ఇట్టి విషయం తెలుసుకున్న పహిల్వాన్ పురం గ్రామానికి చెందిన ఏజేఆర్ ఫౌండేషన్ చైర్మన్ ఎలిమినేటి జంగారెడ్డి దయార్థ హృదయంతో వారి కుటుంబానికి ఆసరాగా నిలవాలని,10000 రూపాయల ఆర్థిక సహాయాన్ని,బాధితురాలికి అందజేశారు.దీనితో ఏజేఆర్ ఫౌండేషన్ ఎలిమినేటి జంగారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మద్యం నిషేధం పై యువత ముందడుగు
## పులిగిల్ల గ్రామంలో మద్యం నిషేధం

వలిగొండ మార్చి 25 ప్రజాకలం:యువకులు ప్రతిరోజు పొద్దున్నే మద్యం




దుకాణాలకు వెళ్లి మద్యం తాగి తమ ఆరోగ్యాన్ని పాడు చేసుకోవడంతో పాటు వారి వారి కుటుంబాలను సైతం నాశనం చేసుకుంటున్నారని, ఆలోచనతో వలిగొండ మండలంలోని పులిగిల్ల గ్రామంలో మద్యపాన నిషేధానికి గ్రామ యువత ముందడుగు వేసి తమ గ్రామంలో బెల్ట్ షాపులలో మద్యం అమ్మ వద్దంటూ గ్రామ పంచాయతీ కార్యదర్శి సైదులు కు,సర్పంచ్ వేముల అనూషకు వినతిపత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా గ్రామ నాయకులు మాట్లాడుతూ మద్యం విచ్చలవిడిగా బెల్టు షాపుల్లో లభిస్తుండడంతో స్థానిక యువకులు మద్యానికి బానిసలవుతున్నట్లు తెలిపారు.పలువురు రోగాలు, ప్రమాదాల భారిన పడుతున్నట్లు,వెల్లడించారుఈ నేపథ్యంలో అందరి ఆకాంక్ష మేరకు బెల్ట్ షాపుల మూసివేత నిర్ణయం తీసుకున్నట్లు,పేర్కొన్నారు. బెల్ట్ షాపుల మూసివేతకు తమ గ్రామస్తులందరి సహకారంతో,ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వడ్డేమాన్ దేవేందర్,వార్డు మెంబర్లు గ్రామ నాయకులు,యువకులు తదితరులు పాల్గొన్నారు

## నిజాయితీని చాటుకున్న సఫాయి కార్మికులు

వలిగొండ మార్చి 25 ప్రజాకలం:మండల పరిధిలోని వేములకొండ గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న గ్రామపంచాయతీ సిబ్బంది తమ నిజాయితీని చాటూకున్నరు.తమ రోజు వారి వీధులల్లో భాగంగా పారిశుధ్య పనులు నిర్వహిస్తుండగా పది తులాల వెండి పట్టిలు దొరికాయి. వెంటనే ఎవరో పోగొట్టుకున్నారు.అన్న సమాచారంతో అడగగా అదే



గ్రామానికి చెందిన బత్తుల నరసింహ,ఇట్టెలమ్మ వారికి చెందినవిగా గుర్తించి వెంటనే వారికి అందజేశారు.దీనితో నిజాయితీ చాటుకున్న పంచాయతీ కార్మికులకు కృతజ్ఞతలు తెలిపారు.

## 28న జాతీయ లోక్ అదాలత్.

**రాజీ మార్గం - రాజమార్గం.**

**రాజు పడితే ఇద్దరు గెలిచినట్టే.**

**రాయపోల్ ఎస్ఐ కె.మానస.**



సిద్దిపేట జిల్లా మార్చి 28. ప్రజాకలం ప్రతినిధి

జాతీయ లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రాయపోలు ఎస్ఐ కె.మానస తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మార్చి 28న నిర్వహించనున్న ఈ లోక్ అదాలత్ చిన్న చిన్న కేసులకు తక్షణ పరిష్కారం అందించే వేదికగా నిలుస్తుందని సూచించారు. కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయం, డబ్బు వృథా చేసుకునే పరిస్థితి నుంచి బయటపడేందుకు లోక్ అదాలత్ మంచి అవకాశం అని ఆమె పేర్కొన్నారు. కంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదాలు, ఆస్తి విభజన, కుటుంబ వివాదాలు, రోడ్డు ప్రమాదాలు, డ్రంక్ అండ్ డ్రైవ్, టౌన్ న్యూసెన్స్, చెక్ బౌన్స్ కేసులు వంటి వివిధ రాజీ పడదగిన కేసులను ఈ లోక్ అదాలత్ ద్వారా సులభంగా పరిష్కరించుకోవచ్చని తెలిపారు. సంబంధిత పోలీస్ స్టేషన్ లేదా న్యాయస్థానాన్ని సంప్రదించి ఇరువర్గాలు పరస్పరం రాజీకి రావచ్చని అన్నారు. ఇప్పటికే ప్రతి పోలీస్ స్టేషన్‌లో రాజీ పడదగిన కేసులను గుర్తించి, ఇరువర్గాల వారితో కౌన్సిలింగ్ నిర్వహిస్తూ అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. లోక్ అదాలత్ ద్వారా బాధితులకు త్వరితగతిన న్యాయం అందుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని తప్పక వినియోగించుకోవాలని తెలిపారు.

### పాలకుల వివక్ష కు వ్యతిరేకంగా...

# కదంతొక్కిన కలం కార్మికులు

**- ఐఅండ్ పీఆర్ కమీషనరేట్ ముట్టడి -జర్నలిస్టుల ర్యాలీ, ధర్నాతో దద్దరిల్లిన సమాచార భవన్**

**-విజయవంతంగా ఛలో హైదరాబాద్ -వివక్ష విడనాడకపోతే రాష్ట్రవ్యాపిత ఆందోళన**

**-టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య**






హైదరాబాద్, మార్చి 25 (ప్రజా కలం ప్రతినిధి)

జర్నలిస్టుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం అవలంబభిస్తున్న నిర్లక్ష్యవైఖరి, వివక్ష ధోరణికి నిరసనగా అనేక మంది జర్నలిస్టులు బుధవారం హైదరాబాద్ మాసబ్ ట్యాంక్ లోని రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ(ఐఅఃడ్ పీఆర్) కమీషనర్ కార్యాలయం(సమాచార భవన్) ముట్టడించారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) ఇచ్చిన రాష్ట్రవ్యాప్త జర్నలిస్టుల"ఛలో హైదరాబాద్"కార్యక్రమం పిలుపు మేరకు వివిధ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన జర్నలిస్టులు ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఐఅండ్ పీఆర్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ నిరసన ప్రదర్శన జరిపారు. అనంతరం జర్నలిస్టులు ప్రధాన ప్రవేశ ద్వారం ముందు బైఠాయించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ వివక్షకు వ్యతిరేకంగా జర్నలిస్టులు చేసిన నినాదాలతో సమాచార భవన్ దద్దరిల్లింది. ఈ సందర్భంగా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు,రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్లుగా జర్నలిస్టుల పట్ల వివక్ష చూపుతుందని, జర్నలిస్టుల సమస్యలను విస్మరించిందని విమర్శించారు. అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ లో జర్నలిస్టుల సంక్షేమం ఊసే లేదని, కనీసం జర్నలిస్టుల సంక్షేమం గురించి ఒక్క మాట కూడా చెప్పకుండా, నిధులు కేటాయించకుండా దారుణమైన అన్యాయం చేసిందని అన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచినా జర్నలిస్టులకు కనీసం కొత్త అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వలేదని,హెల్త్ కార్డులు సైతం ఇవ్వలేకపోయిందని ఆయన దుయ్యబట్టారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల ఊసే లేదని, సుప్రీం కోర్టు తీర్పును సాకుగా చూపి ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా తప్పుకుంటుందని ఆరోపించారు. పదవీవిరమణ పొందిన పాత్రికేయులకు అనేక రాష్ట్రాలలో పెన్షన్ ఇస్తుండగా, మన రాష్ట్రంలో ఏ ఒక్కరికీ పెన్షన్ ఇవ్వడంలేదని అన్నారు. చిన్న, మధ్య తరహా పత్రికలు, పీరియాడికల్స్ ను పూర్తిగా అణిచివేస్తున్నదని, గత రెండేళ్లుగా అడ్వర్టైజ్మెంట్స్ బిల్స్ చెల్లించలేదని ధ్వజమెత్తారు. ఆర్ ఎన్ ఐ, పీఆర్జిఐ రిజిస్ట్రేషన్ తో నడుస్తున్న అనేక చిన్న, మధ్య తరహా పత్రికలను ఎంపానల్మెంట్ చేయడం లేదని, కనీసం ఆ పత్రికలకు అక్రెడిటేషన్ కార్డులు కూడా ఇవ్వకపోవడం దారుణమని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత ఎన్నికల్లో జర్నలిస్టులకిచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయకుండా మోసం చేశారని మామిడి సోమయ్య ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రభుత్వం ఇదే విధంగా జర్నలిస్టుల సంక్షేమానికి ఎటువంటి చర్యలు తీసుకోకుండా వివక్ష చూపుతూ, నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తే రాష్ట్రవ్యాప్తంగా త్వరలో జర్నలిస్టుల చైతన్య యాత్రతో ప్రజల్లోకి వెళతామని మామిడి సోమయ్య హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జై స్వరాజ్ పార్టీ అధినేత కాసాని శ్రీనివాసరావు గౌడ పాల్గొని సంపూర్ణ మద్దతు తెలిపారు. ఆయన మాట్లాడు జర్నలిస్టులను విస్మరించే ప్రభుత్వాలకు పుట్టగతులు ఉండవని అన్నారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఫెడరేషన్ రాష్ట్ర కో– కన్వీనర్లు బండి విజయకుమార్, వల్లాల జగన్, తన్నీరు శ్రీనివాస్, కుడితాడు బాపూరావు, నేషనల్ కౌన్సిల్ సభ్యులు జగదీశ్వర్,కృష్ణమాచారి, ఎర్రమిల్లి రామారావు, రాష్ట్ర నాయకులు కే. పాండురంగారావు, పొట్లపల్లి శ్రీనివాస్ గౌడ్, మహమ్మద్ రఫీ, పద్మనాభరావు, ఉమామహేశ్వరరావు, హైదరాబాద్ జిల్లా కన్వీనర్ వి. రవి, కో– కన్వీనర్లు ఆర్.శ్రీనివాస్ గౌడ్, సంతోష్, బ్రహ్మం,మహిళా నాయకులు సాజిదా, మంజులారెడ్డి, శివపార్వతి, సుస్మిత, తీగవరపు శాంతి, వివిధ జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఐఅండ్ పిఆర్ డైరెక్టర్ కిషోర్ బాబుకు అందజేశారు.

## మన్యాంబావి దేవాలయ బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలి

**లేమూర్ మూర్ గ్రామ మాజీ సర్పంచ్ వెంకటేశ్వర స్వామి గుడి చైర్మన్ గూడూరు కొండారెడ్డి**







కందుకూరు, మార్చ్ 25,(ప్రజా కలం)

మార్చ్ 31 తేదీ నుండి ఏప్రిల్ 3 వరకు జరగబోయే శ్రీదేవి భూదేవి సామెత స్వయంబు శ్రీ వెంకటేశ్వర స్వామి మన్యాంబావి దేవాలయ బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని లేమూర్ గ్రామ మాజీ సర్పంచ్ వెంకటేశ్వర స్వామి గుడి చైర్మన్ గూడూరు కొండారెడ్డి పిలుపునిచ్చారు.

మహేశ్వరం నియోజకవర్గం కందుకూరు మండల కేంద్రం లేమూర్ గ్రామం లో మార్చ్ 31 తేదీ నుండి ఏప్రిల్ 3 వరకు జరగబోయే శ్రీదేవి భూదేవి సామెత స్వయంబు శ్రీ వెంకటేశ్వర స్వామి మన్యాంబావి దేవాలయ బ్రహ్మోత్సవాలకు ముఖ్య అతిధులు తెలంగాణ టీపీసీసీ అధ్యక్షులు శ్రీ మహేష్ కుమార్ గౌడ్, ఐటీ శాఖ మంత్రి వర్యులు దుద్ధిల్లా శ్రీధర్ బాబు, ఆంధ్రప్రదేశ్ పీసీసీ ప్రెసిడెంట్ వైస్ ఎస్ షర్మిళ రెడ్డి, ఏఐసీసీ సెక్రటరీ చరణ్ ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, తెలంగాణ రాష్ట్ర ప్రజావాణి ఇంచార్జి జిల్లెల చిన్నరెడ్డి గారిని లేమూర్ మూర్ గ్రామ మాజీ సర్పంచ్, వెంకటేశ్వర స్వామి గుడి చైర్మన్ గూడూరు కొండారెడ్డి ఆధ్వర్యంలో ఆహ్వానించడం జరిగిందని ఆయన తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మా గ్రామం లో అత్యంత వైభావంగా జరిగే ద్వితీయ బ్రహ్మోత్సవాలకు కందుకూరు, మహేశ్వరం మండలల నుండి పెద్ద ఎత్తున ప్రజలు హాజరువుతున్నారు కావున అందరు నాయకులు, ప్రజలు హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమం లో మాజీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఢిల్లీ శ్రీధర్ ముదిరాజ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా మైనారిటీ నాయకులు మహమ్మద్ రహీమ్,గూడూరు రవీందర్ రెడ్డి, మంచాల భాస్కర్, ఉదయ్ రెడ్డి,గుర్రం సత్తయ్య గంగరి దర్శన్,గుల్వి నర్సింహా,రఘునాథ్, తదితరులు పాల్గొనడం జరిగింది.

## మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తికి మూడు రోజులు జైలు శిక్ష.



సిద్దిపేట జిల్లా మార్చి 25. ప్రజాకలం ప్రతినిధి

రాయపోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్ఐ మానస సిబ్బందితో కలిసి రాయపోల్––గజ్వేల్ రహదారి పరిసర ప్రాంతాల్లో వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఒక వ్యక్తి మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడు. బ్రీత్ అనలైజర్‌తో పరీక్షించగా మద్యం సేవించినట్లు నిర్ధారణ అయింది. అతడిని బుధవారం గజ్వేల్ ఏడీఎం కోర్టు మెజిస్ట్రేట్ మణివీర్ ముందు హాజరు పరచగా, 3 రోజుల జైలు శిక్ష విధించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మానస మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ప్రతిరోజూ డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల డ్రైవర్‌కే కాకుండా ఇతర రహదారి వినియోగదారులకు కూడా ప్రమాదం ఏర్పడుతుందని హెచ్చరించారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వారిని కోర్టులో హాజరు పరచగా, మెజిస్ట్రేట్ విచారణ అనంతరం రూ.10,000 వరకు జరిమానా విధించే అవకాశం ఉందని తెలిపారు.

## పేద రోగులకు అండగా కాంగ్రెస్ సర్కార్

**-సి ఎం ఆర్ ఎఫ్ తో ఆర్థికంగా సీఎం రేవంత్ చేయూత**

**-రోగుల పాలిట వరంగా ముఖ్యమంత్రి సహాయనిధి**

**మహేశ్వరం, మార్చ్ 25, (ప్రజా కలం)**

సిఎంఆర్ఎఫ్ తో పేదలకు ఆర్థిక చేయూత అందుతుందని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు.తుక్కుగూడ కార్యాలయంలో పలువురు రోగులు, వారి బంధువులకు కాంగ్రెస్ నేతల సమక్షంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను కె ఎల్ ఆర్




అందజేశారు.ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ పేదలకు ఆస్పత్రి చికిత్సలు భారంగా మారకుండా ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో దోహదపడుతుందన్నారు.మహేశ్వరం నియోజకవర్గంలో పార్టీలకు అతీతంగా పేదలకు అవసరమైన ఆస్పత్రి చికిత్సలు, సి ఎం ఆర్ ఎఫ్, లోకల్ లు అందిస్తున్నామని కిచ్చెన్నగారు చెప్పారు.ప్రభుత్వంపై భారం పడినా పేదలకు అందించే సంక్షేమ పథకాల్లో కోతలు లేకుండా అందిస్తున్నామని కె ఎల్ ఆర్ తెలిపారు.కార్పొరేట్ వైద్యం సహా రేషన్ కార్డులు ఉన్న వారందరికీ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా శస్త్రచికిత్సలు, వైద్య సహాయం అందించటం జరుగుతుందని కిచ్చెన్న హామీ ఇచ్చారు.పేద రోగుల కుటుంబాలకు తెలంగాణ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి గారు అండగా నిలబడుతున్నారని లక్ష్మారెడ్డి కొనియాడారు.ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ నేతలు, రోగులు వారి బంధువులు పాల్గొన్నారు.

## జిహెచ్ఎంసి కి 8 కిమీల పరిధిలో హెచ్ఆర్ఏ 24% త్వరగా అమలు చేయాలి

**టీజీవో అధ్యక్ష కార్యదర్శులు**

**డా కే. రామారావు, శ్రీనేష్ కుమార్ నోరి**



రంగారెడ్డి కలెక్టరేట్, మార్చ్ 25,(ప్రజా కలం) ఐ డి ఓ సి, కొంగరకలాన్ నందు రంగారెడ్డి జిల్లా టీజీవో అసోసియేషన్ కార్యవర్గ సమావేశంలో తీర్మానించిన విధంగా విస్తరించిన జీహెచ్ఎంసీ పరిధికి చుట్టుపక్కల 8 కిలోమీటర్ల పరిధిలో ఉన్న ప్రాంతాలకు ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని, 24% ఇంటి అద్దె భత్యం (హెచ్ఆర్ఏ) మంజూరు చేయాలని (జీఓ ఎంఎస్ నెం. 53 ఆర్థిక (హెచ్ఆర్ఎం. 5) శాఖ, తేదీ: 11.06.2021) తెలంగాణ ప్రభుత్వాన్ని కోరుతూ, రంగారెడ్డి జిల్లా తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ తరపున రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డిని సంగీత, డిఆర్ఓ గారి ద్వారా విజ్ఞప్తి చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో టీజీవో అసోసియేషన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు డాక్టర్ కే రామారావు, కార్యదర్శి శ్రీనేష్ కుమార్ నోరి, నూతనకంటి వెంకట్, శ్రీమతి అలివేలు, శ్రీమతి సైదమ్మ, శ్రీ రాకేష్, పావని, ఉమ, డి పి ఆర్ ఓ బాలేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# కబ్జాలపై హైడ్రా పంజా

## - క్షేత్రస్థాయిలో కమిషనర్ రంగనాథ్ పర్యవేక్షణ





**హైదరాబాద్, మార్చి 25 (ప్రజా కలం ప్రతినిధి)**

ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులపై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ బుధవారం క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. సంగారెడ్డి జిల్లా పటాన్ చెరువు, అమీన్‌పూర్ మండలాల్లో పర్యటించిన ఆయన, లేఅవుట్లలో అక్రమాలు, ప్రభుత్వ భూముల ఆక్రమణలు మరియు నాలాల పూడ్చివేతపై అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు.

**లేఅవుట్ మార్చి కబ్జా చేస్తే వదిలేదే లేదు**

పటాన్ చెరు మండలం పాటిఘనాపూర్ గ్రామంలోని ఆనందనగర్ లేఅవుట్ను కమిషనర్ పరిశీలించారు. 1980లో 92 ఎకరాల్లో 1109 ప్లాట్లతో వెలిసిన ఈ లేఅవుట్ హద్దులను చెరిపేసి, వ్యవసాయ భూమిగా చిత్రీకరించి ధరణి ద్వారా పాస్ బుక్స్ సృష్టించారని బాధితులు కమిషనర్‌కు మొరపెట్టుకున్నారు. పార్కులు, రహదారుల స్థలాలను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని, లేఅవుట్ ప్రకారం హద్దులు గుర్తించి ఆక్రమణలు తొలగించాలని ఆయన అధికారులను ఆదేశించారు.

**బాధితులకు భరోసా.. ప్రభుత్వ భూములకు ఫెన్సింగ్**

అమీన్‌పూర్ మండలం బీరంగూడలోని సర్వే నంబర్లు 996, 997లో ఉన్న ఇండస్ట్రియల్ ఎంప్లాయీస్ కోపరేటివ్ సొసైటీ లేఅవుట్ ఆక్రమణలపై కూడా రంగనాథ్ గారు విచారణ చేశారు. 180 ఎకరాల్లోని ఈ లేఅవుట్‌ను ఆక్రమించి చిన్న చిన్న ప్లాట్లుగా అమ్ముతున్నారని సొసైటీ ప్రతినిధులు ఫిర్యాదు చేశారు.

ఇక్కడ ప్రభుత్వ భూమి చుట్టూ ఫెన్సింగ్ వేయాలని సూచిస్తూనే, ఇప్పటికే ఇళ్లు కట్టుకుని నివసిస్తున్న వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కమిషనర్ వారికి హామీ ఇచ్చారు.

**నాలాల మూసివేతపై క్రిమినల్ కేసులు**

బీరంగూడలోని శంభుని కుంట అవుట్‌లెట్లను పరిశీలించిన కమిషనర్, వరద కాలువలను మూసివేసి నిర్మాణాలు చేపడుతున్న సంస్థలపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

దీనివల్ల స్థానిక నివాస ప్రాంతాలు మునిగిపోతున్నాయని గుర్తించి, తక్షణమే వరద కాలువలను పునరుద్ధరించాలని మరియు బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు.





# అక్రమ నిర్మాణాలకు అడ్డాగా కోకాపేట

**- 250 గజాల్లో ఐదు అంతస్తుల అక్రమ భవనం**

**- నార్సింగి సర్కిల్ జిహెచ్ఎంసి అధికారుల నిర్లక్ష్యం**

**- అధికారులకు తెలిసి కూడా అటువైపు కన్నెత్తి చూడకపోవడం**

**- అధికారులకు ముడుపులు ముట్టాయి అని పలు అనుమానాలు**

**రాజేంద్రనగర్, మార్చ్ 25,(ప్రజా కలం తడక నర్సింహా)**

రాజేంద్రనగర్ నియోజకవర్గం నార్సింగి సర్కిల్ జిహెచ్ఎంసి పరిధిలోని కోకాపేట్ గ్రామంలో అక్రమ నిర్మాణాలు హద్దులు దాటుతున్నాయి.కేవలం 250 గజాల స్థలంలో అనుమతులకు విరుద్ధంగా సెల్లార్ తొ కూడిన ఐదు అంతస్తుల భారీ భవనం ఏటువంటి అడ్డంకులు లేకుండా నిర్మాణంలో కొనసాగుతుండటం స్థానికంగా తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది.హాఇంత భారీ అక్రమ నిర్మాణం జరుగుతున్నా సంబంధిత సర్కిల్ అధికారులు మౌనం పాటిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.అనుమతులు లేకుండా సెల్లార్ తవ్వడం ఎలా సాధ్యమైంది.ఐదు అంతస్తులకు అనుమతి ఎలా ఇచ్చారు, ఫైర్ సేఫ్టీ అనుమతులు ఎక్కడ వంటి ప్రశ్నలు ప్రజల్లో ఉత్పన్నమవుతున్నాయి.చిన్నపాటి ఇల్లు నిర్మించాలన్నా సామాన్య ప్రజలను నిబంధనల పేరుతో వేధించే అధికారులు, ఈ అక్రమ భవనంపై మాత్రం కళ్లుమూసుకోవడం అనుమానాలకు తావిస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఫిర్యాదులు అందిన ప్పటికీ నిర్మాణాన్ని నిలిపివేయకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని ప్రజలు మండిపడుతున్నారు. హాఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అక్రమ భవనాన్ని వెంటనే సీజ్ చేసి, బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అధికారులకు తెలుసునా చర్యలు తీసుకోకపోవడంపై ముడుపులు ముట్టాయా అని పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి వెంటనే అధికారులు బిల్డింగ్ సీజ్ చేసి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# శంషాబాద్ బస్టాండ్ వద్ద ఉచిత మజ్జిగ పంపిణీ

## ప్రయాణికులకు ప్రజలకు దాహం తీరుస్తూ అందరికీ ఆదర్శంగా నిలిచిన ప్రముఖ వ్యాపారవేత్త సామాజిక కార్యకర్త కందకట్ల సిద్ధు రెడ్డి




శంషాబాద్, మార్చ్ 25,(ప్రజా కలం)

శంషాబాద్ బస్టాండ్ వద్ద ఉచిత మజ్జిగ పంపిణీ చేస్తూ అందరికీ ప్రముఖ వ్యాపారవేత్త సామాజిక కార్యకర్త కందకట్ల సిద్ధు రెడ్డి ఆదర్శంగా నిలిచారని అన్నారు. భానుడి భగభగలకు అల్లాడిపోతున్న సామాన్యుల దాహం తీర్చడమే లక్ష్యంగా యువ నేత, సామాజిక కార్యకర్త కందకట్ల సిద్ధు రెడ్డి అభినందనీయమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. శంషాబాద్ బస్టాండ్ సమీపంలో ప్రయాణికులకు, పాదచారులకు ఆయన ఉచితంగా చల్లని మజ్జిగను పంపిణీ చేస్తున్నారు. ?సేవా యజ్ఞంలో సిద్ధు రెడ్డి?"మాకు డబ్బులు వద్దు.. మీ ఆశీస్సులు ఉంటే చాలు" అంటూ సిద్ధు రెడ్డి ప్రతిరోజూ వేలాది మందికి నాణ్యమైన మజ్జిగను అందిస్తున్నారు. ఎటువంటి ఆర్భాటం లేకుండా, ప్రచారానికి దూరంగా తన సొంత ఖర్చులతో ఈ సేవను కొనసాగిస్తుండటం గమనార్హం.

ఈ సేవా కార్యక్రమం కోసం ఆయన ప్రతిరోజూ సుమారు 30 వేల రూపాయలు వెచ్చిస్తున్నారు.మానవత్వానికి నిదర్శనం కేవలం పానీయం అందించడమే కాకుండా, మనిషికి మనిషి తోడుండాలనే గొప్ప సందేశాన్ని ఆయన చాటుతున్నారు. ఎండ తీవ్రతతో ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు సిద్ధు రెడ్డి చేస్తున్న ఈ కృషిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నారు. "ఇది కేవలం మజ్జిగ పంపిణీ కాదు.. ఎండిపోతున్న మానవత్వానికి చల్లని రూపం" అని స్థానికులు కొనియాడుతున్నారు. కందకట్ల సిద్ధు రెడ్డి (యూత్ ఐకాన్ గా నిలిచారని సొంత నిధులతో ప్రతిరోజూ వేల మందికి దాహార్తిని తీర్చడం ఆయన లక్ష్యం అని అన్నారు.?ఎలాంటి ఆశలు లేకుండా సామాజిక బాధ్యతగా సాగుతున్న ఈ కార్యక్రమం చూస్తుంటే, సమాజంలో మానవత్వం ఇంకా సజీవంగానే ఉందనిపిస్తోంది.






# గుడిసెలు లేని పల్లెలే కాంగ్రెస్ లక్ష్యం

**- ఇందిరమ్మ ఇళ్లతో పేదల కుటుంబాల్లో ఆనందం**

**- ఎన్ డి తండా, గంగారాం గ్రామాల్లో ఇందిరమ్మ గృహప్రవేశాల్లో పాల్గొన్న**

**- మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్ఛార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి**





మహేశ్వరం, మార్చ్ 25,(ప్రజా కలం)

గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఒక్క పేదవాడికి ఇల్లు కట్టించలేదని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. మహేశ్వరం మండలం ఎన్డీ తండా, గంగారం గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో కలిసి గృహ ప్రవేశం చేయించారు.ఈ సందర్భంగా కె ఎల్ ఆర్ మాట్లాడుతూ డబుల్ బెడ్ రూమ్స్, ఇందిరమ్మ ఇళ్లను కాంగ్రెస్ సర్కార్ లోనే పేదలకు ఇస్తున్నామని చెప్పారు. సొంత ఊర్లోనే బడుగు, బలహీన వర్గాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి రూ.5 లక్షలు ఇచ్చామని తెలిపారు. తొలి విడత ఇళ్లన్నీ పూర్తి కావొచ్చయన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలు సహా అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని లక్ష్మారెడ్డి అన్నారు. పేద, మధ్య తరగతి ప్రజలకు రేషన్ కార్డులు, సన్నబియ్యం, ఉచిత విద్యుత్, రూ.500 గ్యాస్ సిలెండర్, బస్సు ప్రయాణం ఇస్తున్నామని తెలిపారు. కొత్త పెన్షన్లు సహా ఇతర హామీలను దశలవారీగా అమలు చేస్తామని కిచ్చెన్నగారు హామీ ఇచ్చారు. ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులు, మహిళలతో కలిసి మిఠాయిలు పంచారు. కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి రాకతో గ్రామస్థులు, కాంగ్రెస్ శ్రేణులు, ఇళ్ల లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేసి... ఘన స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ, మార్కెట్, దేవాదాయ, గ్రామ, బూత్, మండల కమిటీలు, మహిళా నాయకురాళ్లు సహా కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ను కలిసిన ఎమ్మార్పీఎస్ నాయకులు



**మల్కాజిగిరి మార్చ్ 25,(ప్రజా కలం)**

నూతన మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ గా బాధ్యతలు తీసుకున్న కమిషనర్ వినయ్ కృష్ణ రెడ్డి ఐఏఎస్ ను ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు,మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఇన్చార్జి, తిప్పారపు లక్ష్మణ్ మాదిగ, జాతీయా నాయకులు ఎంఎస్ పి జిల్లా అధ్యక్షుడు కేశపాగ రామచందర్,ఎం జె ఎఫ్ రాష్ట్ర నాయకులు మనోహర్,మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు పంగ ప్రణయ్ మాదిగ, జిల్లా నాయకులు కొలిపాక అంజి మాదిగ,జర్నలిస్ట్ సంఘ నాయకులు సంతోష్ లు కమిషనర్ కార్యాలయం తార్నాకలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతనంగా కమిషనర్ గా బాధ్యతలు తీసుకున్న సందర్భంగా అభినందించడం జరిగిందని,నూతన మున్సిపల్ కార్పొరేషన్ లో షెడ్యూల్ కులాల, అనగారిన వర్గాల అభివృద్ధికి సహకారం చేయాల్సిందిగా కోరినట్లు పేర్కొన్నారు.

Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by **KALAKONDA RAMAKRISHNA**, Printed at **TEJOMAI PUBLICATION**, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013
Published from H.No.10-1-7, Bada Bazar, Beside Pothalingaiah Temple, Azam Raod, Nizamabad,TS -503001 TELANGANA - 503001.
Editor: **KALAKONDA RAMAKRISHNA**, **PRGI.No. TELTEL/2010/33275,** Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com